VICTORY

విక్టరీ

అమరజీవి

# పొట్టి శ్రీరాములు

(1901 - 1952)



బయోగ్రఫీ సిరీస్

అమరజీవి

# పొట్టి శ్రీరాములు

✍
ఆవంచ సత్యనారాయణ

విక్టరీ పబ్లిషర్స్
డోర్. నెం. 30-17-3ఎ, వారణాశివారి వీధి, సీతారాంపురం,
విజయవాడ- 520 002. ఫోన్ : 0866 - 2444156.

అమరజీవి

# పొట్టి శ్రీరాములు

© Ln. **I. Ramakumar,** PMJF
Immadisetty Akkeswara Rao
Charitable Trust, Vijayawada.

ప్రథమ ముద్రణ : 2006
తృతీయ ముద్రణ : 2014

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్**

**శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో**
30-17-3A, వారణాశివారి వీధి,
సీతారాంపురం, విజయవాడ - 2.
ఫోన్ : **0866 - 2444156**

**సాయి వెంకటేశ్వర బుక్ డిపో**
26-27-77, బాటా షోరూమ్ ఎదురు,
గాంధీనగర్, విజయవాడ - 520 003.
ఫోన్ : **(0866) 2570192, 2570309**

**సాయి వెంకటేశ్వర బుక్ డిపో**
ప్లాట్ నెం. 3, 103, 2-4-1085,
సాయిలక్ష్మి నికేతన్,
రామకృష్ణా హాస్పటల్ ఎదురువీధి,
కాచిగూడ కుమార్ థియేటర్ దగ్గర,
నింబోలి అడ్డ, హైదరాబాదు - 500027.
ఫోన్ : **(040) 65528228, 24653879**
(ఫాక్స్) **24745257,** సెల్ : **9346771314**

**మనవి :** మాచే ప్రచురించబడిన అన్ని రకముల పుస్తకములు అన్ని ప్రముఖ బుక్ షాపు లలోను, విశాలాంధ్ర మరియు ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచిలలోను లభించును. లభించని యెడల మమ్ములను నేరుగా సంప్రదించగలరు. పుస్తకాలలో ఏవైనా లోపాలు, తప్పులు ఉన్నా తెలియచేసిన తదుపరిముద్రణలో సరిచేయగలం. ఏవిషయమైన **ramakumarimmadisetty@yahoo.com** మెయిల్‌కు తెలియ జేయవచ్చును. మీకు కావలసిన పుస్తకాలకు : **SBI online A/c. No. 31712393082 సాయి వెంకటేశ్వర బుక్ డిపో, విజయవాడ** పేరున జమచేసి, మీకు దగ్గర గల ట్రాన్స్‌పోర్టు వివరాలు తెలుపవలెను.

***Published by :*** **విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ**

**We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.**

# ఒక మాట

ప్రజాబాహుళ్యం కోసం తమ ధన, మాన, ప్రాణాలను కూడా తృణ ప్రాయంగా త్యజించటానికి ఏమాత్రం వెనుకాడకుండా పదిమంది మేలే తమకు జరిగే మేలుగా భావించారు ఎందరో మహానుభావులు. వారి భవిష్యద్దర్శనం వలన, చేసిన నిస్వార్థ సేవల వలన ఈనాడు మనం స్వతంత్ర భారతదేశంలో స్వేచ్ఛగా మనగలుగు తున్నాము. భారతజాతి అంతా వారికి ఏమి ఇచ్చి ఋణం తీర్చుకోగలదు? మన భావితరాల వారికి ఆ సౌజన్యమూర్తులు చేసిన సేవలు, వారు అనుసరించిన వ్యక్తిత్వం, తమదైన వారి శీలాన్ని పరిచయం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇందు వలన భావిభారత పౌరులైన నేటి విద్యార్థులు నాటి మహానుభావుల అసమాన త్యాగాలను గుర్తించి వారి గుణగణాలచే ఉత్తేజితులు కావటం ఒకటైతే, ఆ మార్గంలో ప్రవర్తించటానికి అవసరమైన ప్రేరణతో దేశ స్వాతంత్ర్యఫలాలు అందరికీ లభ్యమై ప్రపంచంలోని సౌభాగ్యవంతమైన దేశాలలో మనదేశం ఒకటిగా నిలబెట్టగలిగే ప్రేరణ పొందుతారనేది మేము ఆశిస్తున్న మరొక ప్రయోజనము. అందుకే ఒక సిరీస్‌గా అనేకమంది జాతి నిర్మాతల జీవి తాలను విద్యార్థులకు పరిచయం చేయాలను కొని ఈ ప్రచురణను తీసుకొని వస్తున్నాము.

అందరికీ అందుబాటు ధరలో, ఆకర్షణీయంగా ఉండే శైలిలో పుస్తకాల ముద్రణ జరిగింది. పాఠశాలలు, కళాశాలలో చదువుతూ కిశోరప్రాయం (ఎడాలిసెన్సు)లో ఉన్న విద్యార్థినీ విద్యార్థులను ఈ పుస్తకాలు సరియైన మార్గంలో ప్రభావితులను చేయగలవని మా ఆకాంక్ష. ఈ మహోన్నత లక్ష్యంలో మేము ఏమాత్రం కృతకృత్యు లము కాగలిగినా మా ఆశయం నెరవేరినట్లే.

ఈ పుస్తకాన్ని చదివి లోటుపాట్లను తెలియచేస్తే మలి ముద్రణలో సరిచేసు కోగలం.

వీటిని గ్రంథాలయాధికారులు, పాఠశాలలు, కళాశాలల ప్రధాన అధ్యాపకులు, అధికారులు, ఇతర పెద్దలు, విద్యాశాఖాధికారులు ఆదరించ గలరనే నమ్మకంతో...

- పబ్లిషర్స్

# పూర్వ రంగం

తెలుగుజాతి ఆంధ్రజాతిగా ఐతరేయ బ్రాహ్మణ కాలం నుంచే తమ ప్రత్యేకతను నిలుపుకొన్నది. ఐతరేయ బ్రాహ్మణం అంటే ఋగ్వేదంలోని కొంతభాగం. ఆనాడు వీరు విశ్వామిత్రుని కోపానికి గురియై అడవులుపట్టి పోయారని ఋగ్వేదం తెలుపుతున్నది. ఇది కొన్ని వేల సంవత్సరాలనాటి మాట. తరువాతి కాలంలో ఆంధ్రులు బలవంతులై కోటలుగట్టి, రాజ్యాలు స్థాపించి నాగరికతను పెంచుకొని ఒక విశిష్ట జాతిగా వర్ధిల్లారు. రామాయణంలో వాల్మీకి మహర్షి ఆంధ్రులను ప్రత్యేకంగా పేర్కొన్నాడు. అటు తరువాత మహాభారత కాలానికి ఆంధ్రజాతి బలమైన జాతిగా నిలిచింది. మహాభారత, కురుక్షేత్ర యుద్ధంలో ఆంధ్రులు కౌరవుల పక్షాన పోరాడారని భారతం ద్వారా తెలుస్తున్నది. బౌద్ధ వాఙ్మయం నుంచి కూడా గోదావరీ తీరంలో అంధకరట్ఠము అనే దేశము ఉన్నదని. అదే నేటి ఆంధ్ర దేశమని తెలుస్తున్నది బావరి అనే ఒక బౌద్ధముని గోదావరీ నదీ ప్రాంతంలోని అంధకరట్ఠములో నివసించాడని, తెలుస్తున్నది. అంతే గాకుండా, బౌద్ధులకు ముఖ్య గ్రంథం అయిన "సుత్తనిపాతం" అనే గ్రంథం లోని "డరాయన వగ్గం" అనే భాగంలో వత్థుగాథ అనే కథ ఉన్నది. ఆ కథలో అస్సక, అళకులు అనే ఇద్దరు అంధక రాజులు పేర్కొన బడ్డారు. వీరు ఆంధ్ర రాజులే అని కూడా తెలుస్తున్నది. అంటే బుద్ధుని కాలంనాటికే ఆంధ్ర రాజులు రాజ్యాధి నేతలుగా పరిపాలన సాగిస్తున్నారన్నమాట.

తరువాత క్రీ.శ. కాలం నాటికే ఎంతో విశిష్టతను సంపాదించుకొని కోటలు పేటలు కట్టిన ఆంధ్రులు దక్షిణాపథంలో అంటే వింధ్య పర్వతాలకు దక్షిణంగా పెద్ద సామ్రాజ్యాన్ని స్థాపించారు. ఈ రాజులు ముప్పై తరాలకు చెందినవారు. సుమారుగా నాలుగు వందల యాభై సంవత్సరాలకు పైగా పరిపాలన సాగించారని మార్కండేయ మత్స్య పురాణాల ద్వారా మనకు తెలుస్తున్నది. ఇలా ఆంధ్రజాతి పురాణాలలో కూడా తమ ప్రత్యేకతను నిలుపుకొన్నది. వీరు మౌర్య సామ్రాజ్యాధినేతలకు కొంతకాలము సామంత రాజులుగా ఉన్నట్లు తెలుస్తున్నది. వేద, ఇతిహాస, పురాణ కాలాలలోను, అటు తరువాత క్రీ.శ. నాలుగవ శతాబ్దం వరకు ఆంధ్రుల ప్రభ భారతదేశం అంతటా వెలిగినా ఎందుకో అటుతరువాత ఈ జాతి ప్రత్యేకతను కోల్పోయింది. దాదాపు ఆరేడు శతాబ్దాల పాటు ఆంధ్రరాజుల దేశాల చరిత్ర అంతంత మాత్రంగానే తెలుస్తున్నది. కానీ శ్రీకృష్ణదేవరాయల కాలం నాటికి తిరిగి తమ వైశిష్ట్యాన్ని పునః సంపాదించుకొనగలిగింది.

అయితే అటు తరువాత 17వ శతాబ్దం చివరలో భారతదేశానికి వర్తక, వ్యాపారాలు చేసుకొనటానికి ఆంగ్లేయులు వచ్చారు. వారు మొదట జహంగీరు చక్రవర్తి దగ్గర వ్యాపారం చేసుకొనటానికి, కలకత్తా ప్రాంతంలో నివాసం ఏర్పరచుకొనటానికి అనుమతి తీసుకొన్నారు. క్రమంగా డచ్చివారు, పోర్చుగీసువారు, పరాసు (ఫ్రాన్సువారు) ఈ దేశం చేరుకొన్నారు. వారంతా తమ సరకులను నిలవ చేయటానికి గిడ్డంగులను సముద్ర ప్రాంతంలో నిర్మాణం చేసుకొన్నారు. క్రమంగా దొంగల బారిన పడకుండా అని వాటిని కోటలుగా మార్చారు. దేశంలో అనేక తీర ప్రాంతాలలో వారు స్థావరాలను ఏర్పాటు చేసుకొన్నారు. మన ఆంధ్ర దేశానికి సంబంధించి నంత వరకు మచిలీపట్నం (బందరు)లోను ఇంకా మరికొన్నిచోట్ల స్థావ రాలను ఏర్పాటు చేసుకొన్నారు. వ్యాపారంలో వారిలో వారికే పోటీలు ఏర్పడి, యుద్ధాలు చేసుకొన్నారు. యూరఫ్ ఖండంలో వారి మాతృ దేశాలలో జరిగిన యుద్ధాలకు ఇవి కొనసాగింపులుగా కూడా మారాయి. కాలంగడిచే కొద్దీ ఇతర

యూరోపియన్లను ఆంగ్లేయులు అధిగమించి వారినందరిని దేశం నుంచి దాదాపుగా వెళ్లగొట్టారు.

అటు తరువాత క్రమంగా భారతీయులలోని అనైక్యత, నూతన యుద్ధపద్ధతులతో పరిచయం లేకపోవటం, ప్రజల అజ్ఞానాలను ఆధారం చేసుకొని మన రాజుల మధ్య కయ్యాలుపెట్టి వాటిలో తాము జోక్యం చేసుకొని కొన్ని ప్రాంతాలను తమ పలుకు బడిలోనికి తెచ్చుకొని అధికారం చెలాయించటం మొదలు పెట్టారు. ఇలా ఒకటొకటిగా దేశంలోని ఎన్నో ప్రాంతాలు ఆంగ్లేయుల అధీనం లోనికి వచ్చాయి. ఆంగ్లేయులు వారి పాలనా సౌలభ్యానికి దేశాన్ని నాలుగు ముఖ్య ప్రావిన్సులుగా చేశారు. మొదటిది కలకత్తా, రెండవది బొంబాయి, మూడవది ఢిల్లీ నాల్గవది మద్రాసు. మద్రాసు ప్రావిన్సులో ఆనాడు నేటి తమిళ, కేరళ, కర్నాటక, ఆంధ్ర, కొంత ఒరిస్సా భాగం కూడా చేరిపోయింది. ప్రభుత్వం మద్రాసులో ఉండటం, తమిళుల నోటి జబర్దస్తీకి మిగిలిన ప్రాంతాలవారి ఉనికి కూడా తెలియకుండాపోయింది. దానితో ఉత్తరాది వారి దృష్టిలో ఆంధ్రులు కన్నడిగులు, కేరళవారు అందరూ మద్రాసీలు అయిపోయారు. ఆంధ్ర దేశంలో వ్యాపారం చేసుకోటానికి పంజాబు, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్ మొదలైన ప్రాంతాల నుంచి ఎందరో వచ్చి చేరారు. వారికందరికి తాము ఆంధ్రా ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో ఉంటున్నామనే, మద్రాసు ప్రాంతం ఆంధ్ర ప్రాంతం వేరని గానీ తమిళులకు, తెలుగు వారికి భేదం ఉన్నదని గానీ, స్పృహ గానీ, ఆంధ్రులకు ఒక ప్రత్యేక భాష తెలుగు ఉన్నదని గానీ, తెలుసుకొనే స్పృహ లేకపోయింది. ఇది బ్రిటిష్ వారి కాలంలోనే కాదు స్వాతంత్ర్యం వచ్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడి పదిహేను సంవత్సరాలకు పైగా గడచిపోయిన కాలంలో కూడా తెలుగు వారిని ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతం, రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చిన వారిని మద్రాసీలనటం ఉత్తరాదివారు ఆచరించిన విషయం. ఇలా ఆంధ్రులు తమ ఉనికిని, ప్రత్యేక భాష ఒకటి ఉన్నదనే విషయాన్ని గూడా మరచి పోయిన స్థితి. సరిగా

ఇలాంటి స్థితి నుంచి మనలను బయట వేయటానికి ప్రథమ ప్రయత్నంచేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు గారు. ఆయన మనకు తెచ్చిన ఈ గుర్తింపును ప్రత్యేకించి చెప్పటానికే ఈ పూర్వ రంగం వివరంగా తెలపటం అవసర మైంది.

క్రమంగా దేశంలో స్వతంత్ర గాలులు వీచటం మొదలైంది. మన దేశీయులు స్వరాజ్యం కోసం బ్రిటిష్ వారితో పోరాడటం ప్రారంభించారు. ఈ పోరాటానికి నాందిగా 1885లోనే భారత జాతీయ కాంగ్రెస్ ప్రారంభం అయింది. దేశం నలుమూలల లోని విద్యావంతులు, స్వాతంత్ర్యాభి లాషులు, దేశభక్తిపరులు ఈ కాంగ్రెస్‌లో చేరి ప్రతి సంవత్సరం పాలనా సంస్కరణలు మొదలైన వానికోసం తీర్మానాలను చేస్తుండేవారు. క్రమంగా కాంగ్రెస్ వారి భావాలు సంపూర్ణ స్వతంత్రం వైపు మొగ్గాయి. ఇదే సమయంలో బాల గంగాధరతిలక్ రంగం మీదకు వచ్చాడు. ఆయన "స్వాతంత్ర్యమే నా జన్మహక్క"ని అప్పటి వరకు కాంగ్రెస్ చేస్తున్న ఉద్యమానికి ఒక దిశనూ సరియైన దశనూ కల్పించాడు. 1905వ సంవత్సరంలో బ్రిటిష్ ప్రభుత్వం వారు వంగదేశాన్ని (బెంగాల్) రెండుగా విభజన చేశారు. అది బెంగాలీలకు కంటక ప్రాయం అయింది. బెంగాల్‌లో దీనికి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభమైంది. క్రమంగా ఆ ఉద్యమం దేశ స్వాతంత్ర్య సాధన దిశగా మళ్ళింది. బెంగాల్ నాయకులు చిత్తరంజన్ దాస్, బిపిన్‌చంద్ర పాల్ వంటివారు దేమంతా పర్యటించి యువకులను ఉత్తేజితులను చేశారు. అందులో భాగంగానే మన ఆంధ్ర ప్రాంతంలోనూ పర్యటించి ఎందరో యువకులను దేశ స్వాతంత్ర్య సిద్ధికి చేస్తున్న ఉద్యమం వైపు ప్రేరేపితులు అయ్యేటట్లు చేశారు. కాంగ్రెస్ సభలలోను ఇతర సమావేశాల లోను ఆంధ్ర యువకులు పాల్గొనటానికి రెండు అడ్డంకులు వచ్చాయి. మొదటిది వారు మదరాసు సభ్యులుగా పాల్గొనవలసి రావటంలో తెలుగు వారి అస్తిత్వమే లేకుండా పోయింది. నిజానికి తమిళ ప్రాంతం కంటే ఆంధ్ర ప్రాంతంలో ఉద్యమంలో ఎక్కువమంది పాల్గొంటున్నా ఉద్యమాన్ని ఎంత సమర్థతతో

నిర్వహిస్తున్నా, ఆంధ్ర ప్రాంతీయులకు తగిన గుర్తింపు రాలేదు. కారణం ఆ ప్రతిష్ఠ ఏదైనా ఉంటే జాతీయ స్థాయిలో అది మద్రాసీయులకు పోతున్నది. రెండవది ఆంధ్ర ప్రాంత సమస్యలు, ఉద్యమ స్ఫూర్తిని బలంగా వినిపించే అవకాశం లేకుండా తమిళులు తన్నుకొని పోతున్నారు. ఇలాంటి స్థితిలో అస్తిత్వంలేని, వ్యక్తిత్వం ఎదగని ఆంధ్ర ప్రాంతీయులు తమ ప్రత్యేకత కోసం ఉద్యమం చేయవలసి వచ్చింది. కాంగ్రెసులోను ఇతర రాజకీయ వేదికలపైన ఇలాంటి విషయాన్ని గురించి 1915 నుంచే అంటే మహాత్మా గాంధీ భారతదేశంలో అడుగుపెట్టక ముందే, కొంత అలజడి ప్రారంభ మైంది. అయితే ఆనాటి ఏకైక లక్ష్యం స్వాతంత్ర్య సాధన. అందుకు ముఖ్య మైన అంశం దేశం అంతా ఏకతాటి మీద నడవటంగదా. కాబట్టి ఎప్పటి కప్పుడు ఆంధ్రుల అస్తిత్వపు ఉనికి సమస్య వెనక్కుపోతూ వచ్చింది.

సరిగా ఈ నేపథ్యంలో పొట్టి శ్రీరాములు జీవితచరిత్రను మనం మననం చేసుకోవాలి. 1956 నవంబరు ఒకటవ తేదీన ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత దీని ప్రాముఖ్యత ఎంతటిదో మనం సరిగా అంచనా వేయలేక పోయినా, ఆనాటికది అంటే 1953 అక్టోబర్ 1వ తేదీకి ముందు సంయుక్త మద్రాస్ రాష్ట్రంలో ఆంధ్రులు పడిన అగచాట్లు, భరించిన అవ మానాలు తెలుసుకొనటం చాలా అవసరం. అప్పుడే స్వజాతి మీద అభి మానం కలిగేది. స్వజాతి మీద అభిమానంలేని వాడు ఏ జాతిని అభి మానించలేడు గదా. ఇలా ఆంధ్రులను స్వజాతి అభిమానధను

లను చేయటం మాత్రమే పొట్టి శ్రీరాములు ఘనత కాదు. 1956 నవంబర్ నుంచి భారత దేశం భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా పునర్విభజితం కావటం జరిగింది. ఆ పునర్విభజనకు కూడా మూలకారణం అయిన వాడు శ్రీరాములు గారే. అందువలన ఆయనను గురించి తెలుసుకొనటం అత్యంత అవసరం.

# అమరజీవి

గతం తెలియని, తెలుసుకొనని జాతికి భవిష్యత్తు లేదు. ప్రస్తుతం మనం జీవిస్తున్న సమాజానికి రూపురేఖలు దిద్ది, నూతన జవ సత్వాలు ఇచ్చిన మహనీయుల జీవిత సర్వస్వమే గతం అనాలి.

అటువంటి మహాపురుషులలో మన ఆంధ్ర ప్రాంతానికి చెందినంత వరకు పొట్టి శ్రీరాములు గారు ఒకరు. సామాన్య కుటుంబంలో జన్మించి, అనేక జీవిత సమస్యల్ని ఎదుర్కొని, గాంధీజీ బోధనలతో, సాహచర్యంతో ఆదర్శ జీవితాన్ని ఏర్పరుచుకొన్న సుశ్లోకుడు పొట్టి శ్రీరాములు.

సత్యం, అహింస, త్యాగం అనే మూడు మహాదుర్గుణాలు కలిసిన త్రివేణి సంగమంగా శ్రీరాములుగారి జీవిత కథ సాగింది.

ఆంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకై అహింసాయుత సత్యాగ్రహం ద్వారా ఆత్మబలి దానం చేసిన ఆ అమరజీవి కథ నేటి యువతరానికి మార్గదర్శకం అయి, భవ్య భావోన్నత భవిష్య నిర్మాణానికి ప్రేరకం కాగలదు.

భారతదేశమే బ్రిటిష్ పాదాక్రాంతం అయింది. తెలుగు నేల రాజకీయంగా ముక్కలై పోయింది. ఇది ఎంతో కాలం సాగలేదు. ఆత్మ విమర్శ చేసుకొన్న ఆంధ్ర ప్రముఖులు జాతీయోద్యమంలోకి దూకారు. అటు దేశ స్వాతంత్ర్యం సముపార్జన, ఇటు స్వభాషా రాష్ట్ర సాధన అనే ద్విముఖ లక్ష్యాలతో ఆంధ్ర ప్రజలు విక్రమించారు. వారి త్యాగాలు స్వర్ణాక్షర లిఖితాలు. దేశానికి స్వతంత్రం వచ్చినప్పటికీ ఆంధ్రులకు సొంత రాష్ట్రం రాలేదు. కొంత భాగం మైసూరులోనూ, కొంత భాగం మదరాసులోనూ కలిసి మొత్తం మీద ఆంధ్రులు స్వదేశంలో పరాయి పాలన క్రింద ఉండి పోయారు. అటువంటి ఒక చారిత్రక సమయంలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించి "రాష్ట్రపిత" అయ్యారు.

# ఉదయ రేఖలు

"విక్రమ సింహపురం" అనే పేరున నేటి మన నెల్లూరును పిలిచే వారు. అనేక విధాలుగా విశిష్టతను, విలక్షణతను సంతరించుకొన్న నెల్లూరు జిల్లాలో కనిగిరి తాలూకా ఉండేది. తరువాత కాలంలో జిల్లాల పునర్విభజన జరిగినప్పుడు నెల్లూరు జిల్లాలోని దర్శి, పొదిలి, కనిగిరి తాలూకాలు, గుంటూరు జిల్లాలోని ఒంగోలు, చీరాల, టంగుటూరు కర్నూలు జిల్లాలోని మార్కాపురం, గిద్దలూరు, కంభం తాలూకాలతో ప్రకాశం జిల్లా ఏర్పడింది. అంటే కనిగిరి ప్రాంతం ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో ఉన్నదన్న మాట.

కనిగిరి మండలంలో పడమటిపల్లె అనే గ్రామం ఉంది. అక్కడ ఆర్య వైశ్య కుటుంబాల వారు చిల్లర వ్యాపారాలతో కాలం గడుపుతుండే వారు. అటువంటి ఆర్య వైశ్య కుటుంబాలలో "పొట్టి" వారి కుటుంబం ఒకటి. 'పొట్టి' వారి కుటుంబం నీతి నిజాయితీలకు పేరుపడిన కుటుంబాలలో ఒకటిగా ఆనాటికే ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాలలో మంచిపేరు ఉండేది.

పొట్టి గురవయ్య గారు ఆ గ్రామంలోనే ఉంటూ వంశపారంపర్యంగా వస్తున్న వ్యాపారంతో జీవనం సాగించేవారు. ఆయన ఎక్కువగా చదువు కోలేదు. పైగా నిజాయితీపరుడు. వ్యాపారంలో సహజమైన కుయుక్తులు తెలిసిన వాడు కాదు. న్యాయబద్ధంగా, ధర్మవిహితంగా వ్యాపారం చేయాలనే స్వభావం కలవాడు. అంచేత కుటుంబం గడవడం కష్టంగా ఉండేది. ఆయన భార్య మహాలక్ష్మమ్మ దొడ్డ ఇల్లాలు. దైవభక్తి, సదాచారం ఉన్న ఆదర్శ స్త్రీ. మానవప్రయత్నం ద్వారా కష్టాల్ని అధిగమించవచ్చునని భావించే దూరదృష్టి గల మహిళ, సాత్త్వికురాలు, పరోపకారం చేసే గుణవంతురాలు. భార్యాభర్తలు ఇద్దరూ మంచివారు. అన్యోన్య దాంపత్యానికి మారుపేరుగా మెలిగేవారు.

ఆ దంపతులకు గురమ్మ అనే అమ్మాయి, నారాయణ అనే అబ్బాయి కలిగారు. అతికష్టం మీద సంసారాన్ని ఈడ్చుకు వస్తున్న గురవయ్య,

మహాలక్ష్మమ్మ దంపతుల సహనాన్ని గ్రామస్థులు ఉదాహరణగా చెప్పుకొనే వారు. వ్యాపారంలో అన్యాయార్జితాన్ని గురవయ్య గారు అంగీకరించేవాడు కాదు. ఈ పరిస్థితిలో యిబ్బందులకు ఎదురీదుతున్న సమయంలోనే ఆంధ్ర దేశాన్ని పట్టి పల్లార్చి, ప్రజల బతుకుల్ని కుక్క చింపిన విస్తరి వలె కకావికలం చేసిన "ధాత కరువు" వచ్చింది. ఈ ధాతకరువు తెలుగు వారి జీవనాలకు ఒక మహమ్మారి. ఈ కరువు ఫలితంగా ఎందరు అన్నమో రామచంద్రా అంటూ మరణించారో, ఎందరు మృత్యువాత పడ్డారో, ఎందరు దేశాలు పట్టి పోయారో చెప్పే లెక్కలే లేవు. దీనినే డొక్కల కరువు అనేవారు. నెల్లూరు, రాయలసీమ ప్రాంతాలలో నేటికీ ఈ డొక్కల కరువును గురించి చెప్పుకొంటుంటారు.

1867వ సంవత్సరంలో భయంకర కరువు. ఇక ఆ గ్రామంలో జీవనం గడవడం కష్టం అయింది. వ్యాపారం సాగే పరిస్థితి లేదు. కుటుంబ పోషణ దుర్భరంగా పరిణమించింది. విధి లేక, గత్యంతరం తోచక మహాలక్ష్మమ్మ గారి సలహా మేరకు గురవయ్య గారు తమ పూర్వీకుల స్థలాన్ని, సొంత వూరును వదిలి మదరాసు మకాం మార్చేశారు. మద్రాసులోని జార్జి టౌన్‌లో అన్నా పిళ్లై వీధి 163 నంబరు ఇంటిలో ఈ కుటుంబం అద్దెకు చేరారు. ఆ ఇంటిలోనే 1902 సెప్టెంబరు 12వ తేదీన మహాలక్ష్మమ్మ గార్కి మూడవ సంతానంగా శ్రీరాములు జన్మించారు.

కుటుంబ పోషణ కోసం మహాలక్ష్మమ్మ గారు ఇరుగు పొరుగు ఇళ్ళలో వడ్లు దంచి, కొంత సంపాదించి కుటుంబపోషణ చేసేది. చాకిరీ చేసి కొంత సంపాదించి అవసరాలు తీర్చేది. ఆమె చాలా ధైర్యంతో, నిబ్బరంతో, సహనంతో మసలేది. స్వయంకృషి వలన మనిషి దేన్నైనా సాధించవచ్చునని, వృద్ధాప్యంచేత, వయోభారం చేత యేమి చేయలేని స్థితిలో ఉన్న భర్తను ఆమె ఊరడించేది. ఆయనకు బాసటగా ఉండేది. ఆమెలోని ఈ సహన శీలమే శ్రీరాములుకు అలవడింది. భవిష్యత్తులో శ్రీరాములు ఒక కర్మ వీరుడిగా, త్యాగశీలిగా పరిణతి చెందడానికి తల్లి శిక్షణయే అతనికి బాగా

ఉపకరించింది. ఆ తర్వాత కొంత కాలానికి మహాలక్ష్మమ్మ గారికి రంగయ్య అనే కుమారుడు జన్మించాడు. పెద్ద సంసారాన్ని ఈడ్చుకు వస్తున్న దశలోనే 1908లో గురవయ్య గారు మరణించారు. అప్పటికి శ్రీరాములు గారు ఆరేళ్ళ వయసువాడు. ఆ పసి వయసులోనే ఆ లేత మనస్సుపై జీవితపు అతి కష్టతరమైన దారిద్ర్య సంఘటనల ముద్రలు బలంగా పడినాయి. తల్లి పడిన కష్టాలు, కష్టాలలో ఆమె సహనశక్తి, సమయస్ఫూర్తి ఆయన ఆలోచనలపై చెరగని ముద్ర వేశాయి.

భర్త మరణించడంతో కుటుంబ పోషణకై ఆమె కందిపప్పు వ్యాపారాన్ని ప్రారంభించింది. వచ్చే బొటాబొటి లాభంతో పిల్లలకు ఇంత పెట్టి తాను తినేది. అయితే ఈ చిన్ని వ్యాపారంలో కూడా ఎన్నో చిక్కుల్ని ఆమె ఎదుర్కొన్నది.

పెద్దగా మరొక వ్యాపారాన్ని చేయడానికి తగినంత ఆర్థిక స్తోమతు లేనందున ఆమె కందిపప్పు వ్యాపారాన్ని విడవలేక, కష్ట నష్టాలతోనే ఆ వ్యాపారాన్ని కొనసాగించింది.

వ్యాపార పరంగా మహాలక్ష్మమ్మ గారు నాణ్యమైన సరుకును ఇస్తారు అనే మంచి పేరును ఆమె నిలుపుకొన్నారు. ఈ నిజాయితీ గుణమే శ్రీరాములు గారికి అలవడింది. పెద్దగా చదువుకొనకపోయినప్పటికీ ఆమె చక్కటి సంస్కారవంతురాలు. పురాణాలు, భారత రామాయణాదులు ఆమె పఠించే వారు. పూజా పునస్కారాదులు చేసేవారు. పర్వ సమయాలలో నియమ నిష్టలతో పవిత్ర జీవనం గడిపేవారు.

పెద్ద కుమారుడు నారాయణ 1917లో మరణించాడు. విధవరాలైన కోడలు చెంచమ్మ బాధ్యత కూడా ఆమెపై పడింది. తర్వాత కొద్దికాలానికే ఏకైక పుత్రిక గురమ్మ కూడా మరణించింది. అప్పటికి గురమ్మ కొడుకు నరసింహగుప్తా ఏడాదిన్నర పిల్లవాడు మాత్రమే.  అతడిని కూడా మహాలక్ష్మమ్మ గారు పెంచింది.

ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ చలించక, సహనాన్ని విడిచి పెట్టక మహాలక్ష్మమ్మ గారు నేర్పుగా పిల్లల్ని క్రమ శిక్షణతో పెంచారు. ఉత్తమ సంస్కారాల్ని పిల్లలకు నేర్పాలంటే ఆ సంస్కారాన్ని నిజ జీవితంలో ఆచరించి చూపాలి అనుకున్న ఆచరణశీలి మహాలక్ష్మమ్మగారు.

ఆమె ప్రవర్తనయే శ్రీరాములుగారిలో ఉన్నత భావాల్ని, ఉత్తమ సంస్కారాల్ని ప్రదీప్తం చేశాయి. మహోన్నత ఆదర్శాన్ని ఆచరణలో పెట్టడానికి అవసరమైన ఆత్మస్థైర్యాన్ని అలవరిచాయి.

ఎదుటివారి బిడ్డను గూడా తన బిడ్డతో సమానంగా చూసుకొన గలిగిన విశాల మాతృ హృదయం మహాలక్ష్మమ్మ గారిది. అలాంటి విశాల మానవతా లక్షణాలే శ్రీరాములు గారిలో వికసించాయి.

శ్రీరాములు గారు గోవిందప్ప నాయకర్ వీధిలోని బంగ్లాపల్లి కూటం అనే వీధిబడిలో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. 'పల్లికూటం' అంటే ప్రాథమిక పాఠశాల అని చిత్తూరు మద్రాసు ప్రాంతాల వ్యవహారం ఆ బడిలో ఉపాధ్యాయుడు నారాయణయ్య గారు. ఆయన శ్రీరాములు గారి వ్యక్తిత్వాన్ని చిన్ననాడే మలిచిన మంచి గురువు.

శ్రీరాములు చాలా బిడియస్థుడు. ప్రతీ విషయానికీ సిగ్గుపడు తుండే వాడు. తోటి పిల్లలతో, విద్యార్థులతో కలిసేవాడు కాడు. స్వేచ్ఛగా మాట్లాడే వాడు కాడు. నారాయణయ్య గారు మాత్రం శ్రీరాముల్ని చేరదీసి, భయం పోగొట్టి చక్కటి విద్యా బుద్ధులు నేర్పాడు. ఆ స్కూలులో రెండేళ్ళ విద్యాభ్యాస కాలంలో శ్రీరాములుచేత ఆయన పెద్ద బాలశిక్ష, సుమతీ శతకం, కృష్ణ శతకం, దాశరథీ శతకం, అమరకోశం, బాల రామాయణం మొదలైన గ్రంథాలలోని పద్యాలు, శ్లోకాలు కంఠతా పట్టించారు.

ఆ బాల్య బోధనలు శ్రీరాములు వ్యక్తిత్వ వికాసంలో కీలక పాత్ర వహించాయి. ఒక వంక తల్లి జీవితాదర్శాలు, వేరొక వంక గురువుగారి బోధనలు శ్రీరాములు ఆలోచనాధోరణిని ప్రభావితం చేశాయి. భవిష్యత్తులో

ఆయన నడవడికి, స్థితప్రజ్ఞతకూ, త్యాగ నిరతికి చిన్ననాటి ఈ వాతావరణం ఎంతగానో దోహదం చేసింది. పదవయేట శ్రీరాములు అడియనప్ప నాయకర్ వీధిలోని ప్రోగ్రెసివ్ యూనియన్ సెకండరీ స్కూలులో చేరాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం వసతి గృహంలో భోజనం చేసే ఏర్పాటు చేసుకొనవలసి వచ్చింది. ఈ పాఠశాలలో అతడు సెకండ్‌ఫారమ్ పూర్తిచేశాడు. ఉపాధ్యాయులపట్ల అణు కువ, చదువు సంధ్యల పట్ల శ్రద్ధా శ్రీరాములుకు సహజ గుణాలు. సరిగా చదవలేదని కాని, క్రమశిక్షణతో ప్రవర్తించలేదని కాని ఉపాధ్యాయులు ఎన్నడూ శ్రీరాములును శిక్షించలేదు.

సెకండ్ ఫారమ్ అయిన తర్వాత శ్రీరాములు మింట్ స్ట్రీట్‌లోని హిందూ థియొలాజికల్ ఉన్నత పాఠశాలలో చేరి మూడు సంవత్సరాల పాటు అక్కడే చదివాడు. తోటి విద్యార్థుల మధ్య మంచి ప్రతిభా వంతుడుగా పేరొందాడు. ఇంగ్లీషులో మార్కులు బాగా వచ్చేవి కావు. ఇప్పుడే కాదు ఆ రోజులలో కూడా విద్యార్జనలో ఇంగ్లీషుకు ప్రముఖ స్థానం ఉండేది. అయితే ఆ పరాయి భాషను అధ్యయనం చేయటంలో భారతీయ విద్యార్థులు కొన్ని ఇబ్బందుల నెదుర్కొంటుండేవారు.

శ్రీరాములు ఫిఫ్త్‌ఫారం పరీక్ష తప్పాడు. భవిష్యత్తులో అతనికి ఆశాజ్యోతిగా బొంబాయి నగరం కనిపించింది. అక్కడి విక్టోరియా జూబ్లీ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ సంస్థ శానిటరీ ఇంజనీరింగు, సివిల్, ఇంజనీ రింగు మొదలైన వృత్తి విద్యలలో శిక్షణ అవకాశాలను సమకూర్చేది. ఫిఫ్త్ ఫారం తప్పిన విద్యార్థులకు కూడా తమ సంస్థలో శిక్షణ యిస్తామని ప్రకటించారు. శ్రీరాములుకు ఈ వార్త ఆశ కలిగించింది. మహాలక్ష్మమ్మ గారు తన కుమారుడి ఉజ్వల భవిష్యత్తుకోసం కొంత కష్టపడడానికి నిశ్చ యించింది. అతడి భవిష్యత్తును బేరీజు వేసుకొని శ్రీరాములును ఆమె బొంబాయికి పంప నిశ్చయించారు.

శ్రమపడి చదివి తల్లి కోరిక తీర్చడమే తన జీవిత లక్ష్యంగా శ్రీరాములు దీక్షతో చదివాడు. బొంబాయి విక్టోరియా జూబ్లీ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో శ్రీరాములు శానిటరీ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులో చేరాడు. 'విద్యాతురాణాం న సుఖం న నిద్ర' అంటారు పెద్దలు అంటే విద్య మీద శ్రద్ధ ఉన్న వానికి నిద్ర ఉండదు, సుఖము ఉండదు. విద్యమీద ఆసక్తే కాదు దానికి అవసరమైనంత ధనం కూడా లేని శ్రీరాములుకు మరీ కష్టాలు పెరిగాయి. ఎందుకంటే ఎంత పొదుపుగా ఉన్నా తల్లి పంపే డబ్బు సరిపడేది కాదు. అందుకని శ్రీరాములు మద్రాసులోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఛారిటీస్, పచ్చిశెట్టి రాఘవయ్య ఛారిటీస్ మొదలైన ధార్మిక సంస్థల ఆర్థిక సహాయాన్ని పొందారు.

బొంబాయిలోని విక్టోరియా జూబ్లీ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ అనే ఆ విద్యా సంస్థలోనే కన్నింగ్‌హామ్ అనే ఆంగ్లేయుడు పనిచేస్తుండేవాడు. అతడితో శ్రీరాములుకు ఎక్కువ సాన్నిహిత్యం ఏర్పడింది.

శానిటరీ ఇంజనీరింగ్ డిప్లొమా చదువుతూనే శ్రీరాములు ఆ రోజులలో గాంధీజీ చేపట్టిన అనేక కార్యక్రమాలను గురించి విస్తృతంగా తెలుసు కొనేవాడు. జాతీయోద్యమం, సహాయ నిరాకరణోద్యమం, హరిజన సేవ మొదలైన ఎన్నో విషయాలపై గాంధీజీ ఆలోచనల్ని అతడు "యంగ్ ఇండియా" "నవజీవన" పత్రికలలో చదివేవాడు. గాంధీజీ ఆశయాదర్శాలు శ్రీరాములుకు బాగా నచ్చాయి. మంచి యువకుడుగా ఉన్న కాలంలో గాంధీజీ సంపాదకత్వంలో వెలువడే ఆ పత్రికలలోని వ్రాతలు ఆయన హృదయంపై గాఢముద్ర వేశాయి. ఆ పత్రికలలో గాంధీజీ బోధించిన ఆశయాలవైపు అడుగు వేసేటట్లు చేశాయి.

డిప్లొమా కోర్సు నాలుగవ సంవత్సరంలో ఉండగానే అతడికి వివాహం నిశ్చయమైంది. తల్లి మాటకు కట్టుబడి పేదరికంలో వున్న మేనమామ కూతురు సుబ్బమ్మ ఉరఫ్ సీతమ్మను శ్రీరాములు వివాహం చేసు కొన్నాడు.

మేనమామ గునుపూడి నరసయ్య శెట్టి నెల్లూరు జిల్లా దర్శి తాలూకా, మారెళ్ళ గ్రామ నివాసి. స్థితిమంతుడు కాడు. వరకట్నం లేకుండానే వివాహానికి శ్రీరాములు అంగీకరించాడు. ఎలాంటి ఆడంబరాలు లేకుండా, కట్న కానుకలు తీసుకోకుండా వివాహం చాల నిరాడంబరంగా జరిగింది. తనకు జీవితాంతం తోడునీడగా నిలిచే భార్యవైపువారి నుంచి కట్న కానుకలను స్వీకరించటం శ్రీరాములుగారు అవమానంగా భావించేవాడు. కట్నం తీసుకొనటం సప్త మహాపాతకాలలో ఒకటని ఆయన భావన.

శ్రీరాములు 1924 లో శానిటరీ డిప్లొమా పూర్తిచేసి మద్రాసు తిరిగి వచ్చాడు. మద్రాసులోని మున్సిపల్ రెవిన్యూ అధికారి అతడికి నెలకు నలభై ఐదు రూపాయలు జీతంపై చిన్న ఉద్యోగం ఇప్పించాడు. అయితే అది ఆర్థికంగా ఉపకరించలేదు. సరికదా శ్రీరాములు విద్యార్హతలకు తగిన ఉద్యోగం కాదు. శ్రీరాములు విద్యార్హతలకు తగిన ఉద్యోగం బొంబాయిలో లభించగలదనే ఉద్దేశ్యంతో ఆయన బొంబాయి చేరారు.

అక్కడ గ్రేట్ ఇండియా పెనిన్సులార్ రైల్వేలో 'ససూన్' అనే ఒకాయన ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. అతడి సహకారంతో శ్రీరాములు ఆ శాఖలో అసిస్టెంట్ ప్లంబర్‌గా ఉద్యోగం సంపాదించాడు. కళ్యాణ్ బొంబాయి స్టేషన్ల మధ్య అసిస్టెంట్ ప్లంబర్‌గా శ్రీరాములుకు నెలకు 130 రూపాయల జీతంపై ఈ పని లభించింది. ఆ రోజులలో అది మంచి జీతమే. ఇక తన కష్టాలు గడచి గట్టెక్కాయని ఆయన భావించాడు.

విధి నిర్వహణలో నీతి, నిజాయితీలకు శ్రీరాములు అత్యధిక ప్రాధాన్యం యిచ్చేవాడు. అదనపు ఆదాయంవచ్చే ఉద్యోగం చేస్తున్నా, ఆయన భావాలు వేరు. లంచం తీసుకోటం అంటే ఆయనకు పరమ అసహ్యం తాను నిజాయితీగా ఉండటమే గాదు ఇతరులు కూడా అలాగే ఉండాలని ఆశించేవాడాయన.

ఉద్యోగ జీవితంలోని కష్ట సుఖాలను అటుంచితే శ్రీరాములు కుటుంబ జీవితం కూడా సాఫీగా సాగలేదు. సీతమ్మకు బొంబాయి వాతావరణం

సరిపడలేదు. ఆమెకు ఆరోగ్యంసరిగా ఉండేదికాదు. తరచు రక్త విరేచనాలు అవుతుండేవి. శ్రీరాములు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి ఇంటికి వచ్చి భార్యకు ఉపచారాలు చేసేవాడు. ఆమెకు వైద్య సేవలు చేసేవాడు. భార్య పట్ల ఎక్కువ ఆదరణ చూపేవాడు.

శ్రీరాములు వృద్ధాప్యంలో ఉన్న తన తల్లిని మరిచిపోక ఆమెకు ప్రతినెల కొంత పైకం పంపుతుండేవాడు. అప్పటికి ఆయన తమ్ముడు రంగయ్య డాక్టర్ కోర్సులో చేరి చదువుతున్నాడు. మేనల్లుడు నరసింహగుప్తా పాఠశాలకు వెళ్లేవాడు. తన భార్య మందుల ఖర్చులు, తన ఖర్చులకు 80 రూపాయలు ఉంచుకొని మిగిలిన డబ్బును శ్రీరాములు తల్లికి పంపేవాడు. జీవితమంతా పడిన కష్టాలు, కనీస అవసరాలు కూడా తీర్చుకొనే అవకాశం లేని జీవన విధానం వలన ఆయన తల్లికి ఆరోగ్యం చెడిపోయింది. ఆమెకు ఉదరకోశ వ్యాధి వచ్చింది. ఎన్ని మందులు వాడినప్పటికీ కుదుట పడలేదు. చివరకు 1928లో ఆయన తల్లి గురమ్మ మరణించింది.

శ్రీరాములు భార్య గర్భం ధరించింది. ఆమె ఆరోగ్యం మాత్రం కుదుట పడలేదు. ప్రసవం తర్వాత ఆమెకు క్షయ ఉన్నదని వెల్లడయింది. కలిగిన మగబిడ్డ ఐదురోజులు జీవించి మరణించాడు. తరువాత సీతమ్మ ఆరోగ్యం కూడా దెబ్బతింది. పుట్టింటి నుండి ఆమెను తీసుకొని శ్రీరాములు మద్రాసు వచ్చేశాడు. వైద్యపరీక్షలు చేయించాడు. ఆమె ఊపిరితిత్తులు బాగా దెబ్బతిన్నాయని తేలింది. వెంటనే సీతమ్మను పుట్టిల్లైన మారెళ్ల తీసుకు వెళ్లారు. అక్కడ 1929లో సీతమ్మ మరణించింది. ఒక సంవత్సరం వ్యవధి లోనే శ్రీరాములు తల్లిని, భార్యాబిడ్డలను కోల్పోయాడు.

అది 1930వ సంవత్సరం. భారత జాతీయోద్యమ చరిత్రలో ఒక అద్భుత ఘట్టానికి అంకురార్పణ జరిగిన సమయం. ఉప్పు సత్యాగ్రహానికి గాంధీజీ పిలుపు నిచ్చారు. లక్షలాది మంది భారతీయులు ఉద్యమంలోకి ఆకర్షితులయ్యారు. తల్లి, భార్య, పుట్టిన కొడుకు మరణించటంతో శ్రీరాములు మానసికంగా బాగా అశాంతిని పొందాడు. చిత్తశాంతికరవైంది.

అదే సమయంలో దేశం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితి, గాంధీ నాయకత్వంలో జరుగుతున్న స్వాతంత్ర్యోద్యం ఆయనను ఊరకే ఉండనీయలేదు. వ్యక్తిగత మనోశాంతిని అన్వేషిస్తున్న శ్రీరాములు పై పరిస్థితులు ఉద్యోగం వదిలేటట్లు చేశాయి. శ్రీరాములు దేశసేవకు తనను తాను అంకితం చేసుకొన్నాడు.

## సాధనాపర్వం

గాంధీజీ జాతీయోద్యమ పోరాటాన్ని నడపటంలో మేధావులెందరో ఆయనకు అనుయాయులయ్యారు. గాంధీజీలోని ఆధ్యాత్మిక దృక్పథము, నిరాడంబరత్వము, అకుంఠిత దీక్ష వలన ఆయన నాయకత్వమున ఉద్యమం క్రొత్త మలుపు తిరిగినది. ఉద్యమంలోకి దూకదలచుకొన్న దేశ భక్తులకది ప్రేరణ కలిగించినది. అహింసా పద్ధతిలో కార్యసాధనకై ప్రజలు ముందుకు వచ్చారు.

గాంధీజీ ప్రేరణకు ప్రభావితులైన వారిలో శ్రీరాములు అగ్రగణ్యుడు. జాతీయోద్యమ చరిత్రలో 1930 ప్రధానమైనది. అప్పుడే గాంధీజీ ఉప్పు సత్యాగ్రహము ప్రారంభించినారు. దానితో ఆంగ్ల ప్రభుత్వము కదిలినది. ధనికులు దరిద్రులు - అందరును ఉప్పు సత్యాగ్రహములో పాల్గొన్నారు. గాంధీజీ ఆందోళనను ఉధృతము చేసి ఆంగ్లేయుల ప్రభుత్వమును స్తంభింపజేయుట మంచిదని భావించి వెంటనే తమ తమ పదవులకు రాజీనామా ఇచ్చి స్వాతంత్ర్య సమరమున చేరవలసినదిగా ఉద్యోగస్తులకు పిలుపునిచ్చినారు. ఆ పిలుపు శంఖారావంగా ఎంతో మంది ఉద్యోగులు స్పందించారు. శ్రీరాములు హృదయములో ఆ పిలుపు ప్రతిధ్వనించినది. అప్పుడు దండి సత్యాగ్రహము నిమిత్తమై గాంధీజీ సూరత్‌లో ఉన్నారు. ఏప్రిల్ 1వ తేదీన శ్రీరాములు గాంధీజీని కలిసి తన జీవిత సర్వస్వమును మానవ సేవలో గడుపుటకు అనుజ్ఞ ఇమ్మని కోరినారు. గాంధీజీ ప్రస్తుతానికి సబర్మతీ ఆశ్రమములో చేరమని సలహా ఇచ్చినారు.

శ్రీరాములు బొంబాయికి తిరిగి వచ్చు మిత్రులతో తనకు స్వాతంత్ర్య సమరములో చేరాలని ఉన్నట్లు చెప్పాడు. వారు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ మును మానుకొనుట మంచిది కాదన్నారు. అయినా కార్యదీక్షతో నిశ్చ యించుకొన్న అతని మనస్సు మారలేదు. ఉద్యోగానికి వెంటనే రాజీనామా చేసినాడు. ఇంటిలోని వస్తువులన్నిటిని పేదలకు పంచవలసి నదిగా కోరాడు. ఆఫీసు నుండి అతనికి లభించిన ధనముతోనే, 1930 ఏప్రియల్ 16వ తేదీన సబర్మతీ ఆశ్రమమునకు వెళ్ళాడు.

అది పవిత్రమైన సబర్మతీ ఆశ్రమము. గాంధీజీ ఆదేశాలు శ్రీరాములు జీవితంలో మార్పులు తెచ్చినవి. అక్కడ ఆయన మూడు సంవత్సరాల కాలమే గడపినా, దానితో అతని జీవిత లక్ష్యమే మారినది. అతడు అచిర కాలముననే గాంధీజీకి శిష్యులలో ప్రథముడైనాడు.

1946వ సంవత్సరంలో మద్రాసులో జరిగిన దక్షిణ హిందీ ప్రచార సభ రజతోత్సవాలకు గాంధీజీ అధ్యక్షత వహించారు. సంఘసేవా కార్య క్రమములో నెల్లూరులో ఉన్న శ్రీరాములు తన కృషిని నివేదించుటకై మద్రాసు వచ్చారు. అతడు నిరాడంబరముగా ఉన్నాడు. మెడలో హరిజనో ద్ధరణ అని వ్రాసిఉన్న అట్టముక్క వ్రేలాడుచున్నది. ఆ సభా నిర్వాహకులైన మోటూరి సత్యనారాయణ ప్రభృతులాతని సామాన్య వ్యక్తి అనుకొని, గాంధీజీని కలవాలని కోరినా నిరాకరించినారు. చేయునది లేక శ్రీరాములు ఆ సభాప్రాంగణములో తచ్చాడసాగారు. గాంధీజీ అతనిని గమనించి, వెంటనే లోనికి రమ్మని పిలిపించుకొనెను. జరిగిన దానికి ఆయనెంతో బాధపడ్డారు. గాంధీజీ సభలో ప్రసంగించు నపుడు పొట్టి శ్రీరాములు వంటి నిస్వార్ధపరులు దేశభక్తులు, పది మంది ఉన్నచో స్వరాజ్యమును ఏనాడో సాధించి ఉందుము అని ప్రశంసించారు.

సబర్మతీ ఆశ్రమములో చేరినవారు గాంధీజీ పెట్టిన పదకొండు సూత్రాలను తప్పక పాటించాలి. అవేమనగా 1) సత్యము; 2) అహింస;

3) బ్రహ్మచర్యము; 4) స్వార్ధము లేకుండుట; 5) ఇంద్రియ నిగ్రహము; 6) దొంగతనము చేయకపోవుట; 7) నిర్భీతి; 8) అస్ప్రృశ్యతా నివారణ; 9) స్వయంకృషితో జీవనము; 10) సర్వమత సమానత్వము; 11) స్వదేశీ వస్తువులను మాత్రమే వాడుట. గాంధీజీ ఈ నియమాలను తుచతప్పకుండా అనుసరించాలనే వారు. ఒక గొప్ప లక్ష్యాన్ని సాధించటానికి లక్ష్యం ఉన్నతంగా ఉండటమే కాదు, దానిని చేరుకొన వలసిన మార్గం కూడా ఉన్నతంగా ఉండాలనేది గాంధీ ఆశయం.

సబర్మతీ ఆశ్రమములో చేరెడి వ్యక్తి నియమోల్లంఘన చేయనని ప్రమాణము చేయాలి. నియమము లేని వ్యక్తి ప్రలోభానికి లోను కావచ్చు. నియమ పాలన చేసే వ్యక్తి పతనము కాడు. దీనివలన వ్యక్తిలో ధృఢ నిశ్చ యము, కార్యదీక్ష పెంపొందును.

గాంధీజీ చెప్పిన సూత్రాలు, ఆయన అభిప్రాయములు శ్రీరాములు హృదయమున నాటు కొన్నవి. గాంధీజీ అనుభవిక వేదాంతము ఆయనకు జీవిత సత్యంగా గోచరించింది. నిరంతరము సత్యాన్వేషణము, జిజ్ఞాస, కష్టములను సహించుట, ఇత్యాది కోణాల నలవరచుకొన్నచో గాంధీజీ సిద్ధాంతముల ఆచరణయోగ్యము చేయుట తేలిక అని శ్రీరాములు నమ్మారు.

సబర్మతీ ఆశ్రమమున పాటించవలసినవి ఈ 11 సూత్రాల ప్రవర్తనా నియ మావళిని ఆచరణ యోగ్యం చేయడానికే కార్యక్రమాలు నిర్వహింప బడేవి.

శ్రీరాములు ఆశ్రమములో ఖాదీ పరిశ్రమలో ఆరితేరినారు. దీనితో ఆశ్రమ కార్యదర్శి నారాయణదాస్ గాంధీ, మగన్‌లాల్ గాంధీ అతనికెంతో తోడ్పడినారు. శ్రీరాములు వడ్రంగము, చర్మమును శుభ్రపరచుట, పాద రక్షలు కుట్టుట మున్నగు పనులు చేసేవారు. ఇవేగాక వీధులు తుడుచుట, వీధిదీపాలలో నూనెపోసి వెలిగించుట, రాత్రులు కాపలా కాయుట, వంటచేయుట, పాత్రలు శుభ్రముచేయుట, బావిలో నీరుతోడుట, వగైరా

పనులను తోటివారితో కలిసి చేసేవారు. చేయటం అనేది వ్యక్తికి నిర్దేశించిన విధి. పనిలో ఇది గొప్పది తక్కువది అనే భేదభావం ఉండ కూడదు. ఎలాంటి పని అయినా విలువైనదే పవిత్రమైనదే. శారీరక శ్రమ తక్కువ రకానికి చెందినదిగా భావించకూడదు అని గాంధీజీ బోధించేవాడు. ప్రజా సేవలో వ్యక్తిగత ప్రవర్తన కూడా ఉన్నతంగా ఉండటం ముఖ్యమే అని గాంధీజీ విశ్వాసం. గాంధీ బోధించిన ఈ నియమాలు అన్నింటి చేత పొట్టి శ్రీరాములు బాగా ప్రభావితుడైనాడు. ఆయన కార్యక్రమాలను తాను చేపట్టి కొనసాగించాలని త్రికరణ శుద్ధిగా భావించాడు. "ప్రతి వ్యక్తి స్వార్థ త్యాగం చేసి ప్రజాసేవకు అంకితము కావాలి. ప్రతిఫలము కోరక సంపూర్ణ త్యాగం చేసి ప్రజా సేవకు అంకితము అయిన వాడే నిజమైన ప్రజా సేవకుడు." అని గాంధీజీ విశ్వాసము.

పొట్టి శ్రీరాములు గాంధీజీ అభిప్రాయాన్ని పూర్తిగా పాటించి నెల్లూరులో హరిజనోద్ధరణను చేపట్టారు. వర్ణాంతర భోజనములను నిర్వహించారు. ప్రజలలో చైతన్యము కల్గించెను. భిక్షాటన చేశారు. పాకీవాళ్ళతో కలిసి, వారి ఇళ్ళలో నివసించేవాడు.

పొట్టి శ్రీరాములు ఆశ్రమ గ్రంథాలయ నిర్వహణ చూసేవాడు.

డబ్బును వృధా చేయరాదని, పొదుపు పాటించుట శ్రేయస్కరమని బోధించేవాడు.

"ఏ వ్యక్తి తన కవసరములేని ఏ వస్తువునైనా దాచుకోరాదు. ఉదా హరణకు కుర్చీ అక్కరలేని వాడు తన వద్ద కుర్చీ నుంచుకోరాదు. అది మరొకరికి పనికి వచ్చును." దీనిని సరిగా అర్థము చేసికొని ఆచరించిన వాడే నిజమైన నిరాడంబరజీవి. అట్టివాడు శ్రీరాములు.

గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని సరిగా అర్థం చేసుకొన్నవాడు శ్రీరాములు.

సేవా భావము, త్యాగము, అచంచల దీక్ష, నిర్భీతి, దేశాభిమానము అతనిలో మూర్తీభవించి యున్నాయి. సత్యవ్రతము, కఠిన దీక్ష మున్నగు

సుగుణములు గాంధీజీని నాకర్షించినవి. క్రమేపీ గాంధీజీకి, సన్నిహితులలో ఒకడైనాడు. గాంధీజీ శ్రీరాములు అభిప్రాయాలను గౌరవించేవాడు. గాంధీజీని ఆదర్శ మూర్తిగా శ్రీరాములు భావించేవాడు.

1933 ఆగష్టు 1వ తేదీన ప్రభుత్వము గాంధీజీని వారి 34 మంది సబర్మతీ ఆశ్రమ వాసులను నిర్బంధించింది. నిర్బంధింపబడిన వారిలో పొట్టి శ్రీరాములు ఒకడు. వీరందరినీ అరెస్టుచేసి, సబర్మతీ జైలుకు పంపించారు. శ్రీరాములు జైలు జీవితమునకిదే ప్రథమము. శ్రీరాములును జైలుశిక్ష కన్నా సబర్మతీ వియోగమే ఎక్కువ బాధించినది.

## సేవాపర్వం

జాతీయోద్యమ చరిత్రలో ఒక అద్భుత పర్వం "సేవాపర్వం" అని చెప్పవచ్చు.

బీహారు ఉత్తర ప్రాంతంలో 1934 జనవరి 15వ తేదీన పెద్ద భూకంపం వచ్చినది. ఆ రోజు పగలు 2 గంటల వేళ భూమి మూడుసార్లు కంపించినది. దానితో చాలా భీభత్సము జరిగినది. భూమి బ్రద్దలైనట్లు భయంకర శబ్దము చుట్టుపట్ల కొన్ని మైళ్ళ మేర చెవులు బ్రద్దలయేటట్లు వినిపించింది. ఇది సుమారు 77.700 చ.మైళ్ళ విస్తీర్ణము వ్యాపించినది. దీనివల్ల 150 లక్షల మంది ప్రజలు తీవ్ర బాధకు గురి అయినారు. ఉత్తర బీహార్ ప్రాంతములోని పల్లెలు, పట్టణాలు నేలమట్టమైనవి. చాప్రా, ముజఫర్‌పూర్, దర్భాంగా జిల్లాలు సర్వనాశనమైనవి. ఒక్క ఇల్లు కూడా మిగలకుండా పడిపోయినవి. చాలాచోట్ల 60 మీటర్ల పొడవు 10 మీటర్ల లోతు పగుళ్ళు ఏర్పడినవి. పది లక్షల మంది ఇళ్ళుకూలిపోయినవి. భూగర్భం నుండి ఇసుక ఎగజిమ్ముట వలన చాల చోట్ల బావులు, చెరువులు పూర్తిగా ఎండిపోయినవి. కొన్నివేల ఎకరాల భూమిలో పంట చెడిపోయినది. వందల సంఖ్యలో జనము మరణించినారు. లక్షల మంది నిరాశ్రయులైరి. 1440 కిలోమీటర్ల రైలు మార్గము ధ్వంసమైనది. ప్రజలు గాదెలలో

దాచుకున్న ధాన్యము భూగర్భములో కలిసిపోయినది. ప్రజలకు వస్త్రాలు కరువైనవి. కరువు, కాటకాలు ఆవరించినవి. చాలాచోట్ల స్త్రీ పురుషుల మాన రక్షణకు కూడా బట్టలు కరువైనవి.

ఈ భూకంపం భారతీయుల నందరినీ భయభ్రాంతులను చేసినది. దీని నెదుర్కొనుట భారత ప్రభుత్వమునకు పెద్ద సమస్యయైనది. దీనికై ప్రభుత్వము ప్రజా సహకారము కోరవలసి వచ్చినది. జనవరి 21వ తేదీన బాబూ రాజేంద్రప్రసాద్ జైలు నుండి విడువబడి నాడు. ఆయన బీహారు పరిస్థితిని పూనాలో హరిజన సేవలో నిమగ్నుడైన గాంధీజీకి తంతి ద్వారా తెలిపినాడు. వెంటనే గాంధీజీ భూకంప బాధితులను ఆదుకోవలసినదిగా భారతీయులందరికి విజ్ఞప్తి చేసినాడు. ఆ పిలుపును అందుకొని కాంగ్రెసు కార్యకర్తలందరును వెంటనే బీహారు వెళ్ళారు. దానిలో ప్రధాన పాత్ర రాజేంద్రప్రసాద్‌దే.

అప్పుడు శ్రీరాములు నాసిక్ జైలులో ఉన్నాడు. గుజరాత్‌లోని రాస్ గ్రామానికి గాంధీజీ నడపిన ప్రదర్శనలో పాల్గొన్నందుకు శ్రీరాములుకు 6 నెలలు జైలు శిక్ష విధింపబడినది. ఒక నెల సబర్మతీ జైలులో ఉంచి తర్వాత నాసిక్ జైలుకు పంపినారు. అయిదవ నెల శిక్ష జరుగుచుండగా ఈ భూకంపము వచ్చినది. ప్రభుత్వము కాంగ్రెసు కార్యకర్తలనందరిని విడుదల చేసినది. అందులో శ్రీరాములొకడు. అతడు వెంటనే గాంధీజీ ఆదేశము ప్రకారము సహచరులతో పాటు బీహారు వెళ్ళి భూకంపబాధితుల సేవలో పాల్గొన్నాడు. బీహారు భూకంప బాధితుల సహాయక సంఘమొకటి భారత జాతీయ కాంగ్రెసు ఆదేశము ప్రకారమేర్పడినది. శ్రీరాములు మేన ల్లుడు యన్.ఆర్. గుప్త ఆ సంఘటనలో 1934 జనవరి 29వ తేదీన సభ్యులుగా చేరారు.

ముజఫర్ జిల్లా బెల్సంచ్ డివిజన్లలోని సీతా మోర్ తాలూకా ప్రజలకు సేవచేయు అవకాశము శ్రీరాములుకు అతని అనుచరులకును కలిగినది.

పొట్టి శ్రీరాములుకు అతని అనుచరులకును కేంద్ర సహాయ సంఘం ఈ క్రింది పనులను చేయాలని నిర్దేశించినది.

1) భూకంపము వలన కలిగిన నష్టాలు అంచనా వేయటం.
2) నిరాశ్రయులకు గృహ నిర్మాణం.
3) ఆహార, వస్త్రాలు యివ్వడం.
4) రోడ్లను పునర్నిర్మించటం.
5) వంతెనలను నిర్మించడం.
6) నిధులను సేకరించటం, వినియోగించటం.
7) భూకంపము వలన భూసారములో వచ్చిన మార్పులను బట్టి అక్కడ పండించవలసిన పంటను రైతులకు వివరించడం.
8) కొన్నిచోట్ల తాత్కాలికముగా మట్టిరోడ్ల నిర్మాణం.
9) పాతరలలో చెడిపోగా మిగిలిన ధాన్యమును భద్రపరచడం.
10) బాధితులను ఓదార్చడం.

బీహారు సెంట్రల్ రిలీఫ్ కమిటీ భూకంప బాధితుల సహాయార్థం సుమారు 40 లక్షల రూపాయల నిధిని సేకరించినది. కొన్నివేల బేళ్ల వస్త్రాలు, తక్కిన వస్తువులను సేకరించినారు. దానిలో కొంత భాగమును లెల్సంచో డివిజన్‌లోని బాధితులకు కేటాయించినారు. దానిని పంచే బాధ్యత శ్రీరాములు వారి అనుచరులు తీసికొన్నారు.

బీహారులో భూకంపము వలన దెబ్బతిన్న పరిస్థితి నాలుగైదు నెలలకు కుదుట పడినది. పక్షవాతము, బోదకాలు మొదలైన రోగ బాధితులకు ఆరోగ్య విషయమున చికిత్సకు సహాయము చేసే బాధ్యతను కూడా శ్రీరాములు మున్నగువారే చేపట్టారు.

పదినెలల పాటు శ్రీరాములు బీహారు భూకంప బాధితుల సేవాకార్య క్రమములో గడిపారు. నిద్రాహారాలను లెక్కసేయక సేవ చేశారు. 'ఏక

క్రియా ద్వర్థకరీ' అనే ఒక పని రెండింటిని సాధించింది. ప్రజాసేవ చేసే అవకాశం లభించింది. కాంగ్రెస్ కార్యకర్తగా వారి అభిమానాన్ని పొందగలిగాడు.

ఈ రీతిగా బీహారు రాష్ట్రములో సేవా కార్యక్రమం ముగిసినది. శ్రీరాములు గాంధీజీ సిద్ధాంతానుసారముగా జీవితమును గడపదలచెను. అందుకై ఏదైనా ఆశ్రమమునకు వెళ్లదలచెను.

ఇంతలో రాజకోట నుండి నారాయణదాస్ గాంధీ తాను స్థాపించిన సత్యాగ్రహ ఆశ్రమమున నివసించుటకు రమ్మని శ్రీరాములు నాహ్వానించాడు. ఆశ్రమ ఆశయాలు – ఖాదీ ప్రచారము, మద్యపాన నిషేధము, హరిజనోద్ధరణ మొదలైనవి. శ్రీరాములు కిష్టమైనవి అందుచే వెంటనే శ్రీరాములు అక్కడికి వెళ్లాడు. అక్కడ నారాయణ దాస్‌తో పాటు సంఘసేవా కార్యక్రమాలలో గడిపెను. శ్రీరాములు నీతి – నిజాయితీలు నారాయణ దాస్‌కు తెలిసినవే కనుక అతడెంతో అభిమానించాడు. అయినా శ్రీరాములు అక్కడ ఆరు నెలలు మాత్రమే ఉండగలిగెను. అక్కడ పని చేయుట శ్రీరాములకు సంతృప్తికరముగానే ఉన్నా, అవి తానాశించిన స్థాయిలో లేవు. అంతకన్నా బాగున్న ఆశ్రమమునకు వెళ్లాలనుకొన్నాడు.

## తారవాడ ఆశ్రమం

గుజరాత్‌లో తారవాడలో శ్రమజీవి ఆశ్రమమును వల్లభ భాయ్ పటేల్ స్థాపించినట్లు విని శ్రీరాములు అక్కడికి వెళ్లారు. నారాయణ దాస్ శ్రీరాములును తన ఆశ్రమములోనే ఉండమని కోరారు. నేను స్వయం కృషితో జీవించవలెనని కోరుచున్నాను. దానికి వీలైనచోటికి పోదలచితినని నారాయణ దాస్‌ను సమాధాన పరచి వెళ్లిపోయెను.

తారవాడలోని శ్రమజీవి ఆశ్రమ ప్రధానాశయము స్వయం కృషితో కూడిన జీవితం. అది నచ్చియే శ్రీరాములక్కడికి చేరినాడు. అక్కడ పొట్టి శ్రీరాములు ఒక్క సంవత్సరము (1935–36) గడిపారు. శ్రీరాములు నిజాయతీ ప్రవర్తనకు అక్కడి వారందరును సంతోషించినారు.

శ్రీరాములు అక్కడ కూడా చాల కాలముండ లేక పోయినాడు.

నెల్లూరు జిల్లా కావలి తాలూకా జువ్వలదిన్నె గ్రామములో పంచాయతీ బోర్డు వైద్యశాలలో శ్రీరాములు తమ్ముడు రంగయ్య డాక్టరుగా పనిచేస్తున్నాడు. అతడు తన మేనమామ తన భార్యకు తండ్రి అయిన గునుపూడి నరసయ్య అవసాన దశలో ఉన్నట్లు జాబు వ్రాసినాడు. శ్రీరాములు వెంటనే తారవాడ నుండి మేనమామ గారి ఊరైన మారెళ్ళకు వెళ్లెను. నరసయ్య కుడికాలు మీద గాయమైనది. శ్రీరాములు చేసిన సేవ ఫలించలేదు. రెండవ రోజు రాత్రి 10 గం॥లకు అతడు మర ణించాడు. అతని ఉత్తరక్రియలను శ్రీరాములే జరిపించారు.

శ్రీరాములు అక్కడ 7 నెలలు ఉన్నారు. ఉన్నన్నాళ్ళు ఆ ప్రాంతప్రజల కెన్నో సేవలు చేశారు. నూలు వడకుట నేర్పెను. వారి మధ్య ఉన్న తగాదాలు తీర్చు కొనుటకై కోర్టులకు పోవలదని వారికి నచ్చచెప్పి తానే తీర్చెను. ఆ మారెళ్ళ ప్రాంత ప్రజలకు సుమారు 50 అంబరు చరఖాలను పంచి, వారికి నూలు వడకు అలవాటు చేశారు. తాను రోజునకు 8 గంటలు నూలు వడికి, అది సాలెవానికి ఇచ్చి బట్టలు నేయించారు. మారెళ్ళలో గ్రామీణ వైద్యశాలకు భవనము సగం నిర్మితమై ఆగిపోయినది. దానికి చందాలు వసూలుచేసి, ఆ భవన నిర్మాణము పూర్తిచేయించెను. భారత దేశాన్ని పట్టి పీడిస్తున్న దురాచారాలలో మధ్యపానం ఒకటి. త్రాగుడుకు బానిస అయినవాడు ఎంతో హీన స్థితికి దిగజారుతాడో అందరికీ తెలిసిన విషయమే. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకొన్న కార్మికులు సాయం కాలానికి సంపాదించిందంతా త్రాగుడుకు పోసి తానేగాక భార్యా బిడ్డలను అధోగతికి చేరుస్తున్నారు ఇది నాడే కాదు నేటికాలంలో గూడా నడుస్తున్న చరిత్ర అందుకే ఆనాడు కాంగ్రెసు వారు మధ్యపానాన్ని నిషేధించటం తమ ఉద్యమంలో ఒక భాగాన్ని చేశారు. మారెళ్ళ ప్రాంత పామరులు కూలి నాలి చేసి కొనుచు త్రాగుడుకు అలవాటుపడి ఉన్నారు. వారి దుస్థితిని అరికట్టాలనే ప్రయత్నం చేశాడాయన వారికి మధ్యపానము వలన కలిగే

కష్ట నష్టాలు నచ్చచెప్పి త్రాగుడు మాన్పుటకు ప్రయత్నించెను. జనమాయన మాటలను పట్టించుకోలేదు. అతడంతతో మానలేదు. పట్టుబట్టి రెండు రోజులు నిరాహార దీక్ష పూనెను. దానితో కొంత పరివర్తన కలిగినది. వారతని దగ్గరకు వచ్చి "త్రాగుట మానుదుమని" ప్రమాణము చేసిరి. ఆ వూరిలో పాడుపడిన బావిని ఆయన మరమ్మత్తు చేయించెను. ఊరి వారికి సమృద్ధిగా త్రాగు నీరు లభించినది.

ఆ సమయములో కృష్ణాజిల్లా గుడివాడకు దగ్గరలో ఉండే అంగలూరులో ఎర్నేని సుబ్రహ్మణ్యం స్థాపించిన గాంధీ ఆశ్రమం విషయము ఆయనకు తెలిసినది. శ్రీరాములు 1939లో అంగలూరు గాంధీ ఆశ్రమములో చేరెను. అక్కడ నూలువడకుట, మద్యపాన నిషేధము, అస్పృశ్యత నివారణ మున్నగు కార్యక్రమాలలో పాల్గొనేవాడు. "దరిద్రనారాయణ" అనే పత్రిక నడిపేవాడు. గాంధేయ ఆశయ ప్రచారము, ఆశ్రమ కార్యక్రమాల వార్తా వివరణము ఆ పత్రిక లక్ష్యము. శ్రీరాములు కూడా దానిలో వ్యాసాలు వ్రాసేవాడు.

సబర్మతీ ఆశ్రమ లక్ష్యములే అంగలూరు ఆశ్రమ లక్ష్యములును, దైనందిన కార్యక్రమాలలో తేడా లేదు. అందుచే శ్రీరాములు తన శేష జీవితమును అక్కడే గడపదలచెను.

అవి క్విట్ ఇండియా ఉద్యమము జరుగుచున్న రోజులు, క్రిప్స్ రాయబారము విఫలమైనది. ఆంగ్ల ప్రభుత్వముపై దేశమంతట ఆగ్రహావేశాలతో ఉన్నారు. గాంధీజీ ఇట్టి పరిస్థితిలో "ఆంగ్లేయులను భారతదేశము నుండి పారద్రోలుటే మేలని" భావించెను. 1942 జులై 7 నుండి 14 వరకు వార్ధాలో కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సమావేశాలు జరిగాయి. జాతీయవాదుల సుదీర్ఘ చర్చల అనంతరము క్విట్ ఇండియా తీర్మానము ఏకగ్రీవముగా ఆమోదింప బడినది. అదే తీర్మానమును బొంబాయిలో కాంగ్రెసు పార్టీ సర్వసభ్య సమావేశము ఆగష్టు 8న బలపరచినది.

క్విట్ ఇండియా ఉద్యమము ప్రారంభమైన తరువాత రాత్రి 3-30 గంటలకు గాంధీజీని కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యులను వారెంటు లేకుండానే పోలీసులు అరెస్టుచేశారు.

ఆ వార్త దేశమంతా క్షణములో వ్యాపించినది. సామాన్య ప్రజానీకము ప్రభుత్వ చర్యను నిరసిస్తూ అరెస్టు అవడానికి నేనంటే నేనని ముందుకు రాసాగినారు.

అంగలూరు గాంధీజీ ఆశ్రమములో ఉన్న శ్రీరాములు ఆ ఉద్యమములో పాల్గొని అరెస్టగుట, గాంధేయవాదిగా తన ధర్మమను కొన్నాడు.

పొట్టి శ్రీరాములు 1943 జనవరి 26న గుడివాడ వెళ్ళి జాతీయ జెండాను ధరించి ఆంగ్ల ప్రభుత్వమునకు వ్యతిరేక నినాదాలు చేయుచు తిరుగుచుండెను. అందుకు ప్రభుత్వ మతనిని అరెస్టు చేసినది. ఆయనకు కోర్టు 6 నెలలు జైలు శిక్ష విధించినది. కొన్ని రోజులు రాజమండ్రి జైలులో ఉంచి, తర్వాత బళ్ళారి సెంట్రల్ జైలుకు పంపారు. అక్కడ శ్రీరాములుకు ప్రముఖ రాజకీయవేత్తయైన వావిలాల గోపాలకృష్ణయ్య గారితో పరిచయం ఏర్పడింది. వారిద్దరును ఎన్నో జాతీయ సమస్యలను చర్చించుకొని జైలు నుండి విడుదలైన తరువాత గాంధేయ సిద్ధాంతాలకనుగుణముగా తాము చేయవలసిన కార్యక్రమాన్ని నిర్ణయించుకొన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించక ముందు, అటు తరువాత కేవలం దేశసేవ కోసమే తమ జీవితాలను అంకితం చేసిన నిస్వార్థ రాజకీయవేత్తలలో వావిలాల గోపాలకృష్ణయ్య ఒకరు. అతి నిరాడంబరంగా, ప్రజాసేవే జీవిత పరమార్థంగా బ్రతుకు బండిని లాగించినవాడు గోపాలకృష్ణయ్య గారు. ఆయన 2005వ సంవత్సరంలో మరణించారు.

బళ్ళారి జైలు నుండి పొట్టి శ్రీరాములు విడుదలై చుట్టప్రక్కల గ్రామాలకు వెళ్ళి నూలు వడక వలసిన ఆవశ్యకతను గూర్చి ప్రచారము చేసేవాడు. చాలామంది ఇళ్ళలో చరఖా లేర్పాటు చేసినారు.

# అస్పృశ్యతపై యుద్ధం

భారతీయ సమాజానికి మాయని మచ్చగా, భారతీయ సంస్కృతికి చెద పురుగుగా అభివర్ణితమైన సామాజిక రుగ్మత అస్పృశ్యతను నిర్మూలించాలని గాంధీజీ ప్రత్యేక కార్యక్రమం తీసుకొన్నారు. ఈ కృషిలో కూడా శ్రీరాములు అనితరసాధ్యమైన ఫలితాలను సాధించాడు.

అస్పృశ్యత ఒక సాంఘిక దురాచారము. ఇది హిందూ మతములో తరతరములుగా వస్తున్నది. దీని నిర్మూలన ప్రతి హిందువు యొక్క కర్తవ్యము. అస్పృశ్యులను సోదరులుగా చూడాలి. వారితో కలిసి మెలసి జీవించాలి. తరతరాలుగా అంధకారములో ఉన్న అమాయకులను ఉద్ధరించాలి. అందరిలోనూ ఈ భావాలను కల్గించాలి. అస్పృశ్యతా నిర్మూలన మానవ ధర్మముగా భావించాలి. అస్పృశ్యుల సేవయే మాధవసేవగా భావించండి అని గాంధీజీ చెప్పారు. గాంధేయవాది అయిన శ్రీరాములుకు ఈ బోధ మనసున కెక్కినది. దీనిని ఆచరణలో పెట్టుటే జీవిత లక్ష్యమను కొన్నాడు. ఆ లక్ష్య సాధనకే కృషి చేయసాగినాడు.

1944 ఆగష్టు 9వ తేదీ క్విట్ఇండియా ఉద్యమ ప్రారంభ దినముగా ప్రకటించబడినది. గాంధీజీ అహింసా మార్గమున ఎవరికి తోచినట్లు వారు చేయవచ్చునని సూచించినారు. అజ్ఞాత వాసములో ఉన్న కార్యకర్త లందరును బయటకు వచ్చి పోలీసులకు లొంగి పోవాలని, నిశ్చయించారు. మిగిలిన కార్యకర్త లందరును 14 సూత్రాల నిర్మాణ కార్యక్రమమును చేపట్టారు. 1944 నుండి శ్రీరాములు ఒంటరిగానే హరిజనోద్ధరణకై కృషి చేశారు. 1944 అక్టోబరు 2వ తేదీ గాంధీజీ జన్మదినము కనుక ఆనాడు శ్రీరాములు అస్పృశ్యత నిర్మూలన ఉద్యమమునకై ప్రచారము ప్రారంభించెను.

స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి భారతీయ సమాజం ఒక పరిపూర్ణ ఉన్నత జీవన విధానాన్ని సముపార్జించు కోవాలనేది గాంధీజీ ఉద్దేశ్యం. వితంతు

పునర్వివాహాలను 1880లలోనే వీరేశలింగం పంతులు ప్రారంభించినా, ఆయన మరణం తరువాత ఆ ఉద్యమం కొంత వెనుకబడింది. దీనిని పునరుద్ధరించి శ్రీరాములు ఒక పునర్వివాహమును జరిపించారు. ఈ సంద ర్భమున కులాంతర విందు కూడా ఏర్పాటుచేశారు. ఆ విందుకు ధనికు లతో పాటు హరిజనులను ఆహ్వానించారు. భోజనములైన తర్వాత మిగిలిన అన్నమును యానాదుల కిచ్చుట పరిపాటి కాని శ్రీరాములట్లు గాక, యానా దులకు కూడా అందరితో పాటు విందు భోజనమును పెట్టించెను.

జనవరి 26 స్వాతంత్ర్యదినము రోజున శ్రీరాములు జాతీయ జెండాను ధరించి "హరిజనులకు, దేవాలయ ప్రవేశము కల్పించండి, గాంధీజీ నిరసన వ్రతాన్ని విరమింప జేయండి" అనే నినాదాలు కల అట్టలను ధరించి పోలీ సులు చూచుచుండగనే నెల్లూరు పురవీధులలో తిరిగెను. వెంటనే పోలీసులు అతనిని అరెస్టు చేసి, ఒక్క గంట నిర్బంధములో ఉంచి వదలి పెట్టిరి.

నెల్లూరులో "నగర జ్యోతి" అనుచోట వ్రాసిన వార్తలు చదువుటకు ప్రజలు గుమి కూడేవారు. పొట్టి శ్రీరాములక్కడకి చేరి, నూలు వడకుచు, నినాదాలు చేయుచు, దేశభక్తి గీతాలు పాడుచు ప్రొద్దు పోవువరకు ఉండే వారు. ఈ విధంగా మహాత్మా గాంధీ ప్రబోధించిన ఆదర్శాలు అన్నింటిని తుచతప్పకుండా పాటిస్తూ ఇతర కాంగ్రెస్ నాయకులకు, సంఘ సేవకులకు ఆయన ఆదర్శంగా మెలిగారు.

శ్రీరాములు హరిజన దేవాలయ ప్రవేశమునకై ఎంతో ప్రచారము చేసెను. దానితో హరిజనులలో చైతన్యము కలిగినది. దానితో 30 మంది చర్మ కారులు శ్రీరాములు ప్రమేయము లేకుండానే ఒక భజన సంఘముగా ఏర్పడి 1944డిశంబరు 25వ తేదీన నెల్లూరులోని రంగనాయక దేవాలయ ములో ప్రవేశించి భజన చేయసాగిరి. సనాతనులైన అగ్రజాతులీ సంఘటన సహించలేకపోయిరి. ఈ సంఘటన నెల్లూరు చరిత్రలోనే ఒక నూతనా ధ్యాయమును సృష్టించింది.

అందులో అస్పృశ్యతా నివారణకు హరిజన దేవాలయ ప్రవేశము ఒక్కటే మార్గము కాదన్న బాపూజీ భావముతో శ్రీరాములు ఏకీభవింపలేక పోయినాడు. ఇతర మార్గాలను తెలుపుచు, అవి ఫలించలేదని ఇట్లు ఉదాహరించెను. హిందువుల నివాస స్థలాలలోని బావులలో నీరు హరిజనులు తోడ కోవచ్చుని ప్రభుత్వము చట్టము చేసినది. కాని హిందువులు హరిజనులను ఆ బావుల దగ్గరకు రానీయరు. కనుక దేవాలయ ప్రవేశ మొక్కటే మార్గము. ఈ తన అభిప్రాయమును సమర్థించుచు చరిత్రలోని ఉదాహరణములను కూడా బాపూజీకి తెలిపారు. క్రమేణా ప్రజలలో మార్పు వచ్చినది. అలహాబాదు వంటి ప్రధాన నగరాలలో హరిజనులకు దేవాలయ ప్రవేశము కల్పించబడినది. అగ్రవర్ణాల వారు హరిజనులను సోదరులుగా భావింప సాగారు.

ఒంటరిగా ఉద్యమమును సాగించలేరు. కనుక ఒక సంఘము నేర్పాటు చేయుట మంచిదని కొందరు శ్రీరాములుకు సలహా నిచ్చి యున్నారు. అతడు వెంటనే నెల్లూరు పురప్రముఖులను, అప్పటికే హిందూ మతంలోని కొన్ని దురాచారాలను మాన్పించటానికి కృషి చేస్తున్న హిందూ మహాసభ కార్యకర్తలను, ఆర్య సమాజ కార్యకర్తలను కలిసెను. వారిసహకారముతో 9-10-1945న "హిందూ సంఘ సంస్కరణ సమితి" అను ధార్మిక సమితిని స్థాపించెను. దీని ప్రధాన లక్ష్యాలు :

1) అంటరానితనాన్ని నిర్మూలించటం.
2) హరిజనులకు దేవాలయ ప్రవేశము కల్పించటం.
3) కులాంతర విందు భోజనాల నేర్పాటు చేయడం, దళిత సంఘాల ఆర్థికాభివృద్ధికి, విద్యాభివృద్ధికి తోడ్పడటం.
4) బాల్య వివాహాలను ఖండించడం, వితంతు వివాహాలను, వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించటం.
5) అనాథలు మరణించినపుడు వారికి అంత్యక్రియలు జరపటం.

శ్రీరాములు తరతరాలుగా ఉన్న అంటరానితనాన్ని తొలగించడానికే గాంధీజీ అడుగు జాడలలో నడిచెను. చివరి వరకు ఆయన గాంధేయ వాదిగానే ఉన్నాడు. బ్రిటిష్ ప్రభుత్వం వారు తమ పట్టుదలను కొంత తగ్గించుకొన్నారు. కొన్ని పాలనా సంస్కరణలను కాలక్రమంగా ప్రవేశ పెట్టారు. ఇక భారత దేశాన్ని తమ అధీనంలో ఉంచుకోవటం కుదరదని గ్రహించి, దేశానికి స్వాతంత్ర్యం ఇస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం స్వాతంత్ర్యం సంపాదించటం అది సిద్ధించే ఘడియలు దగ్గరకు వచ్చాయి. కాబట్టి వారు ఆధునిక భారతీయ సమాజ స్థాపనకు నడుం బిగించారు. ఇందుకు అవరోధాలుగా ఉన్న అంటరానితనం వంటి దురాచారాలను రూపుమాపే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

## జేగంటలు

ఆ రోజులలో హరిజనులకు దేవాలయ ప్రవేశం ఉండేది కాదు. వారికి అటువంటి ఉన్నతిని కల్పించవలెనంటే ముందుగా దేవాలయాలలోకి వారిని ప్రవేశపెట్టాలని వారికి దేవాలయ ప్రవేశాన్ని కల్పించే ఉద్యమం చేపట్టాలని గాంధీజీ పిలుపు నిచ్చారు.

శ్రీరాములు ఈ రంగంలో అప్పటికే కొంత కృషి చేశాడు. ఇకపెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సంకల్పించాడు. తన కార్య క్రమంలో విజయం సాధించటానికి కేవలం మాటలు సరిపోవని ఆయన భావించాడు. దీనికి ప్రజలలో పెద్ద కదలిక తీసుకొని రావాలంటే గట్టి ప్రయత్నం చేయాలి. అందుకే అంటరానితనం నిర్మూలన కోసం ఆయన నిరశన దీక్ష నిర్వహించడమే కర్తవ్యంగా భావించాడు. అతడు వేణుగోపాలస్వామి ఆలయము వద్ద 7-3-1946 మధ్యాహ్నము నుండి నిరశన దీక్ష ప్రారంభించెను.

దీక్ష ప్రారంభించి నాలుగు రోజులైనది. అయినా ధర్మకర్తల ఉద్దేశ్యములో మార్పు లేదు.

హరిజనులకు దేవాలయ ప్రవేశము కల్పించ వలెననిపట్టణములో అదే రోజున హర్తాళ్ జరిపినారు. అందులో అన్ని వర్గాల ప్రజలు చేరి దానిని విజయవంతం చేసిరి.

శ్రీరాములుకు గాంధీజీ మద్దతున్నదని తెలియగానే ధర్మకర్తలు వేణు గోపాల స్వామి ఆలయములో హరిజనులను ప్రవేశపెట్టుట కంగీకరించిరి.

1946 మార్చి 31వ తేదీన పొట్టి శ్రీరాములు నిరాహారదీక్ష ప్రాముఖ్యాన్ని వివరించుచు, కాంగ్రెసు నాయకుల కర్తవ్యమును గుర్తుచేయుచు గాంధీజీ సుదీర్ఘమైన పత్రికా ప్రకటనను చేసెను. దాని సారాంశమిది. పొట్టి శ్రీరాములు నిస్వార్థపరుడు. అతడు చేపట్టిన సమాజ సేవా కార్యక్రమాల పట్ల కాంగ్రెస్ కార్యకర్తలు నిర్లక్ష్యముగా ఉండుట దురదృష్టకరము. ఇది అతనికి కాగా, కాంగ్రెసుకే అవమానము. కాంగ్రెసు దేశ వ్యాప్తముగా విస్తరించిన ప్రజాస్వామ్య పంథాలో కొనసాగుచున్న పెద్ద పార్టీ. అయినా సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ప్రవర్తించరాదు. అస్పృశ్యతా నివారణ పార్టీ సిద్ధాంతములలోనిది. దానిని నిర్లక్ష్యము చేయరాదు. నేను 1915లో స్వదేశానికి వచ్చినప్పటి నుండి కాంగ్రెసు పార్టీతో నాకు సాన్నిహిత్యమేర్పడినది. స్వానుభవములో నేను గుర్తించిన విషయమేమనగా కాంగ్రెసు తన సిద్ధాంతాల కెంత వరకు ఎక్కువగా కట్టుబడి పనిచేయునో అంతగా జనాదరణ పొందును. ఎన్ని కష్టాలు వచ్చినా ప్రజాస్వామ్య వ్యవస్థ సరియైన దారినవలంబించి ధైర్యంతో ముందుకు సాగవలెను. ప్రజలలో ఉన్న బల హీనతలను ఆధారము చేసికొని ప్రయోజనము పొందవలెనని భావించు వ్యక్తి తాను పతనము చెందుటే గాక ప్రజల్ని కూడా పతనము పొందించును. భారత జాతి మహోన్నత జాతిగా మనుగడ సాగించవలెనన్నచో అంటరానితనాన్ని సమూలముగా నిర్మూలనము చేయుట అవసరము. ఇట్టి లక్ష్యాల సాధనకు అంకితమైన పొట్టి శ్రీరాములపట్ల అలక్ష్యము చూపుట బాధాకరమైనది.

అప్పటికి మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అందులో అందరూ కాంగ్రెస్ పెద్దలే సభ్యులు కానీ వారు హరిజనులు దేవాలయ ప్రవేశాన్ని గురించి వెనుక ముందులాడుతూ, చట్టాన్ని తీసుకొని రాలేదు. శ్రీరాములు ఎంతగా ప్రయత్నించినా ప్రభుత్వము హరిజనుల దేవాలయ ప్రవేశ విషయమున కాల యాపన చేయిస్తూనే వచ్చింది. దానిని శ్రీరాములు సహింపలేకపోవుచున్నాడు. దేవాలయ ట్రస్టీలపై ఒత్తిడి తీసుకొని వచ్చెను. వారికి గత్యంతరములేక 1946 మే 25న హరిజనులను దేవాలయము లోనికి ప్రవేశపెట్టుటకు నిర్ణయించిరి. తమ నిర్ణయము నామోదించుచు ఉత్తర్వులు వెంటనే పంపవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వమును కోరినారు. రాష్ట్ర ప్రభుత్వము ఆగష్టు 9 లోగా ఉత్తరువులు జారీ చేయనిచోతాను నిరశన వ్రతము చేయుదునని శ్రీరాములు ప్రకటించెను. అతని పట్టుదల ప్రభుత్వ మెరిగినదే. కనుక ఇక జాప్యము చేసినచో బాగుండదని 11-8-1946న హరిజనులకు చట్టరీత్యా దేవాలయ ప్రవేశము కల్పించి, అప్పటి అసెంబ్లీ స్పీకరైన షణ్ముగం పిళ్లై గారి ఆధ్వర్యమున హరిజనులకు దేవాలయ ప్రవేశము చేయించెను.

రాష్ట్రములోని ఇతర దేవాలయములలో కూడా హరిజనులకు ప్రవేశం కల్పించాలని శ్రీరాములు సంకల్పం.

గాంధీజీ అడుగు జాడలలో నడిచే శ్రీరాములు ఆంధ్రప్రాంతములోని అన్ని దేవాలయములలోను హరిజనులకు ప్రవేశము కల్పించవలెనని కృషి చేయసాగాడు.

శ్రీరాములు రాష్ట్ర ప్రభుత్వముచేత హరిజన దేవాలయ ప్రవేశ బిల్లును ఆమోదింప జేయుటకు తీవ్రముగా కృషి చేయసాగారు. తనకు సహకరించ వలసినదిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాధికారులపై ఒత్తిడి తెచ్చెను. ఈ ఒత్తిడి ఇంకొక మారు నిరాహారదీక్ష ద్వారానే తీసుకొని రావలసిన ఆవశ్యకతను ఆయన గుర్తించాడు.

1946 నవంబరు 25 సోమవారము పగలు 12 గంటల నుండినిరా హారదీక్ష ప్రారంభం అయింది. కొందరు పెద్దలు ప్రభుత్వంతోను,శ్రీరాములు తోను రాయబారాలు సాగించారు. పెద్దల మాటలపై శ్రీరాములుకు పరిపూర్ణ విశ్వాసం ఉన్నది.

శ్రీరాములు దూరదృష్టి, విజ్ఞత చూపేవాడు. దేవాలయ మంత్రి యిచ్చిన హామీని, కాంగ్రెసు నాయకుల మాటలను బట్టి, ప్రభుత్వానికి కొంత వ్యవధి ఇవ్వతగినదే అని భావించి, అందుచే తాత్కాలికముగా దీక్ష విరమింప దలచెను. దీక్ష ప్రారంభించిన 19వ రోజున 13-12-1946న బి.యస్. మూర్తి వచ్చి శ్రీరాములుకు నిమ్మరసము ఇచ్చి దీక్ష విరమింప జేసెను.

## చరఖా వీరుడు

గాంధీజీ మత, నైతిక, రాజకీయ, ఆర్థిక, సాంఘిక దృక్పధాలన్నీ మానవ జీవితములోని అంతర్భాగములుగా గుర్తించారు. వీటి సాన్నిహిత్యాన్ని విడదీసి, అంచనా వేయడము అసాధ్యము. అని మహాత్మా గాంధీ భావం. గాంధేయుడైన శ్రీరాములు కూడా మానవ సమగ్రత్వాన్ని గుర్తించిన వ్యక్తి. లక్ష్య సాధనలో అతనికి అచంచల దీక్ష ఉన్నది. ప్రతి వ్యక్తికి ఉన్నతా దర్శాలు ఉండవలెనని ఆయన ఉద్దేశ్యము. ప్రతి వ్యక్తి సమాజసేవ కంకి తము కావలెనని ఆయన అభిప్రాయము. అతడు హరిజన సేవకు మాత్రమే అంకితము కాలేదు. ఆ కృషి చేయుచునే సాంఘిక సేవా కార్యక్రమములను చేపట్టెను.

నెల్లూరులో ఖాదీ ప్రచారం ఆరంభించి నిర్విరామంగా కొనసా గించాడు. ఆ సమయంలో చాలమంది ఇళ్ళలో చరఖాలను ఏర్పటుచేసెను. అవి చెడిపోయి నప్పుడు తానే బాగుచేసేవాడు. బాగుచేతకు సామానున్న సంచి తగిలించు కొని వెళ్ళేవాడు. ఖద్దరు లుంగీ, పైమీద తుండు పంచె, తలపైన గాంధీటోపి-ఇంత నిరాడంబరముగా ఆయన తిరిగేవాడు. పాటలు తియ్యగా పాడుచు చరఖాలు వడకుటలో ప్రజలకు ఆసక్తి కలిగించేవాడు.

ఆడువారికి, పిల్లలకు దేశభక్తి గీతాలు నేర్పుచు వారినాకట్టు కొనేవాడు. దగ్గర గ్రామాలలో కూడా ఖాదీ ప్రచారము చేసేవాడు.

ఖాదీ విషయమున మహాత్మాగాంధీకున్నట్లే శ్రీరాములుకు కూడా అవగాహన ఉన్నది. అది గ్రామములకు ఉపాధి కల్పించును.

నెల్లూరు జిల్లా కలెక్టరయిన మలయప్పన్ దంపతులతో శ్రీరాములుకు పరిచయమైంది. వారికి నూలు వడకుట యందు శ్రద్ధ కలుగునట్లు చేసెను.

గాంధీజీ ఖాదీ పరిశ్రమను వికేంద్రీకరింపజేయాలని, తద్వారా గ్రామ స్థాయిలోని పిల్లలకు కూడా ఉపాధి కల్పించవలెనని ఆశించారు. కాని స్వాతంత్ర్యము వచ్చిన తరువాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్న గాంధీ యులే ఖాదీ పరిశ్రమ విషయమై శ్రద్ధ చూపుటలేదు. దీనికి శ్రీరాములు సూచన యేమనగా, చరఖా సంఘము వారి సహకారముతో ఖాదీ తీయు టలో ఆసక్తి కలవారికి శుద్ధమైన ఖాదీనూలు అందజేసినచో ఖాదీ పరిశ్రమ పెరుగుటయే కాక ఉత్తమమైన ఖాదీ వస్త్రము తగినంతగా తయారగును.

యంత్రముల ద్వారా సాంకేతిక పరిజ్ఞానమును పెంచుకోవలె గాని అధిక సంఖ్యలో వస్తువులను ఉత్పత్తి చేసే యంత్రాలను ఉపయోగించి కార్మికుల పని పోగొట్టి వారిని పస్తులు ఉంచుట భావ్యము కాదని శ్రీరాముల అభిప్రాయము.

శ్రీరాములు నెల్లూరులోఉన్న రోజులలో మునిసిపల్ కార్మికుల పరిస్థి తులను చక్కదిద్దుట కెంతో కృషి చేసెను. పాకీవారు మొదలైన చిన్నచిన్న ఉద్యోగుల స్థితి గతులను మెరుగు పరచుటకు సాయపడెను. పాకీ వారు నివసించు ఇళ్లమధ్య నివసించుచు వారి అభివృద్ధికి అనేక కార్య క్రమములు చేపట్టెను. వారికి నూలు వడకుటలో శిక్షణ ఇచ్చెను. వారి తగాదాలు తీర్చెను. త్రాగుడు మున్నగు దుర్వ్యసనాలను మాన్పెను. వయోజనులకు రాత్రి పాఠశాలలు నిర్వహించెను.

శ్రీరాములు ఈ రీతిగా మునిసిపల్ ఉద్యోగుల స్థితిగతులకు కృషి చేస్తూనే, గాంధేయ వాదిగా కాంగ్రెసు అనుచరుడుగా తన కర్తవ్యమును మాన లేదు. 4-6-47న అప్పటి మద్రాసు రాష్ట్ర స్థానిక వ్యవహారాల మంత్రి చంద్రమౌళి గారికి ఒక లేఖ వ్రాశారు. దానిలో తన ఆవేదన నిలా వ్యక్తము చేశారు. "గత సంవత్సరము ఆగష్టు నెలలో నెల్లూరు మునిసిపాలిటీలో పనివాళ్ళు సమ్మె చేసినపుడు దాని నవకాశముగా తీసికొని కమ్యూనిష్టులు సమ్మెను బలపరచుట ద్వారా క్రొత్తగా ఏర్పడిన కాంగ్రెసు ప్రభుత్వమును అప్రతిష్టపాలు చేయవలెనని చూచిరి. వారి కటువంటి అవకాశమియ్యకుండా కాంగ్రెసు కార్యకర్తలు ప్రజల సహకారముతో నగర పరిశుభ్రతను కాపాడుటలో ఎంతో కృషి చేసిరి."

పొట్టి శ్రీరాములుకు మరొక సమస్య వచ్చిపడినది. నెల్లూరు మునిసిపాలిటీలో పనిచేయుచున్న 31 మంది పాకీవారికి, మురుగు కాల్వలను శుభ్రము చేయువారికి తక్కిన ఉద్యోగులకు వలెనే 25% మూల వేతనములో కలపలేదు. నెలకు రూపాయి ప్రావిడెంటు ఫండులో జమ చేయలేదు. ప్రభుత్వము నుండి ఆదేశాలు రాలేదని మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యము చేయుచున్నారు. శ్రీరాములా విషయమును మద్రాసు రాష్ట్ర కమిషనర్, రాష్ట్ర పట్టణ కాంగ్రెసు సంఘాల దృష్టికి తీసికొని వెళ్ళెను. శ్రీరాములు మునిసిపల్ కమిషనరును కలసి చెప్పగా ఆ ఉత్తర్వులు తక్కువ స్థాయి ఉద్యోగులకు వర్తింపచేయుటకు వీలుకాదని ఆ ఉద్యోగి శ్రీరాములు ఇందు కొరకు మునిసిపాలిటీ ఆరోగ్య సిబ్బంది వారిచేత సమ్మె చేయించాడు. చెప్పెను. 1946 ఆగష్టు 9వ తేదీన జరిగిన సమ్మె ఫలముగా మునిసిపాలిటీలో పనిచేయుచున్న 213 మంది ఉద్యోగులకు ప్రయోజనము కలిగినది. అది పాకీవారికి వర్తింప జేయక పోవుట భావ్యము కాదని శ్రీరాములు కమిషనరుతో వాదించెను. ఈ విధంగా ఆయన తన సేవలను పీడిత ప్రజల పక్షాన, వారి హక్కుల రక్షణకు వినియోగించాడు.

శ్రీరాములు కాలానుగుణముగా వ్యవహరించు తత్త్వము కలవాడు. ఈ సమస్య విషయమై ప్రభుత్వాధికారుల మొండి వైఖరి చూపుచున్నారు. అందుచే అతడు నిరాహార దీక్ష ప్రారంభించుతున్నాడు. కాని అనివార్య కారణాల వలన దీక్షను వాయిదా వేశాడు.

## మద్యపాన నిషేధము

గాంధీజీ దేశ ప్రజలంతా ఆరోగ్య సౌభాగ్యాలతో జీవించాలని కోరు కొనేవాడు. శ్రీరాములు అట్లే కోరేవాడు. ఆరోగ్యానికి భంగము కలిగించే మత్తు పదార్థాలతో కష్టజీవులు తమ కష్టాలను మరచుటకు ప్రయత్నించు చున్నారు. వారికి చేతిలో డబ్బులు ఉన్నచో ఇంటి కన్న సారాయి దుకాణమే గుర్తుకువచ్చును. ఆ పదార్థానికి బానిస అయితే ఇక మానలేదు. దానితోవారి కుటుంబాలు దారిద్ర్యానికి నిలయమై పోతున్నాయి. అందుకే ఆరుద్ర కవి త్రాగు తుండే కొద్దీ / తరుగుతుండెను బుద్ధి / మెదడు మేయును గడ్డి అని త్రాగే వారి స్థితిని చక్కగా తెలిపాడు.

ప్రజల వ్యక్తిగత జీవితములో జోక్యము చేసికొనే అధికారము ప్రభుత్వానికి లేనిమాట నిజమే. కాని అది బాధాకరమైనప్పుడు తప్పు కాదు. గాంధీజీ అటువంటి విషయాలలో ఇలా అన్నాడు. “వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని గురించి మాట్లాడేవారికి దేశ స్వరూప స్వభావములు తెలియవు. త్రాగుడు తన వ్యక్తిగత హక్కు అని వాదించుటలో తప్పులేకపోతే, తమ కామవాంఛ తీరడం కోసం, ప్రభుత్వమే స్త్రీలను సమకూర్చాలని కోరడం కూడా తప్పు లేదు.”

మద్రాసు ప్రభుత్వము మద్యపానాన్ని నిషేధించినది. అందుకు పొట్టి శ్రీరాములు సంతోషించినాడు. మద్యపాన నిషేధము అమలు వలన కలుగు పరిస్థితిని తెలిసి కొనుటకు శ్రీరాములనేక గ్రామాలు తిరిగాడు. మద్యపాన నిషేధానికి ముందు గ్రామానికొక సారాయికొట్టు ఉండగా ఇప్పుడింకొక టైనది. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ నిర్మాణ కార్యక్రమ నిర్వాహకుడుగా

శ్రీరాములు మద్యపాన నిషేధము సక్రమముగా అమలు జరుపుటకు ప్రచారకులకు, ప్రభుత్వాధికారులకు ఎన్నో సలహాలిచ్చెను.

1) ప్రచారకులు మంత్రుల, కాంగ్రెసు పెద్దల సహకారము సంపాదించ వలెను. గాంధేయ మార్గాన్ని ప్రజల ముందుంచవలెను. అట్లా చేయనిచో ప్రచారకుల కృషి ఫలించదు.

2) మద్యపాన నిషేధము కేవలము ప్రభుత్వ శాసనముతో అమలు జరుపుట సాధ్యము కాదు. గాంధీజీ చెప్పినట్లు మద్యపాన నిషేధాన్ని ప్రజలలో ప్రచారము చేయవలెను.

3) సామాన్య ప్రజలకు మద్యపానము వలన కలుగు నష్టాలను ఇబ్బందులను వివరించి మాన్పించుట సులభము కాని విద్యావంతులు, ఉద్యోగులచేత మాన్పించుట కష్టము.

4) ప్రచారకులు కేవలము ఉద్యోగ ధర్మముగా గాక మనస్ఫూర్తిగా ఉద్బోధించవలెను. అప్పుడే ప్రచారకుల కృషి ఫలించును.

5) ప్రచారకులంతా గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలపట్ల అచంచల విశ్వాసము కలిగి ఉండవలెను. నిర్భాగ్య సోదరులను ఉద్ధరించుట ప్రథమ కర్తవ్యముగా భావించవలెను.

**ప్రభుత్వాధికారులకు కొన్ని సలహాలనిచ్చెను. అవి :**

1) మంత్రులు, కాంగ్రెసు నాయకులు ప్రభుత్వాధికారులు మద్యపాన నిషేధము అమలులో తమ సహకారము నందించవలెను.

2) ప్రచారకులలో బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతము లేకుండా ప్రభుత్వాధి కారులు చూడవలెను.

3) త్రాగుబోతులు ఒకప్పుడు ప్రచారకులను దూషించి హింసించవచ్చు. ప్రభుత్వాధికారులు ప్రచారకులను కాపాడవలెను.

4) ప్రచారకులను నియమించునప్పుడు గాంధేయ సిద్ధాంతాలు నమ్మిన వారిని, కల్లు దుకాణాల ముందు పికెటింగ్ చేసినవారిని మాత్రమే నియమించవలెను.
5) ప్రధానమైన విషయమే మనగా ప్రచారకులను పర్యవేక్షించు అధికారులు త్రాగుడు అలవాటు కలవారు కారాదు.

శ్రీరాములు తాను నిజాయతీపరుడు కనుక తప్పుచేసిన ప్రభుత్వోద్యోగులను విమర్శించేవాడు. కావలసిన దానికన్న ఎక్కువ సిబ్బంది అనవసరమనేవాడు. మద్య నిషేధాన్ని అమలుచేయుటకు ప్రచారకులకన్న డాక్టర్లు, స్త్రీలు, విద్యార్థులు, కాంగ్రెసు పెద్దలు ఎక్కువ సేవచేయాలని చెప్పినాడు.

నెల్లూరు జిల్లా కలెక్టరు మలయప్పన్ మద్యము సేవించు దురలవాటును నిర్మూలించటంలో నిర్విరామకృషి చేసి ఆ జిల్లాలో మంచి పేరు పొందాడు. ఆయన కాలములో జరిగిన ఒక సంఘటనను శ్రీరాములు ఉదహరించేవారు.

నెల్లూరికి దగ్గరలో కటారిపాలెము అనే గ్రామమున్నది. అక్కడ హరిజనులెక్కువ. అక్కడ ఎన్నో సారాయి దుకాణాలు ఉన్నవి. ప్రొహిబిషన్ చట్టము అమలులో వున్నా అక్కడివారు నిర్భయముగా సారా దుకాణాలను నడిపేవారు. పొట్టి శ్రీరాములు వగైరాల ప్రోత్సాహముతో కలెక్టరు 1949 ఏప్రిల్ మొదటివారములో ఆకస్మికముగా కటారి పాలెము వెళ్లెను. అపరాధులందర్నీ పట్టుకొని తీవ్ర శిక్షకు గురిచేశారు. కలెక్టరు తీసికొన్న చర్యవలన సంఘసేవా కార్యకర్తలలో నూతనోత్తేజము కలిగినది. వారు ప్రతి గ్రామానికి వెళ్లి రహస్యముగా ఉన్న కల్లుకుండలను బైటికి లాగసాగిరి. ఇక మద్య విక్రయానికి సంబంధించిన బేరమేమీ జరగలేదు. ఇదంతా అహింసా పద్ధతిలోనే జరిగినది. పొట్టి శ్రీరాములు అనుకొన్నాడు ఒక్క కలెక్టరు కృషితోనే ఇంత జరిగినదే మంత్రులు ప్రభుత్వాధికారులు పూనుకొన్నచో ఇంకెంతగా ఉండేదో అని తాను స్వయముగా త్రాగుబోతులను సంస్కరించేవాడు. త్రాగుబోతులపై కేసులు పెట్టినా వారికి శిక్షపడకుండా చూచెను.

గాంధీజీ సిద్ధాంతాలే శ్రీరాములు నమ్మినవన్నీ. ధనవంతులు విలాసముగా జీవించుట తప్పనుకొనే వాడు. వారు మద్య పానానికి దాసులు కాకుండా ఆదర్శవంతముగా ఉండవలెను అని కోరుకొన్నాడు. తాను బ్రతికి ఉన్నంత కాలము మద్యపాన దురాచారమును నిర్మూలించుటకు ప్రయత్నించాడు.

## భిక్షుక సమస్య

భారతదేశములో భిక్షుక సమస్య బాధాకరమైనది. దీనిని గూర్చి శ్రీరాములకొక అభిప్రాయమున్నది.

14-4-1943న "దీనబంధు" పత్రికకు 5-6-49 "నవయుగ" పత్రికకు వ్యాసాలు వ్రాశాడు. అందులో ఈ సూచన చేసెను.

"మన వాకిలి ముందునకు వచ్చి బిచ్చగాడు ధర్మము చేయమని బిచ్చమడుగును. వానికి బిచ్చము పెట్టుటవలన మనకు పాపమా? పుణ్యమా? పనీ-పాటా లేకుండా బ్రతికే భిక్షుకుల పరిస్థితి దేశానికి ప్రమాదకరము. రైళ్ళలో వీరి వలన మనకెంతో అసౌకర్యము కలుగుచున్నది. రోగాలు తగ్గినచో బిచ్చము వేయరని రోగాలు భరించేవారు కొందరు. తమ పిల్లలను కూడా కుంటి-గ్రుడ్డి చేయువారు కొందరు వారిని బాగుచేసి దేశానికి పనికివచ్చునట్లు చేయుట సాధ్యము కాదా? ప్రజలు-ప్రభుత్వము కలిసి పరిష్కరించ వలసినది భిక్షుక సమస్య. మానసిక - ఆర్థిక సమస్యలు వచ్చిన ప్రజలు యిల్లు వదలి భిక్షుకులగుచున్నారు. క్రమేణా వారు సోమరులగుచున్నారు. ఈ వృత్తిని నిర్మూలించుటకెన్నో సంస్థలు దీక్ష పూని ఉన్నాయి. వీరినాదు కొనుటకు పురపాలక సంఘ నిబంధనలలో కూడా అవకాశమున్నది. వీరు దానిని వినియోగించుకోరు. దానికి కారణము ప్రజలు ఉదారముగా భిక్ష వేయుటయే.

ప్రభుత్వానికి ప్రజలు తోడైతే భిక్షుక సమస్యను నిర్మూలించ వచ్చును. ప్రభుత్వము కనీసం ఒక రాష్ట్రములో అయినా భిక్షుక వృత్తిని మాన్పు

ప్రయత్నములు చేయవలెను. ఏదో ఒక నగరములో భిక్షుకులనరెస్టు చేసి నందువలన ప్రయోజనము లేదు. పంచాయతీలు, మునిసిపాలిటీలు బిచ్చగాళ్లకు ఆశ్రయ మియ్యవలెను. వారిని వారి స్వగ్రామములకు పంప వలెను. ప్రజలు అశక్తులైనవారికి కూడా బిచ్చము వేయరాదు.”

ప్రజలు దేహదార్ఢ్యము కలవారికి బిచ్చము వేయుట మానితే, వారేదో వృత్తిని చేపడతారు. పంచాయతీ రాజ్యము వలన ఇది సాధ్యము కావలెను. ఒక కుటుంబములో ఒక వ్యక్తి అశక్తుడైతే కుటుంబ సభ్యులెట్లా కాపాడుదురో దేశములో భిక్షుకుల సమస్య అట్టిదే.

భిక్షుక వృత్తిని నిషేధించుటకు చట్టము బిచ్చమడుగుట వృత్తిగా కలవారికే వర్తించును. కాని స్వచ్ఛంద భిక్షాన్ని స్వీకరించు సన్యాసులకు వర్తించదు. విశాఖలోని ప్రేమ సమాజము, రాజమండ్రిలోని జీవ కారుణ్య సంఘము భిక్షుక వృత్తి నిర్మూలనకు దీక్ష పూనినవి. వీరికి ప్రతి భారతీయుడు సహకరించి భిక్షుక వృత్తి నిర్మూలన చేయవలెను.

## జైళ్ల సంస్కరణలు

పొట్టి శ్రీరాములు, ఎర్నేని సుబ్రహ్మణ్యం మొదలైన వారితో ప్రభుత్వ రేషనింగు విధానాన్ని నిరసించుచు 1947 అక్టోబరులో గుడివాడలో ప్రదర్శన జరిపాడు. ప్రభుత్వము వారందరిని జైళ్లలో పెట్టెను. జైళ్లలో వున్న పరిస్థితి చూచి శ్రీరాములు విచారించెను. జైళ్ల పరిస్థితులు చక్క బడుటకై మద్రాసు ప్రభుత్వానికి వెంటనే చర్య తీసికోవలెనని డిమాండుచేస్తూ శ్రీరాములు14-11-47న ఇలా వ్రాశారు : “స్వతంత్ర భారతములో అహింసపై విశ్వాసముకల సత్యాగ్రహ ఖైదీగా సబ్ జైళ్ల గదులలోని పరిస్థితులను, అక్కడ ఉండే జైళ్లలోని ఖైదీల ఇబ్బందులను ముఖ్యముగా సత్యాగ్రహము చేసి జైలుశిక్ష అనుభవించువారి పరిస్థితిని మీ దృష్టికి తెచ్చుచున్నాను. ఈ విషయములన్నీ మీకు కూడా తెలిసియే ఉండును. ఆంగ్ల ప్రభుత్వము ఖైదీల పట్ల అమానుషంగా ప్రవర్తించినది. అమానుషముగా హింసించినది.

శారీరకంగా వారిని బాధించినా వారి ఆత్మవిశ్వాసాన్ని జయించలేక పోయి నది. ఈ విధానము నేటి ప్రజాస్వామిక ప్రభుత్వానికి తగినది కాదని విశ్వసించుచున్నాను."

1) జైలు గదులు అపరిశుభ్రముగా ఉన్నవి. ప్రతి 3 నెలలకొకసారి సున్నము వేయించవలెను.
2) గదులలో మురుగు పోయే సౌకర్యము లేదు. కొన్నిచోట్ల ఆ అవకాశమే లేదు.
3) పాయిఖానాలు అపరిశుభ్రముగా ఉన్నవి.
4) ఖైదీలకిచ్చు ఆహారము పరిశుభ్రముగా లేదు. చాలినంతగా లేదు. ఈ విషయాన్ని వెంటనే చక్కబరచాలి.

**ఖైదీల కోర్కెలు :**

1) ఖైదీలు ప్రతిరోజు కొంతసేపు ఆరుబయట గడుపుటకు అనుమతించవలెను.
2) వీరికేదైనా పని చూపించవలెను.
3) ప్రభుత్వ ఖర్చుతో వార్తాపత్రికలను అందించవలెను.

**సత్యాగ్రహుల కోర్కెలు :**

1) సబ్‌జైలులో సత్యాగ్రహులకు స్వేచ్ఛ కల్గించవలెను. వారి గదులు రేయింబవళ్ళు తాళము వేసి ఉంచరాదు.
2) సంకెళ్ళు వేయరాదు.
3) లాకప్‌లో వారిని ఉంచరాదు.
4) వారు చదువుకొనుటకు రాత్రివేళల ప్రభుత్వమే లాంతర్లు సమకూర్చవలెను.
5) సత్యాగ్రహము చేయునపుడు మాత్రమే వారిని అదుపుచేయవలెను.
6) అధికారులకు వ్యతిరేకులనే భావముతో వారిని అదుపుచేయరాదు.

ఈ కోర్కెలు నెరవేర్చనిచో ముందుగా లాంఛనప్రాయముగా నిరాహారదీక్ష చేయుదునని, అవసరమైతే కోరికలు తీర్చేవరకు ఆమరణ నిరాహార దీక్ష చేయుదునని అల్టిమేటం యిచ్చారు. చెప్పినట్లుగానే మూడు రోజులు నిరాహార దీక్ష చేశారు. తమ కనుకూలముగా ప్రభుత్వ ఉత్తర్వులు రాష్ట్రమంతటా వర్తింప చేయవలెనని ముఖ్యమంత్రికి లేఖ వ్రాశారు.

**ఇతర కార్యక్రమాలు :**

శ్రీరాములు నిర్వహించిన కార్యక్రమాలన్నిటినీ వరుసగా చెప్పుట కష్టము. రాజకీయ, మత, ఆర్థిక, సాంఘికాది విషయములలో వ్యక్తిగతముగా కానీ సామూహికముగా కానీ ఎప్పుడే సమస్య తలెత్తినా శ్రీరాములు దానిని తన తలపై వేసికొనేవాడు.

నెల్లూరులోని సంజీవశెట్టి వైశ్య హాస్టలులో శ్రీరాములు గౌరవ వార్డెనుగా ఉన్నాడు. అతడు గాంధేయ మార్గమున విద్యార్థులను తీర్చుటకు ప్రయత్నించెను. ఉదయముననే నిద్రలేచుట, ప్రార్ధనాది కృత్యాలలో పాల్గొనుట, సమయపాలన, సత్యవాక్య పాలన, క్రమశిక్షణ మున్నగు విష యాలు విద్యార్థుల కలవాటు చేసెను. ఎవరైనా తప్పు చేసినచో ఆ తప్పు నతడు తెలిసికొనునట్లు చేసేవాడు. భోజనశాలలో ఏ విద్యార్థి అయినా చెడుగా ప్రవర్తించినచో ఆ రోజు అంతా శ్రీరాములు ఉపవాసమే. ఆ విద్యార్థి వచ్చి బతిమాలే వరకు భోజనము చేసేవాడు కాదు. విద్యార్థులు మొదటి సినిమాకు వెళ్లవచ్చును. ఎవరైనా నియమానికి విరుద్ధముగా ప్రవర్తించినచో ప్రొద్దున్నే నిద్రలేచే సరికి వాని ముఖాన తిలకము ఉండెడిది. అనగా వాని విషయమును గుర్తించినట్లు. ఇంత కఠినముగా నిబంధనలు పాటించినా విద్యార్థులను ప్రేమించేవాడు. బలహీన, వ్యాధిత, నిరుపేద విద్యార్థులకు అనేక విధాల సహాయపడేవాడు.

నెల్లూరులో ఉన్న అనాథ ఆశ్రమమునకు నిధులు లోటుగా ఉన్నవని తెలిసికొని, జిల్లాకలెక్టరు గారికి వ్రాసి శాశ్వతనిధులు సమకూరునట్లు చేసెను.

విశాఖపట్టణం వెళ్ళి అక్కడి ప్రేమ సమాజ కార్యక్రమములను పరిశీలించెను. ఆ కార్యక్రమాలకు అతడు ముగ్ధుడై కలెక్టరుకు వ్రాసెను.

**ప్రేమసమాజ లక్ష్యాలు :**

1) సంఘ బహిష్కృతులకు సేవచేయటం.

2) అనాధలకు ఆశ్రయమివ్వడం.

3) అనాధ ప్రేతముల దహనాది సంస్కారం.

4) పేదలకు ఉచితముగా విద్య నేర్పుట.

5) బడుగు వర్గాల నివాస ప్రాంతాల ఆరోగ్య పరిస్థితులను చక్కపరచడం.

6) జంతు బలులను నిషేధించడం.

7) బడుగు వర్గాలను ఉద్ధరించడం.

8) అనాధ శిశు సంరక్షణ గృహ నిర్వహణం.

వీటిలో అనాథ ప్రేత సంస్కారం శ్రీరాములు నాకర్షించింది. ఆ అంశమును తమ సంస్కరణ సమితిలో చేర్చెను. అనాధ ప్రేతాలను మోసు కొనిపోవుటకు బండి నేర్పాటు చేయించెను. అట్లు చేయుట బాగా వున్నదని ప్రేమ సమాజము వారును అలాగే చేశారు.

వివాహ సంస్కరణల విషయమున కూడ శ్రీరాములుగారు అమూల్యమైన సేవ చేసెను. తన మిత్రుడైన డా॥సుబ్బారావుకు ఒకలేఖ వ్రాసెను. "అందులో డాక్టరుగా పనిచేయుచున్న అందమైన యువతి ఉన్నది. ఆమె మధురముగా మాట్లాడును. ఆమెకొక సంబంధము చూడగోరతాను. కులము సంగతి వదిలివేయి. మనభాషను అర్థము చేసికొనుటకు ఏపాటి బాధలేదు"అని.

అతడు చేయించిన మరొక వర్ణాంతర వివాహము స్మరణీయము. వధువు అనాధఐన మైత్రేయి. వరుడు ప్రేమసమాజ సభ్యుడు చిప్పాడ సూర్య నారాయణ మూర్తి. ఆమె వ్యాధి గ్రస్తురాలు. ఎక్కువ కాలం జీవించ

దని డాక్టర్లు చెప్పినారు. ముత్తైదువగా కన్ను మూయాలని ఆమె కోరిక. అట్టి ఆమెను పెండ్లాడుటకు ఎవరును ముందుకు రాలేదు. కాని శ్రీరాములు ప్రోత్సాహంతో సూర్యనారాయణ మూర్తి ఆమెను పెండ్లాడెను. ప్రకృతి చికిత్సతో ఆమె కోలుకున్నది. చిరకాలము జీవించి భర్త, పిల్లల ముందు కన్నుమూసినది. విధి ఏమి చేయునో ఎవరికి తెలుసు?

## విజేత

1857వ సంవత్సరంలో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ ఫలితంగా భారతదేశానికి స్వరాజ్యం వచ్చి ఉండవలసింది. కాని అనేక కారణాల వలన ఆ ఉద్యమం విఫలమైనది. భారతదేశం తూర్పు ఇండియా కంపెనీ పరిపాలన నుంచి నేరుగా బ్రిటిష్ రాచరిక పాలన క్రిందకు వచ్చింది. తదుపరి జాతీయ ఉద్యమం ఒక రూపం తీసుకోవడానికి కొంత కాలం పట్టింది. 1905 నాటి బెంగాల్ విభజన దేశీయులలో జాతీయ భావనను జాగృతం చేసింది. వందేమాతరం ఉద్యమం దేశ ప్రజల్ని ఐక్యపరిచింది. 1930 ఉప్పు సత్యాగ్రహం, 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమం విజయవంతం అయ్యాయి. 1945 రెండవ ప్రపంచ యుద్ధ పరిసమాప్తితో వలస రాజ్యాల పట్ల బ్రిటన్ వైఖరి మారసాగింది. 1885లో ప్రారంభం అయిన భారత జాతీయ కాంగ్రెస్ పుణ్యమా అని ఎన్నో సత్యాగ్రహాలు, సహాయ నిరాకరణ ఉద్యమాలు ఫలించి, మహాత్మాగాంధీ నాయకత్వంలో 1947 ఆగస్టు 14-15 తేదీన అర్ధరాత్రి భారతదేశం స్వతంత్రం అయింది. యూనియన్ జాక్ పతాకం అవనతమై త్రివర్ణ పతాకం భారత జాతీయుల ఆశయాదర్శములకు ప్రతీకగా రెపరెపలాడింది.

అయితే స్వాతంత్ర్యం వచ్చిన కొద్ది నెలలకే అనగా 1948 జనవరి 30వ తేదీన జాతిపిత మహాత్మాగాంధీని గాడ్సే కాల్చి చంపాడు.

ముప్పై సంవత్సరాల పాటు భారతజాతిని నడిపించిన మహాత్ముని వాణి మూగపోయింది. దేశీయుల్ని నిర్దుష్ట గమ్యంవైపు నడిపిన ఒక దివ్వె

ఆరిపోయింది. అయితే ఆ మహనీయుని సందేశం మూగవోరాదు. అది భారతీయుల్ని జాగృతపరుస్తూనే ఉండాలి. ఆయన ఉపదేశించిన జీవన మూల్యాలను శాశ్వతం చేయాలి.

ఈ భావాలతోనే పొట్టి శ్రీరాములు "గాంధీ స్మారక పథకం" (గాంధీ మెమోరియల్ స్కీమ్) ఒక దానిని రూపొందించాలని ఉద్యమించాడు.

ఆయన కృషి ఫలితంగానే హరిజన దేవాలయ ప్రవేశానికి మద్రాసు ప్రభుత్వం రెండు చట్టాలు చేసింది. అలాగే గాంధీజీ స్మృతి సంకేతంగా ప్రతి నెల 30వ తేదీన "పీడిత జన సేవా దినం"గా పాటించి ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని శ్రీరాములు గారు భావించారు. అందుకు అనుగుణ్యంగానే ఆచార్య రంగాగారి అధ్యక్షతన ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం జరిపి తీర్మానం చేసింది. తర్వాత 1948 ఫిబ్రవరి 22న ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ విజయవాడలో సమావేశమై సంఘ సేవ దినోత్సవ కార్యక్రమ తీర్మానాన్ని ధృవీకరించి, ప్రతినెల 30వ తేదీన చేపట్ట వలసిన కార్యక్రమాన్ని ఖరారు చేసింది. ఆ కార్యక్రమ వివరాలు :

1) ప్రతినెల 30వ తేదీన సంఘ సేవాదినోత్సవముగా పాటించడానికి తగిన చర్యల్ని అధికారులు గైకొనాలి.
2) అన్ని మతాలవారితో ప్రార్ధనలు జరిపించాలి.
3) బహిరంగ ప్రదేశాలలో, దేవాలయాలలో హరిజనుల ప్రవేశాన్ని పటిష్టంగా అమలు చేయాలి. వారిలోని న్యూనతాభావాన్ని, భయాన్ని పోగొట్టాలి.
4) చెప్పులు కుట్టేవారికి, పాకీ పనివారికి సహపంక్తి భోజనాలలో స్వాగతంపలకాలి.
5) నిస్వార్థంగా నూలువడికే కేంద్రాలని అంతటా నిర్వహించాలి.

ఈ కార్యక్రమాలని నిర్దేశించడానికి పొట్టి శ్రీరాములుకు తగిన కారణాలు లేకపోలేదు.

1947 డిసెంబరు నుంచి ఆంధ్ర జిల్లాలలో పర్యటించినపుడు హరిజనుల దేవాలయ ప్రవేశం, బహిరంగ ప్రదేశాలలో వారికి ప్రవేశం వంటి కార్యక్రమాల అమలులో చట్టాలు వచ్చినప్పటికి అధికారులు, పెద్దలు దానిని సరిగా పాటించి, అనుసరింపజేయడం లేదని శ్రీరాములు గుర్తించాడు. ఆచరణలోలేని చట్టాలవలన ఉపయోగం కన్న కీడు ఎక్కువ జరుగుతుందని ఆయన గమనించారు. హరిజనులపై అధికారుల దౌష్ట్యాలను ఆయన పసిగట్టాడు. ఎంతో బాధపడి ఆనాటి మద్రాసు ముఖ్య మంత్రి రెడ్డియార్ గారికి సుదీర్ఘమైన లేఖ వ్రాశాడు. వ్యవస్థాపరంగా కాంగ్రెస్ కమిటీలు వోట్ల కోసం, ఎన్నికల కోసం తాపత్రయపడడం తప్ప ప్రజాహిత కార్యక్రమాలను త్రికరణ శుద్ధిగా అమలు చేయడం లేదని గుర్తించి ఆయన ఆనాటి కాంగ్రెస్ అధ్యక్షుడు జె.బి.కృపలానికి 1948 ఫిబ్రవరి 16న జాబు వ్రాశాడు. అయినా ప్రయోజనం కనిపించలేదు.

చివరకు గాంధీ స్మారక పథకం ద్వారా ఈ కార్యక్రమాలు తానే చేపట్ట దలచినానని, ప్రభుత్వం సహకరించని పక్షంలో నిరాహార దీక్ష పూనగలనని వివరిస్తూ శ్రీరాములు ఆనాటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ ప్రభృతులకు ఉత్తరాలు వ్రాశాడు. వారందరూ ఆయనను తొందరపడ వలదని జాబులు వ్రాశారుతప్ప పూర్తి సమాచారం అందించ లేదు. చివరకు బాబూ రాజేంద్రప్రసాద్ గారు మద్రాసు ముఖ్యమంత్రికి ఈ విషయంపై జాబు వ్రాశారు. అంతేకాక వినోబాభావేని సంప్రదించి నిరాహారదీక్ష చేయవలసినదని శ్రీరాములుకు సూచించారు.

లక్ష్య సాధనకు మొక్కవోని ధైర్యాన్ని ప్రదర్శించాలన్న గాంధీజీ బోధనను జీర్ణించుకొన్న శ్రీరాములు 1948 సెప్టెంబరు 10వ తేదీన మద్రాసులోని ముఖ్యమంత్రి కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష ప్రారంభించాడు. పదకొండవ రోజున అనగా 1948 సెప్టెంబరు 21న ఆయనను అరెస్టు చేశారు. విడుదలచేస్తే మరల నిరాహార దీక్ష చేయకుండా ఆయనను వికలాంగుణ్ణి చేయాలనే వరకు ఆలోచనలు వెళ్లాయి.

చివరకు దీక్ష విరమింప జేయడంలో మిత్రుల మాటను శ్రీరాములు కాదనలేక పోయారు. శిక్షాకాలం పూర్తి కాకుండానే ప్రభుత్వం ఆయనను విడుదల చేసింది. అక్కడ నుంచి నెల్లూరు వచ్చి రెండు మాసాలున్నాడు. తన ప్రయత్నాన్ని మాత్రం విడవలేదు. ఎవరు తనకు సహకరించక పోవ డంతో 1949 జనవరి 12న మరలా దీక్ష ప్రారంభిస్తున్నట్లు ప్రకటిం చాడు. రాజేంద్రప్రసాదుగారు మద్రాసు ముఖ్యమంత్రికి లేఖ వ్రాశారు.

అయితే సేవాగ్రామ్ ఆశ్రమ యాజమాన్యం ఆయనకు సహకరించ లేదు. కాని జనవరి 11న వినోబాభావే పౌనార్ ఆశ్రమం నుంచి వ్రాసిన లేఖ శ్రీరాములుకు నైతిక బలాన్నిచ్చింది. సేవాగ్రామ్ ఆశ్రమంలో జనవరి 12వ తేదీన మధ్యాహ్నం దీక్ష ప్రారంభించారు. అది 28 రోజులు సాగింది. రంగా, పట్టాభి, గోరా వంటి హరిజన సంక్షేమ సంఘ సభ్యులు ఆయనకు మద్దతు పలికారు. ఆయన దీక్షను భంగపరచాలని అనేక ప్రయత్నాలు జరిగాయి. అయినా శ్రీరాములు తన లక్ష్యసాధనకై ఆమరణదీక్షను వ్రతంగా స్వీకరించారు. ఎవరెన్ని విమర్శలు చేసినా, అప్పటికీ ప్రభుత్వం కన్నీటి తుడుపు చర్యలు ప్రకటించగలదని హామీ యిచ్చినప్పటికీ ఆయన చలించ లేదు.

చివరకు మద్రాసు ప్రభుత్వం దిగి వచ్చింది. శ్రీరాములు ఆశించి నట్లు ప్రతినెల 30వ తేదీన హరిజన సేవా దినంగా పాటించి, హరిజనో ద్ధరణ కార్యక్రమాలను త్రికరణ శుద్ధిగా అమలు జరుగగలవని మద్రాసు ముఖ్యమంత్రి ఒ.పి.ఆర్. రెడ్డియార్ ప్రకటించారు.

అయితే ఫిబ్రవరి నెల 28వ తేదీతో ముగుస్తుంది కనుక ఆ తేదీన తొలి కార్యక్రమం చేపట్టాలని శ్రీరాములు షరతు విధించాడు. అందుకు మద్రాసు ప్రభుత్వం అంగీకరించింది.

శ్రీరాములుకు తేనె నిచ్చి దీక్షను విరమింపజేశారు.

శ్రీరాములు దీక్షకు ప్రతిస్పందించి మద్రాసు ప్రభుత్వం ప్రతినెల 30వ తేదీన హరిజన సేవా దినోత్సవంగా జరప నిర్ణయిస్తూ 1949 మార్చి 15వ తేదీన ఉత్తర్వు జారీ చేసింది. "ఈ విజయం హరిజనోద్ధరణ కార్య రూపం ధరించడంలో ముందంజ" అని చరిత్రకారులు అభివర్ణించారు. ఈ ఉద్యమ విజేత శ్రీరాములును ప్రశంసించని వారానాడు లేరు.

ఈ విధంగా శ్రీరాములు ఉత్తమ ఆశయాలను ఆచరణలో పెట్టడానికి గాంధేయ మార్గాన్నే అనుసరిస్తూ వచ్చారు.

## నిధి - పెన్నిధి

దేశం అంతటా పర్యటించి నిధి సేకరించడం పెద్ద కార్యక్రమం కనుక రాష్ట్రాలలో అంకితులై పనిచేసే త్యాగశీలురైన కార్యకర్తలకై కాంగ్రెస్ పెద్దలు అన్వే షించారు. గాంధీజీకి అనుంగు శిష్యుడైన పొట్టి శ్రీరాములును ఆంధ్ర ప్రాంతపు గాంధీ స్మారక నిధి సంచాలకుడుగా నియమించారు. ఈ సంస్థ ఆంధ్రప్రాంతపు కార్యవర్గ అధ్యక్షుడు ఎన్.జి. రంగా, వి. రామకృష్ణ ఉపాధ్యక్షుడు, దుగ్గిరాల గోపాలరామకృష్ణయ్య కార్యదర్శి. మరొక కార్యదర్శి పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి కాగా మహిళల నుంచి శ్రీమతి ద్రోణం రాజ్యలక్ష్మీ బాయమ్మను మరొక కార్యదర్శిగా తీసుకున్నారు. డాక్టర్ టి.వి.యస్. చలపతి రావుగారు కోశాధికారిగా ఉండేవారు.

అటువంటి ఉద్దండులతోటి ఈ సంస్థలో పొట్టి శ్రీరాములు గాంధీ స్మారక నిధికి నిధులు సేకరించే గురుతర బాధ్యతను నిష్కల్మషంగా, నిస్వార్థంగా నిర్వర్తించాడు.

"ఈ నిధి క్రింద సేకరించిన మొత్తంలో 15% ధనాన్ని పట్టణ ప్రాంతాలలో వెచ్చించాలి. మిగిలిన 85% నిధులను గ్రామీణపేదల అభ్యున్నతికై వెచ్చించాలి" అని గాంధీ స్మారక నిధి కేంద్ర కార్యాలయం స్పష్టంగా నిర్దేశించింది. ఆ ప్రకారమే పొట్టి శ్రీరాములు చరఖా వ్యాప్తికీ, గ్రామీణ

పరిశ్రమలు, తేనె పరిశ్రమ వంటి కార్యక్రమాలలో గ్రామీణులు పాల్గొనేటట్లు వివిధ పథకాలు చేపట్టి నిధుల్ని సమీకరించాడు.

గాంధీ సిద్ధాంతాల ప్రచారం స్త్రీలకు, బాలురకు తగు ఉపాధి కల్పనా, హరిజనోద్ధరణ కార్యక్రమాలు, గిరిజన, ఆదివాసి సంక్షేమపథకాలు, కుష్ఠు రోగ నివారణ చర్యలు, ప్రాథమిక విద్యా వ్యాప్తి, ఆరోగ్య, జీవశాస్త్ర విషయాల బోధన, గోసేవా పథకాలు, వ్యవసాయ విస్తరణ మొదలైన కార్యక్రమాలను ఈ సంస్థ గ్రామాలలో చేపట్టింది.

శ్రీరాములు కృషి వలన కృష్ణా జిల్లాలో14 సంస్థలు, గుంటూరు జిల్లాలో 17 సంస్థలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 17 శాఖలు, తూర్పు గోదావరి జిల్లాలో 6 శాఖలు, విశాఖపట్టణం జిల్లాలో 6 శాఖలు, శ్రీకాకుళం జిల్లాలో 4 శాఖలు, నెల్లూరు జిల్లాలో 11 శాఖలు, కర్నూలు జిల్లాలో 2, బళ్ళారి జిల్లాలో ఒకటి,అనంతపురం జిల్లాలో రెండు, చిత్తూరు జిల్లాలో రెండు, కడప జిల్లాలో రెండు సంస్థలు ఆవిర్భవించాయి.

ఈ సంస్థలలో ఖాదీ శిక్షణ కార్యాలయాలు ఉన్నాయి. హరిజన, ఆదివాసి హాస్టళ్లున్నాయి. మహిళా సంక్షేమ కేంద్రాలు ఉన్నాయి. గ్రామీణ, కుటీర పరిశ్రమలలో శిక్షణా కేంద్రాలు ఉన్నాయి. ఇలా పొట్టి శ్రీరాములు గాంధీజీ ప్రవచించిన గ్రామీణ ఆర్థిక వికాస కార్యక్రమాలు ఎన్నింటికో పెన్నిధిగా ఎదిగారు. త్రికరణ శుద్ధిగా గాంధీజీ భావాలను ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించారు.

ఈ గాంధీజీ స్మారక నిధి సంచాలకుడిగా ఆయన నెలకు 150 రూపాయలు జీతం తీసుకొనవచ్చును. కాని ఆయన అలా తీసుకోలేదు. తనకు అవసరమైనంత వరకే తీసుకొని ఖర్చు చేసుకొనేవారు. అది జీతంకన్న తక్కువే ఉండేది. ఒంటిపూట భోజనం, ఒకఖాదీ లుంగీ, తుండు, మూడవ తరగతి రైలు ప్రయాణ ఖర్చులకు మాత్రమే ఆయన తీసుకొనే వారు. అవే ఆయన అవసరాలు. అవసరానికి మించి ఆయన ఎన్నడూ డబ్బు తీసుకొనే వారు కాదు.

ఒకసారి జిల్లా సంక్షేమ కమిటీ సమావేశానికై ఆయనకు రాకపోకలు, దిన బత్యం క్రింద పదహారున్నర రూపాయలు మంజూరు చేశారు. అయితే ఆయనకు ఖర్చు అయినది రూపాయిన్నర మాత్రమే. అంతే తీసుకొని మిగిలిన సొమ్మను ఆయన జిల్లా కలెక్టర్‌కు తిప్పి పంపించి వేశారు. అంతటి నిక్కచ్చి అయిన నిరాడంబర జీవి పొట్టి శ్రీరాములు.

గాంధేయ వాదులు పలు సేవా కార్యక్రమాలలో పాల్గొని ప్రజలకు సేవ చేసే నిమిత్తం శ్రీరాములు రెండేళ్లు శిక్షణా కార్యక్రమం ఒకదానిని సూచించారు : అది

1) ఆరుమాసాల పాటు ఇచ్చే ఆయుర్వేద, పశువైద్య శిక్షణ.

2) ఆరుమాసాల పాటు ప్రకృతి వైద్య శిక్షణ.

3) మూడు మాసాల పాటు గాంధేయ సిద్ధాంతాలకు లోబడిన, మరింత శిక్షణ.

4) తొమ్మిది మాసాల పాటు గ్రామ సేవా శిక్షణ.

ఈ రెండు సంవత్సరాల శిక్షణ పొందిన గాంధేయవాది సమాజసేవా రంగంలో ఏ కార్యక్రమాన్నైనా సరే ప్రజలకు ఉపకరించే రీతిలో చేయగలుగుతారు. అందుకు తగిన కఠిన శిక్షణను శ్రీరాములు సూచించి అమలు చేశారు.

గాంధీ స్మారక నిధి క్రింద పనిచేసే వివిధ సంస్థలకు నిధులు మంజూరు చేయడంలో ఆయన చాలా కఠినంగా వ్యవహరించే వారు. శిక్షణ విషయంలో ఎటువంటి రాయితీలు, మొగమాటాలకు ఆస్కారం ఇచ్చేవారు కాదు. ధార్మిక సంస్థల మంచి చెడులు, సేవా కార్య క్రమాలలో నిజానిజాల గురించి పూర్తిగా తెలుసుకొని ఆయన నిధుల్ని మంజూరు చేసేవారు.

ఈ నిజానిజాలు తెలుసుకొనేందుకై ఆయన ఆయా ప్రాంతాలలోని గాంధేయ వాదుల నుంచి జాగ్రత్తగా సమాచారాన్ని సేకరించి, వాటిలోని

మంచి చెడులు విచారించి నిధుల్ని అందించేవారు. పూర్తిగా సంతృప్తి చెంది కానీ ఆయా సంస్థలకు ఆయన నిధుల్ని విడుదల చేసేవారు కాదు. గాంధేయ నిబంధనల్ని, సిద్ధాంతాలని సరిగా పాటించని వారికి ఆయన చిల్లి గవ్వ కూడా మంజూరు చేసేవారు కాదు. గాంధీ ఆశ్రమాలు అన్నింటినీ మచ్చలేని రీతిలో నడిపించాలని ఆయన అహోరాత్రాలు శ్రమించేవారు. ప్రజలలో తమ సంస్థలు ఆర్థిక వ్యయకర్తనల పట్ల ఎటువంటి అపోహలు, అనుమానాలు లేకుండా చూసే నిమిత్తం అప్పుడప్పుడూ పత్రికా ప్రకటనల ద్వారా పూర్తి వివరాలను బహిరంగ పరిచేవారు. ఏ సంస్థకు ఎంత నిధిని మంజూరు చేసినదీ, ఎంత మొత్తాన్ని ఏ కార్యక్రమానికై వెచ్చించినదీ పూర్తి వివరాలను శ్రీరాములు ఎలాంటి దాపరికాలు లేకుండా వెల్లడించేవారు.

అయితే ఎన్నో శ్రమలకు సహించి, సంవత్సరాల పాటు కష్టపడి నప్పటికీ శ్రీరాములు గారు లక్ష్యాన్ని సాధించలేకపోయాడు. ఇతర రాష్ట్రా లలో ఈ కార్యక్రమాలు చురుకుగా సాగి సత్ఫలితాలు రావడానికి ఆంధ్ర ప్రాంతంలో యివి మందకొడిగా నడవడానికి కారణాలను ఆయన అన్వే షించాడు.

సొంత రాష్ట్రం లేనందున, పాలనా పరమైన సౌలభ్యం లేకపోయి నందువల్ల ఆంధ్రులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని శ్రీరాములు తీర్మానించు కొన్నారు. సొంత రాష్ట్రం లేనిదే యిలాంటి కార్యక్రమాలు ఫలప్రదం కావని నిర్ణయించుకున్నారు. గాంధీ స్మారక నిధి సంచాలక బాధ్యత నుంచి తొలగి ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కోసం ఉద్యమించాలని ఆయన సంకల్పించి 1952 అక్టోబరు 16వ తేదీన తన బాధ్యతను ఎస్.ఎస్.మజీకి అప్పగించేశారు.

అప్పట్లో శ్రీరాములు తన భావాలను ప్రజల ముందు యిలా తెలియ జేశారు :

"నిర్మాణాత్మక కృషిలో నేను ఎన్నో ఇబ్బందులకు గురిఅయ్యాను. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం లేనందువల్లనే ఇది జరిగిందని గ్రహించాను. ఆంధ్రరాష్ట్రం ఏర్పడకుండా ఈ నిర్మాణాత్మక కృషి జరగదని నిశ్చయించు కొన్నాను. ఈరంగంలో కృషిచేసే ఏ కార్యకర్తా ప్రభుత్వ విధానాల అమలును హర్షించ లేరు. సంతృప్తిపడలేరు. అయినప్పటికీ ప్రభుత్వంలోని వారు వీరికి తెలిసిన వారవడం వలన వారి సానుభూతి వీరికి ఉన్నందు వలన నిర్మాణ కార్యకర్తలు ఏదో కొంత కృషి చేయగలుగు తున్నారు. కాని పలు భాషలు మాట్లాడే ప్రజలు ఉంటున్న మద్రాసు వంటి ప్రదేశాలలో నిర్మాణ కార్యకర్తలను పట్టించు కొనేవారు లేరు. ఈ విషయం మన ఆంధ్ర ప్రాంతంలో మరీ కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. కనుక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేసుకొనడం అత్యవసరం అనిపిస్తోంది." ఈ ఆలోచనల తోనే శ్రీరాములు గారు మధనపడ్డారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనకై తనవంతు త్యాగాన్ని చేయాలని దృఢంగా నిశ్చయించుకొన్నారు.

## రాష్ట్రపిత

"పట్టుపట్టరాదు. పట్టిన విడవరాదు. పట్టినేని బిగియ పట్టవలయు. పట్టి విడుట కంటె పడి చచ్చుటే మేలు" అని వేమన అన్న మాటల్నిఅక్షరాలా నిజం చేసినవాడు పొట్టి శ్రీరాములు. ఆంధ్రరాష్ట్ర సాధనలో ఆయన పట్టు విడవని, చెక్కుచెదరని ఈ వ్యక్తిత్వం అమరమై నిలిచింది.

అంతేకాదు "ఆదర్శాలు నిజానికి ఆత్మ శక్తి సంకేతాలు. అలాగే వ్యక్తిత్వం కూడా అనంత శక్తి కేంద్రం. ఈ రెండూ కలసిన మనిషి చరిత్రను సృష్టిస్తాడు"అన్న హెన్రీజేమ్స్ మాటలకు శ్రీరాములుగారు సాకార స్వరూపులు. మంచి ఆదర్శాలు, త్యాగ భావనం, సమష్టి ప్రయోజనా కాంక్ష గలిగిన వ్యక్తిత్వం ఆయనకు సహజంగా వచ్చినవి. వీటిచేతనే ఆయన ఆంధ్ర రాష్ట్ర సాధనను సాధ్యం చేశారు. ఇందుకై జీవితాన్ని త్యాగం చేశారు. ఆత్మ బలిదానంతోనే కొన్ని మహత్తర లక్ష్యాలు నెరవేరుతాయని ఆయన తన

ఆత్మార్పణం ద్వారా నిరూపించారు. వ్యక్తి నిష్టమైన స్వార్ధం కన్నా సమిష్టి ప్రయోజనం గల ఆదర్శం ముఖ్యం అని భావించిన సుశ్లోకుడు పొట్టి శ్రీరాములు.

ఆయనలో ఈ ఉద్యమ స్ఫూర్తి అంకురించి తీవ్రరూపం ధరించ డానికి చారిత్రకనేపథ్యం ఆనాటి రాజకీయ పరిస్థితులు ఎంతగానో దోహదం చేశాయి.

ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలన్న కోరిక హఠాత్తుగా పుట్టినది కాదు. 1912 మే నెల చివరి వారంలో కృష్ణా, గుంటూరు జిల్లాల ఇరవై ఒకటవ మహాసభ నిడదవోలులో జరిగింది. (అప్పట్లో నిడదవోలు కృష్ణా జిల్లాలో ఉండేది. తదుపరి పశ్చిమ గోదావరి ఏర్పడిన పిదప ఆ జిల్లాకు చెందింది.) నిడదవోలు సభలో కొందరు యువకులు తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతూ ఒక చర్చను లేవదీశారు. అయితే అది కడకంటా సాగక, అసంపూర్తిగానే సభలు ముగిసాయి.

దీనిపైన ఉన్నవ లక్ష్మీ నారాయణ, చల్లా శేషగిరిరావు, జొన్నవిత్తుల గురునాథం, బయన నరసింహేశ్వర శర్మ, కొండా వెంకటప్పయ్య, ముట్నూరి కృష్ణారావు ప్రభృతులు గుంటూరులో కలిసి ఈ అంశాలన్నీ కూలంకషంగా చర్చించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి తెలుగు జిల్లాలను విడదీసి, ప్రత్యేకంగా హైకోర్టు, రెవెన్యూబోర్డు మొదలైన పాలనా విభాగాలతో ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పరచాలని కోరుతూ ఒక నిర్ణయానికి వచ్చి ఈ కార్యక్రమాన్ని కొనసాగించవలసినదిగా కూడా వెంకటప్పయ్యకు బాధ్యతను అప్పగించారు.

1913లో మే 20వ తేదీన బాపట్లలో ఆంధ్ర మహాసభ జరిగింది. దీనినే "ఆంధ్రుల సభ" అని "ఆంధ్ర మహాసభ" అని కూడా పిలిచారు. రాష్ట్రంలోని తెలుగు జిల్లాలనుంచి 800 మంది ప్రతినిధులు రెండు వేల మంది ప్రేక్షకులు ఈ సభకు వచ్చారు.

అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనమండలి సభ్యుడు బి.ఎన్.శర్మ సభకు అధ్యక్షత వహించారు. జాతీయ లక్ష్యాలకు, స్వాతంత్ర్య ఉద్యమానికి చేటు కలుగకుండా తెలుగు రాష్ట్ర లక్ష్యసాధనకు కృషి చేయాలని ఆనాటి ఆసభలో వక్తలు ఉద్ఘాటించారు. సభలు జయప్రదంగా జరిగి ఆంధ్ర రాష్ట్రోద్యమానికి కొంత వూపు లభించింది.

ఆంధ్ర మహాసభ 1914 మే నెలలో బెజవాడ లోను, 1915లో విశాఖపట్టణం లోనూ, 1916 మే నెలలో కాకినాడ లోనూ, 1917 మే నెలలో నెల్లూరు లోనూ సమావేశాలు జరిపి ప్రత్యేకరాష్ట్రం కోరికను పునరుద్ఘాటించుతూ వచ్చింది.

అప్పటి రాజకీయ పరిస్థితులు దేశ స్వాతంత్ర్య ఉద్యమ సంఘటనల కారణంగా ఈఉద్యమానికి అంత ప్రాధాన్యం లభించలేదు. 1920-1927 సంవత్సరాల మధ్య కూడా ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం ఈ అంశంపైఏమీ తేల్చి చెప్పలేదు. అంతేకాక అప్పుడు అధికార పార్టీ అయిన జస్టిస్ పార్టీ మంత్రులు తెలుగు వారైనప్పటికీ ఆంధ్ర రాష్ట్రోద్యమాన్ని సమర్థించలేదు.

పైగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుపై సర్కారు, రాయల సీమ ప్రాంతాల మధ్య తగాదాలు ఉన్నాయి. మద్రాసు రాష్ట్ర శాసన మండలిలో ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికై తీర్మానాలు చర్చకు వచ్చినప్పుడల్లా రాయలసీమ నాయకులు వ్యతిరేక ప్రకటనలు చేసేవారు. ఇది 1933-34 నాటి స్థితి. పైగా 1934లో రాయలసీమ మహాసభ ఏర్పడింది.

తదుపరి 1937 అక్టోబరునెల చివరిలో ఆంధ్ర మహాసభ రజతోత్సవ సభ బెజవాడలో నిర్వహించబడింది. ఆ సభలో రాయలసీమ నాయకులు తమ ప్రాంతానికి కొన్ని ప్రత్యేకతలూ, రక్షణలూ కోరుతూ తీర్మానం ప్రవేశ పెట్టారు. ఆ వివరాలు :-

1) ఆంధ్ర రాష్ట్రం ఏర్పడితే రాజధానిని మద్రాసులో కాని, రాయలసీమ జిల్లాలలో కాని ఏర్పాటు చేయాలి.

2) మంత్రి వర్గంలో సర్కారు జిల్లాలతో సమాన ప్రాతినిధ్యాన్ని రాయల సీమకు ఇవ్వాలి.

3) శాసనసభ్యులలో కూడా సమాన దామాషా ఇవ్వాలి.

4) ఉభయ ప్రాంతాలకు సమాన నిష్పత్తిలో ఖర్చులు చేయాలి.

5) ఆర్థికంగా వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికై తుంగభద్ర, నగరి వంటి ప్రాజెక్టుల్ని చేపట్టాలి.

బెజవాడ మహాసభకు హాజరైన ప్రతినిధులందరు 1937 నవంబరు 15న మద్రాసులోని శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారిల్లు "శ్రీ బాగ్‌లో" సమావేశమై ఒక ఒడంబడికకు వచ్చారు. దానినే "శ్రీ బాగ్ ఒప్పందం" అంటారు.

ఆంధ్ర రాష్ట్రం ఏర్పడగానే కర్నూలు రాజధానిగా అవతరించడానికి శ్రీ బాగ్ ఒప్పందం ప్రాతిపదిక అయింది. 1937 జులై 14న మద్రాసులో కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పడింది.

ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఉద్యమం వూపిరి పోసుకొనడానికి యిది ఒక అనుకూల పరిస్థితిని కల్పించింది.

తదుపరి 1938 నుంచి 1947 వరకు ఆంధ్ర నాయకులు పలు వేదికల నుంచి ప్రత్యేక రాష్ట్రం కాంక్షను పునరుద్ఘాటిస్తూనే వచ్చారు. 1947 ఏప్రిల్‌లోనే టి. ప్రకాశం ప్రత్యేక ఆహ్వానితుడిగా ఆంధ్ర మహాసభ ప్రత్యేక సమావేశం జరిగింది.

నూతనరాజ్యాంగ నిర్మాణంతోబాటు,ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకొనవలసినదిగా ఈ మహాసభ రాజ్యాంగ పరిషత్తును కోరింది.

1947 నవంబరు 27వ తేదీన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రాజ్యాంగ పరిషత్తులో ప్రసంగిస్తూ "ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు న్యాయ బద్ధమైనదే'

'నని ప్రకటించారు. ఇక్కడ ఒక రాజ్యాంగ మీమాంస తలఎత్తింది. 1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం ఒరిస్సా, సింధు రాష్ట్రాలు ఏర్పడినట్లు ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పరచాలా లేక రాజ్యాంగం అవతరించిన తర్వాత ఈరాష్ట్ర భవితవ్యాన్ని తేల్చాలా అనే సందిగ్ధ స్థితి వచ్చింది. ఫలితంగా రాజ్యాంగ పరిషత్ అధ్యక్షునితో 1948 జూన్ 17న భాషా ప్రయుక్త రాష్ట్రాల సంఘాన్ని నియమించారు. అలహాబాద్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్.కె. దార్ ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించారు. రిటైర్డ్ ఐ.పి.ఎస్. అధికారి డాక్టర్ పన్నాలాల్, రాజ్యాంగ పరిషత్ సభ్యుడు జగత్ నారాయణ్ లాల్ కమిటీలో సభ్యులుగా ఉండేవారు. ఈ సంఘాన్నే "దార్ కమిటీ" అనేవారు.

దేశంలోని పలు ప్రాంతాలలో భాషా పరమైన కొట్లాటల గురించి, యితర యిబ్బందుల గురించి కమిటీ పరిశీలించింది. మొత్తంమీద వేయి వ్రాతపూర్వకమైన దరఖాస్తుల్ని తీసుకొంది. 6700 మంది సాక్షుల్ని విచారించింది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వలన భారతదేశ ఐక్యతకు భంగం వాటిల్లుతుందని ప్రాంతీయ భావాలు వికృత రూపం ధరిస్తాయని పేర్కొంటూనే ఈ సంఘం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు వ్యతిరేకంగా సిఫార్సు చేసింది. ఒక వేళ చేయదలిస్తే సత్వరం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు జరపాలని కూడా పేర్కొంది.

అయితే దార్ కమిషన్ నివేదికను అటు ప్రభుత్వం కాని, యిటు కాంగ్రెసు కాని పరిగణన లోనికి తీసుకొనలేదు. పైగా భాషా రాష్ట్రాలకై ప్రజలు చేస్తున్న ఆందోళనను దృష్టిలో ఉంచుకొని, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు గురించి పరిశీలన జరపడానికై ముగ్గురు సభ్యులతో ఒక సంఘాన్ని కాంగ్రెస్ నియమించింది. జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్య ఈ కమిటీలో సభ్యులు. దీనినే జె.వి.పి. కమిటీ అంటారు.

1949లో ఏప్రిల్ నెలలో జె.వి.పి. కమిటీ తన నివేదికను కాంగ్రెసు

వర్కింగ్ కమిటీకి అందజేసింది. ఈ ఆకమిటీలోని ముగ్గురు సభ్యులలో ఇద్దరు అనగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రి, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ఉప ప్రధాని కావడం వలన ఈ నివేదిక ప్రభుత్వ అభిప్రాయాన్ని వెల్లడించినట్లయింది.

కొన్ని సంవత్సరాల పాటు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును వాయిదా వేయాలని ఆ కమిటీ స్పష్టంగా చెప్పింది. అయితే ఆంధ్రప్రాంతం సమస్యను ప్రత్యేకంగా పరిశీలించి కొన్ని షరతులు విధించింది.

ఆంధ్రరాష్ట్రం కావాలనుకుంటే ఆంధ్రులు మద్రాసు నగరంపై హక్కును వదులు కోవాలి. వివాదగ్రస్తం కాని ప్రాంతాలతో మాత్రమే ఆంధ్రరాష్ట్రం ఏర్పడుతుంది. అంతే కాక మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్రేతర ప్రాంతాలవారి సుహృద్భావంతోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అవుతుంది. ఇవి జె.వి.పి. కమిటీ నివేదికలోని ముఖ్యాంశాలు.

ఇది యిలా వుండగా మొదటి నుంచి ఆంధ్రరాష్ట్రం కోసం జరుగుతున్న ఆందోళనను శ్రీరాములు గమనిస్తూనే ఉన్నాడు. కాగా 1949 అక్టోబరు నెలలో అఖిల భారత కాంగ్రెసు కార్యవర్గ సంఘాల సమావేశం జరిపి నవంబరు 14వ తేదీ నాటికి జె.వి.పి. కమిటీ సిఫార్సును ఆంధ్ర నాయకులు అంగీకరించినట్లయితే ఆంధ్ర రాష్ట్రం అవతరిస్తుందని స్పష్టంగా ప్రకటించింది. ఈ వ్యవహారాన్ని కూలం కషంగా పరిశీలించిన పొట్టి శ్రీరాములు ప్రతిస్పందించి ఆచార్య రంగాకు, ప్రకాశం పంతులుకు తన అభిప్రాయాన్ని యిలా తెలిపారు.

సొంత రాష్ట్రం ఏర్పాటు గురించి ఆంధ్ర నాయకులలో భేద భావాలు ముదిరి పోతున్నాయి. కాంగ్రెస్ కార్యవర్గం కూడా పక్షపాత బుద్ధితో వ్యవహరిస్తున్నట్లు తోస్తున్నది. మద్రాసు నగరం విషయమై థార్ కమిటీ ప్రతిపాదనను అమలు జరపడానికి అది ఎందుకు ముందుకు రాలేదో

ఇంతవరకు కారణాన్ని తెలుపలేదు. కాని జె.పి.పి. నివేదికను అంగీక రించడమే కాక దానిని అమలు జరపాలని కాంగ్రెస్ కార్యవర్గం ఆత్రపడు తున్నది. అయితేదీనికి ప్రత్యామ్నాయం లేదా? పైగా భాషాప్రయుక్త రాష్ట్రాలు దేశం అనైక్యతకు దారితీస్తాయి అని అంటూనే మద్రాసుకై పట్టుపడుతున్న తమిళులను సమర్థిస్తున్నారు. ఏమైనప్పటికీ తమిళ, ఆంధ్ర రాష్ట్రాలు రెండు "సి" స్టేట్ ప్రాంతాలుగా ఉండవలసివస్తే ఈ సమస్యల పరిష్కారానికై నన్ను నిరాహార దీక్ష చేయవలసినదని ఆచార్య రంగా పరిహాసంగా అన్నారు.కాని నేను అందుకు సిద్ధంగానే ఉన్నాను. అయినా యిందుకు నేను అర్హుణ్ణికానని భావిస్తున్నాను. ఈ సమస్య పరిష్కా రానికి ఆంధ్రులకు న్యాయం చేయడానికి ఆచార్య రంగా, ప్రకాశంపంతులు నిరశన వ్రతం పూనాలి. ఇంతకన్న వేరే మార్గాంతరం లేదు.

తన అభిప్రాయాన్ని నిర్ద్వంద్వంగా చెప్పినప్పటికీ అగ్ర నాయకులు నిర్లక్ష్య ధోరణి వహించడం, ప్రత్యేక రాష్ట్రం కోసం ఆంధ్రులలో ఆకాంక్ష తీవ్రతరం కావడం శ్రీరాములు గమనించాడు.

ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రులకు జరుగుతున్న అన్యాయాల గురించి ఆయన పరిశీలించారు. సేద్య, విద్య, వైద్య యితర సదుపాయాల కల్పనలో ఆంధ్రకు జరుగుతున్న వివక్షపై శ్రీరాములు ఒక అవగాహనకు వచ్చాడు.

1921లో మౌంట్ ఫర్ట్ సంస్కరణలు ప్రవేశపెట్ట బడినాయి. మద్రాసు రాష్ట్రంలో 9,82,000 ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కల్పించబడింది. దానిలో 40 వేల ఎకరాలకు మాత్రమే నీరుపారుదల వసతి ఆంధ్ర ప్రాంతానికి యివ్వబడింది.

విద్యుచ్ఛక్తి, మేజర్ ఇరిగేషన్ వర్క్స్ వంటి ప్రధానమైన పదవులు 1921 నుంచి 1930 వరకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ల అధికారం క్రింద ఉండేవి. ఆ రోజులలో ముఖ్యమంత్రి సుబ్బరాయన్ తప్ప మిగిలిన వారంతా

తెలుగువారే ఉండేవారు. సర్ సి.పి. రామస్వామి అయ్యర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్‌గా ఉన్నారు. ఎంతో కృషిచేసి మెట్టూరు ప్రాజెక్టును సాధించారు. 1934లో మాత్రమే ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్‌గా మొదటిసారి ఆంధ్రుడు నియమితుడైనాడు.

1947 నుంచి అటు కేంద్ర ప్రభుత్వం కాని, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కాని రామపాద సాగర్ ప్రాజెక్టు విషయమై ఎటువంటి శ్రద్ధను కనపరచ లేదు. ఈ ప్రాజెక్టు చాలా ధన వ్యయాలతో కూడుకున్నదైనప్పటికీ ఆంధ్ర ప్రాంతం లోని డెల్టా జిల్లాలకు ఎంతో ప్రయోజనకారిగా అక్కరకు వచ్చేది.

ప్రభుత్వ సర్వీసులలో కూడా పక్షపాత వైఖరి కొనసాగింది. 1949 చివరి నాటికి ఉద్యోగాల నియామకంలో తమిళ, ఆంధ్ర ప్రాంతాల మధ్య ఎంతో తేడా కనిపిస్తుంది. ఈ నియామకాల నిష్పత్తిని పరిశీలిస్తే ఆంధ్రులకు ఉద్యోగాల నియామకంలో జరిగిన అన్యాయం గుండెను చెరువు చేస్తుంది.

1940 డిశంబరు చివరి నాటికి విద్యుచ్ఛక్తి ప్రణాళికలకు గాను మొత్తం 1,78,507 లక్షల ఖర్చు చేయవలసి ఉండగా కేవలం 16% మాత్రమే అనగా 285.50 లక్షలు మాత్రమే ఆంధ్ర జిల్లాలకు ఖర్చు చేశారు. ఇలాగే పారిశ్రామిక అభివృద్ధికై 205.85 లక్షలు ఖర్చు చేయవలసి ఉండగా దీనిలో 12% మాత్రమే ఆంధ్ర జిల్లాలకు ఖర్చుచేశారు. తమిళ ప్రాంతానికి 632 మిలియన్ యూనిట్ల విద్యుత్ మంజూరు చేయగా ఆంధ్ర ప్రాంతానికి కేవలం 42 మిలియన్ యూనిట్లు మాత్రమే మంజూరు చేశారు.

## స్వామి సీతారాం ప్రయత్నం

ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కావాలని కోరుతూ స్వామి సీతారాం రెండుసార్లు మొత్తం 55 రోజులు నిరాహార దీక్ష చేశారు. చివరకు వినోబాభావే విజ్ఞప్తిని పురస్కరించుకొని దీక్ష విరమించాడు. కాని నెహ్రూ నిర్లక్ష్య ధోరణివల్ల

వినోబాభావే వాగ్దానం భంగమైంది. నెహ్రూ ఈ నిరాహార దీక్ష పద్ధతిని నిరసించాడు. ఒప్పందాల వల్ల సమస్య పరిష్కరింప బడతుందని పునరుద్ఘా టించాడు. స్వామి సీతారాం కృషిని టి. ప్రకాశం, కళా వెంట్రావు, గోపాల రెడ్డి, సంజీవరెడ్డి, రంగా మొదలైన అగ్రనాయకులు సమర్థించారు. ఎ.ఐ. సి.సి. ఆంధ్ర ప్రాంత కమిటీ 7-6-1952 న కాకినాడలో సమావేశమై ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని తీర్మానాలు చేసింది. జూన్ 15వ తేదీ స్వామీజీ తన రెండవ దీక్షను విరమించాడు.

మద్రాసు రాష్ట్ర శాసనసభకు 1952 జనవరి మొదటి వారంలో ఎన్నికలు జరిగాయి. మొత్తం 375 సీట్లకు గాను కాంగ్రెస్ 367 సీట్లకు పోటీ చేసింది. కానీ 152 సీట్లు మాత్రమే దక్కించు కున్నది. ఆంధ్ర, ఆంధ్రేతర ప్రాంతాలలోని ప్రముఖ నాయకులంతా ఓడిపోయారు. ఆంధ్ర జిల్లాలో కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయింది. ఓడిపోయిన ఆంధ్రకాంగ్రెస్ నాయకుల్లో సంజీవ రెడ్డి, గోపాల్ రెడ్డి, కళా వెంకట్రావు ముఖ్యులు.మొత్తం 12 తెలుగు జిల్లాల్లో వివిధ పార్టీల ఫలితాలిలా ఉన్నాయి. కాంగ్రెస్-43, కమ్యూనిష్టు-42, ప్రజాపార్టీ-20,కృషిక్‌లోక్‌పార్టీలు-15, సోషలిస్టు-7, ఇతర పార్టీలు-1, స్వతంత్రులు-18 (మొత్తం 145) ఎన్నికల అనంతరం ప్రకాశం నాయకత్వంలోఉన్న కిసాన్‌మజ్దూర్ ప్రజాపార్టీ కమ్యూనిష్టు పార్టీల మధ్య యునైటెడ్ ఫ్రంటును ఏర్పరచే విషయమై చర్చలు జరిగాయి. 1952 మార్చి నెల చివరలో డెమోక్రటిక్ ఫ్రంట్ ఏర్పడింది. విస్తృతమైన దాని కార్య క్రమంలో ముఖ్యాంశంగా భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన చేర్చ బడింది.మార్చి 29వ తేదీన యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ నాయకుడుగా ప్రకాశంపంతులు ఎన్నికయ్యారు. అందలి సభ్యుల సంఖ్య 164. అయితే మార్చి 31వతేదీన కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహించవలసిందని చక్రవర్తి రాజగోపాలాచారిని ఆహ్వానించినట్లు తెలుపబడింది. గవర్నర్ అతణ్ణి మంత్రివర్గాన్ని ఏర్పరచ వలసిందిగా కోరాడు. 1952 రాజాజీ పార్టీ నాయకు

డైన వెంటనే పొట్టి శ్రీరాములు ఆంధ్రుల ఇబ్బందులను తొలగించగల ఒక పథకాన్ని ఇలా సూచించారు.

"ప్రభుత్వంలోని ప్రతి శాఖకు ఒక మంత్రి, ఒక డిప్యూటీ మంత్రి ఉండాలి. ఆంధ్రుడు మంత్రి అయితే డిప్యూటీ మంత్రిగా తమిళుడు, తమిళుడు మంత్రి అయితే డిప్యూటీ మంత్రిగా ఆంధ్ర భాష మాట్లాడే ప్రాంతానికి సంబంధించిన మంత్రివర్గం అన్ని అధికారాలు కలిగి వుండ వచ్చు. ఒకరిద్దరు మంత్రులను కేరళ నుండి గాని, కర్ణాటక నుండి గానీ, ఆయా ప్రాంతాలకు సంబంధించిన వ్యవహారాలను చూడటానికి నియ మించవచ్చు. ఆంధ్ర జిల్లాలో పరిపాలన, విద్య మొదలైన వాటికి సంబం ధించిన వ్యవహారాలు తెలుగులో సాగడానికి ప్రోత్సహించాలి. కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో కూడా ఇదే పద్ధతి కొనసాగవచ్చు. మద్రాసులో వున్న స్థానికాధికారులకు తెలుగు, తమిళం భాషలు నేర్చు కోవడానికి ఒక సంవత్సరం వ్యవధి ఇవ్వాలి. ఆ లోపుగా ప్రజలు ఏ భాషలోనైనా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకొనే సౌకర్యం కలిగించాలి. తమిళ, ఆంధ్ర ప్రాంతాలకు ఆదాయ, వ్యయ లెక్కలు ప్రత్యేకంగా చూపబడాలి. ఆంధ్ర నుండి వచ్చే ఆదాయాన్ని సమానంగా ఆంధ్ర జిల్లాల్లో ఖర్చు పెట్టాలి. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఉండాలి. ఇలా రాజగోపాలచారి మరియు ప్రకాశం గార్లకు నాయకత్వం లభించగలదు. అందువల్ల ఆంధ్ర, తమిళుల మధ్య విభేదాలు కలగవని శ్రీరాములు విశ్వసించాడు. పొట్టి శ్రీరాములు 1949లో రంగాకు, ప్రకాశానికి, 1952లో రాజాజీకి చేసిన విజ్ఞప్తుల పరంపరకు సమాధానం లభించలేదు. ఆంధ్రరాష్ట్రం అవతరించనిదే ఇక ముందు నిర్మాణాత్మక కృషి జరగదని శ్రీరాములు విశ్వసించాడు. లక్ష్య సాధనకు ఎవరో ఒకరు ఆత్మార్పణ చేయందే లాభం లేదని 1951-52 సంవత్సరాలలో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడటానికి అన్ని రాజ్యాంగ పద్ధతులు ఆలోచించ బడ్డాయని ఆయన గ్రహించాడు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడం

ఆవశ్యకమని భావించాడు. గాంధేయ పద్ధతుల ద్వారా లక్ష్యాన్ని సాధించాలని నిర్ణయించు కొన్నాడు.

పొట్టి శ్రీరాములు నిరశన వ్రతం పూనడానికి నిశ్చయించుకొన్న తరువాత పెద్దలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. పత్రికా ప్రకటనలు కూడా చేశాడు. మద్రాసుకు చెందిన న్యాయవాది ఓ. లక్ష్మీనారాయణకు లేఖ వ్రాస్తూ "ప్రత్యేక రాష్ట్రాన్ని గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాను. దీని విషయమై పెద్దలు కృషి చేస్తారన్న నమ్మకం లేదు. ఏ రాజకీయ పార్టీ చేతుల్లో కీలుబొమ్మగా మారటం నాకు ఇష్టం లేదు. ఇంతకుముందు ఎన్నో పరిష్కార దీక్షలు చేసి విజయం సాధించాను. ఈ సమస్య పరిష్కా రానికి కూడా నేనే నిరాహార దీక్ష వహిస్తాను. అధికారుల మనస్సు మార్చటం సులభం కాదు. నేను కనుగొన్న మార్గం ఒక్కటే. ఆత్మార్పణం చేయడమే. దానికి నేను సిద్ధమయ్యాను. ఎక్కడ దీక్ష వహించాలని ఆలోచిస్తున్నాను. మద్రాసులో చేస్తే తగాదాలకు దారితీసినట్లు అవుతుంది. ఆ భయం లేకపోతే ఇందుకు మద్రాసు మించిన స్థలం లేదు. ఈ అభిప్రాయం స్వామి సీతారాం గారికి నచ్చక పోవచ్చు. నీవు ఆయనకు తక్కిన వారికి తెలియ జేయాలని ప్రకటన చిత్తు ప్రతిని నీకు పంపుతున్నాను" అని రాశారు. ఆ చిత్తు ప్రతి సారాంశం ఇలా వుంది.

"మధ్యవర్తి తీర్పుకు గాను మద్రాసు నగరాన్ని వదులుకోవలసి వుంటుందని స్వామి సీతారాం చెబుతున్నాడు. మద్రాసు లేని ఆంధ్ర రాష్ట్రాన్ని నాయకులు అంగీకరించడం లేదు. విశాలాంధ్ర కోసం ఉద్యమించాలని ఉన్నవ లక్ష్మీనారాయణ విశ్వసిస్తున్నాడు. ఆంధ్ర రాష్ట్రం వస్తే చాలనుకునే వాళ్లు లేకపోలేదు. ప్రత్యేక రాష్ట్రపు కోరికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలంగీక రించాయి. అయినా అడగడానికి ఎవ్వరికీ ధైర్యం లేదు. ముందడుగువేయ డానికి భయపడుతున్నారు. ఫలితంగా ప్రజలు అంతర్గతంగా సంఘర్షణ పడుతున్నారు. ఈ సమస్య రాష్ట్రంలోని ప్రతి మేధావికి ఆందోళన కలిగి

స్తున్నది. ఈ విషయంలో కృషి చేయడానికి ఎవరూ పూనుకోవడం లేదు. దీనికి పరిష్కార మార్గం లేదా ?”

నేడు ప్రత్యేక రాష్ట్రావసరాన్ని ప్రతివారూ గుర్తించారు. ఈ విషయంలో ప్రజలకూ, ప్రభుత్వానికీ ఏకాభిప్రాయం కుదిరింది. రాష్ట్రావతరణకై అంతా ఎదురు చూస్తున్నారు. దేశం జాతీయతా భావంతో వృద్ధి చెందాలంటే మద్రాసు, బొంబాయివంటి నగరాలు ఏ రాష్ట్రానికి చెంద కూడదు. కేంద్ర ప్రభుత్వ పాలనలో ఉండాలి. ఈ నగరాలు దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల సంపదతో, తెలివి తేటలతో పెరగాలి. ఈ నగరాల ఆర్థిక వ్యవస్థలో మార్పువస్తే ఇవి కేవలం వస్తు ప్రదర్శనశాలలుగా రూపొందుతాయి ప్రాముఖ్యాన్ని కోల్పోతాయి. అంతవరకు ప్రతి ఒక్కరూ నగరాల్లో ఉండటానికి సిద్ధపడతారు. ప్రతి గ్రామం, ప్రతి పట్టణం ఏదో ఒక విధంగా నగరాలపై ఆధారపడక తప్పదు. అందువల్ల నగరాల్లో ఉండటానికి ఏ ఒక్కరిపైనా నిషేధం కూడదు. ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రం సమస్య మద్రాసు నగర భవితవ్యానికి ముడి పెట్టబడి వుంది. మద్రాసు భవితవ్యం తేలిపోతే దీనితో ఇతర నగరాల సమస్య తేలిపోతుంది. ఇప్పటి నుంచే మనం హైదరాబాదును గురించి ఆలోచించ కూడదు. అందువల్ల మనం మద్రాసు నగరంమీద హక్కును కోల్పోతాము. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత విశా లాంధ్రను గురించి ఆలోచించవచ్చు. ఏ రాష్ట్రంలోనయినా ప్రభుత్వం ప్రజల అభిరుచులు, క్షేమాలను దృష్టిలో ఉంచుకొని పని చేయాలి. అది రాజకీయ వేత్తలు, అధికారులు, వ్యాపారులు బాగుపడటానికీ ఆడుకునే ఆటస్థలం కాదు.

## మార్గాలు

1) ఏ పార్టీ అధికారంలో వున్నా లెక్క చేయకుండా విమర్శించడం, ప్రజల్లో అసంతృప్తిని రేకెత్తించడం, పన్నులు ఎగవేయడం, లాఠీచార్జీ అవకాశాలు కల్పించడం.

2) తమలో తాము పోట్లాడు కొనేటట్లు రాజకీయ నాయకులను పురికొల్పి వారి పలుకుబడితో నూతన రాష్ట్రాన్ని సాధించడం.

3) నిస్వార్థంగా ఎవరో ఒకరు ఆత్మ బలిదానం చేయడం.

రాష్ట్ర సిద్ధికోసం మూడు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించి శ్రీరాములు గాంధేయ వాదిగా మూడవ పద్ధతికి ప్రాముఖ్యాన్ని ఇచ్చాడు. గాంధేయులే అధికారులు గనుక తన సంకల్పాన్ని అర్థం చేసికోగలరని ఆశించాడు.

మద్రాసు రాష్ట్ర ఆర్థిక మంత్రి సి. సుబ్రహ్మణ్యం మద్రాసు నగరం తమిళులదేనని భారత స్వాతంత్ర్య పర్వదినాన చేసిన ప్రసంగం అంతకు ముందే రాజాజీ చేత చేయబడిన అలాంటి ప్రసంగం, వాటిపై తెలుగు మంత్రులు వ్యాఖ్యానం చేయకపోవడం పొట్టి శ్రీరాములును సెప్టెంబరు 14వ తేదీన ఆలోచించి ఒక నిర్ణయం తీసుకొనేటట్లు చేసింది.

మొదటినుంచి ఆంధ్రులపై తమిళులుచేస్తున్న జులుం, ఢిల్లీ స్థాయిలో తమిళుల మాటనే ప్రతి విషయంలోను తాళం వేస్తున్న కేంద్ర నాయకుల వైఖరి ఆయనలో ఒక క్రొత్త ఆలోచన వచ్చేటట్లు చేసింది. శాంతియుతంగా ప్రత్యేక రాష్ట్ర స్థాపన కోసం జరుగుతున్న ప్రయత్నాలను, అవి వైఫల్యం చెందుతున్న విధానాలను ఆయన బాగా అధ్యయనం చేశాడు. ఆయన ఉద్దేశ్యంలో రాజ్యాంగ పద్ధతులన్నీ ప్రత్యేక రాష్ట్రసిద్ధికి విఫలమైనట్లే భావించాడు. ఇందుకు ఏదో తీవ్రమైన కార్యాచరణ అవసరమని ఆయన గుర్తించాడు. తీవ్రం అంటే అవి తీవ్ర వాద పద్ధతులు కావు. ఫలితాన్ని తప్పకుండా ఇచ్చేవిగా ఉండాలి. లక్ష్య సాధనలో లక్ష్యమే కాదు ఎంచు కొన్న మార్గం కూడా సరిఅయినదిగా ఉండాలనే గాంధీజీ సూత్రం ఆయనకు అణువు అణువున జీర్ణమైన విషయం. అందుకే శాంతియుత, అహింసా మార్గంలో రాష్ట్రాన్ని సాధించాలనుకొన్నాడు.

ఈ నిర్ణయానికి వచ్చిన వెంటనే శ్రీరాములు తగిన సన్నాహాలు ప్రారంభించాడు. ప్రథమంగా స్వామి సీతారాం అనుజ్ఞ తీసుకోవాలను కొన్నాడు. అప్పుడు స్వామి సీతారాం ఢిల్లీ వెళ్లి తన అనుచరులతో ఆంధ్ర రాష్ట్రం కోసం సామూహిక సత్యాగ్రహాన్ని తలపెట్టాడు. పొట్టి శ్రీరాములు అతనికి ఆటంకం కాదలచుకోలేదు. అప్పటికే ప్రజలు నిరాహార దీక్షలంటే విసిగి పోయారు. అవి వ్యర్థమైన పద్ధతులని పరిహాసం చేస్తున్నారని గ్రహించాడు. కనుక తాను నామ మాత్రంగా నిరాహార దీక్ష పూనదలచు కోలేదు. అప్పుడు ఆయనకు రెండే మార్గాలు కనిపించాయి. ఒకటి స్వామి సీతారాం ఆందోళనను బలపరచడం. రెండు తానే స్వయంగా దీక్ష ప్రారంభించడం.

తన ఆమరణ నిరాహారదీక్షకు అనువైన స్థలంకోసం ఆలోచించాడు. మద్రాసు నగరం నడిబొడ్డున ఉన్నది, నాలుగు రోడ్ల కూడలిగా ఉన్నది, పది మందికి తెలిసినది అయిన మహర్షి బులుసు సాంబమూర్తి గారి ఇల్లే తగినదిగా భావించాడు. త్వరలోనే ఆయన అనుమతి కూడా శ్రీరాములుకు లభించింది. బులుసు సాంబమూర్తి గారు ఆనాటి రాజాజీ ముఖ్యమంత్రిగా గల ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభ స్పీకరు. నిర్ణయం తీసుకొన్న వెంటనే అన్ని వార్తా పత్రికలద్వారా ఆమరణ నిరాహారదీక్షకు నిర్ణయాన్ని తాను తీసుకోటానికి కారణాలను అందరికీ తెలియజేశాడు. తన లక్ష్యసాధనలో ప్రాణాలనైనా తృణప్రాయంగా వదలివేస్తానని ఆయన ఆ పత్రికా ప్రకటనలో తెలిపాడు.

హిందువుల బలిపూజాదినం నాడు నిరాహార దీక్ష ప్రారంభించడం అన్ని విధాలా శ్రేయస్కరమైనదని, మద్రాసులోని తన ఇంటిలోనే శ్రీరాములు దీక్ష ప్రారంభించ వచ్చునని బులుసు సాంబమూర్తి అంగీకరించినట్లు బి. లక్ష్మీ నారాయణ తెలిపారు. అందుకు శ్రీరాములు అమితానందం చెందాడు.

1952 అక్టోబరు 19వ తేదీన బులుసు సాంబమూర్తి గారి ఇంటిలో ఉదయం గం॥ 10:15 ని॥లకు మద్రాసులోని వీరభద్రన్ వీధిలో 126

పొట్టి శ్రీరాములు తన ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించాడు. స్వామి సీతారాం ఆశీర్వదించాడు. రాష్ట్రంలోని వివిధ ఆందోళనలు నిలిపివేయ బడ్డాయి.

ఆంధ్రోద్యమాన్ని గురించి, మద్రాసు నగర భవితవ్యాన్ని గురించి తన నిరాహారదీక్ష యొక్క లక్ష్యాలను గురించి  దీక్షకు కూర్చొనబోయే ముందు మద్రాసు నగర పౌరులకు క్లుప్తంగా వివరిస్తూ శ్రీరాములు ఒక విజ్ఞప్తి చేశాడు.

ఈ సందర్భంలో ఆనాటి దేశ రాజకీయ స్థితిని కొంత పరిశీలించ వలసి ఉన్నది. కేంద్ర ప్రభుత్వంలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా ఉండేవారు. ఆయన అకళంక దేశభక్తుడు. మహా మేధావి సందేహంలేదు. కానీ మనిషికి కొంత మొండి పట్టుదల ఉండేది. ఒక విషయాన్ని గురించి ఆయన బహుముఖాలుగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చేవాడు. ఆ తరువాత ఇక దానిని ఎట్టి పరిస్థితులలో మార్చుకొనేవాడు కాదు. అప్పట్లో దేశం రాష్ట్రాలుగా విభజితమై ఉన్నా వాటికి ఒక పద్ధతి, విధానం అనేది లేకుండా ఉండేది తెలుగు మాట్లాడే ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో కొంత, నిజాంరాజు క్రింద కొంత ఇలా ఉండేది. ముఖ్యంగా కొన్ని రాష్ట్రాలలో 4, 5 భాషలు మాట్లాడే వారు కూడా ఉండేవారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకొనటానికి ఆ రాష్ట్ర యంత్రాంగం ఇబ్బందులు పడుతుండేది. అందు వలన ఒక్కొక్క భాష మాట్లాడే ప్రజలను ఒక్కొక్క ప్రత్యేక రాష్ట్రంగా విడదీయా లని ఒకవాదం ఉండేది. అయితే ఈ విధంగా భాషాప్రయుక్త రాష్ట్రాలుగా విభజించుకొంటూ పోతే దేశ సమైక్యత భంగ పడుతుందని, దేశ సమగ్రత సమైక్యత దృష్ట్యా ఇది క్షేమకరమైన విదానం కాదని కొందరి అభిప్రాయం. అయితే భాష మనుష్యులను, మనసులను దగ్గరకు తెస్తుందని, ఒకే భాష మాట్లాడే వారిని కలపడం, వారిలో ఐకమత్యం పెంపొందించటం సులభ మని, రాష్ట్రంలో ఐక్యత, తద్వారా దేశ సమగ్రతకు దారి దగ్గర అవుతుందని

మరి కొందరి అభిప్రాయంగా ఉండేది. ఈ విధంగా విభజించగా ఏర్పడే క్రొత్త రాష్ట్రాల మధ్య అసమానతలు తక్కువగా ఉంటాయని వారి అభిప్రాయం.

అయితే భాషా ప్రయుక్త రాష్ట్రాలను సమర్థిస్తూ వాదించేవారు, ఇప్పుడు మన రాష్ట్రాలు ఏవీ స్వయం పోషకత్వం కలవికావు. ఏదో ఒక అవసరానికి ఇతర రాష్ట్రాలపై ఆధారపడవలసినదే. అసలు మనది ఫెడరల్ రాజ్యాంగం. ఆ రాజ్యాంగ విధాన స్ఫూర్తిని నిలబెట్టాలంటే భాషా ప్రాతిపదికగా రాష్ట్రాలను ఏర్పరచాలి. అవి మిగిలిన రాష్ట్రాల నుంచి, దేశం నుంచి విడిగా మనజాల పోవటమేకాదు అసలు ఆ ప్రశ్నకు అర్థమే లేదు. వాటిమధ్య సంబంధాలు ఏమాత్రం దెబ్బతినవు పైగా దేశ సమైక్యత, సమగ్రతను పెంచటానికి ఇలా ఏర్పడిన రాష్ట్రాలే స్ఫూర్తి కలిగిస్తాయని కొందరి భావన. ఇలాంటి భావాల నేపథ్యంలో నెహ్రూ అభిప్రాయం అప్పటికి భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు భిన్నమైనదే.

## అమరజీవి

పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష సర్వోత్తమమైన ఆత్మ బలిదానానికి ఉదాహరణంగా చెప్పవచ్చును. అది ప్రపంచంలోనే సాటి లేనిది. ప్రపంచంలో ఇద్దరు వ్యక్తులు మాత్రమే ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఒకరు ఐర్లండుకు చెందిన మేక్విని. అయితే అతని ఆరోగ్యానికి సంబంధించిన చికిత్సాలయపు రికార్డు లభించడం లేదు. రెండవ వారు పంజాబు రాష్ట్రానికి చెందిన శ్రీ జితేంద్రదాస్. మరణ పర్యంతం నిరాహార దీక్ష కొనసాగించాడు. కానీ జైలు అధికారులు అతనికి బలవంతంగా కృత్రిమ భోజనం యిచ్చినట్లు తెలిసింది. చికిత్సాలయపు రికార్డు ఉన్నా అది పాడు చేయబడింది. అయితే శ్రీరాములు చేసిన నిరాహార దీక్ష చాలా మందిని ఆలోచింప చేసింది. ప్రజలందరికీ ఆసక్తి కలిగించే లక్ష్యంతో అదిముడిపడి

వుంది. కనుక అదివైజ్ఞానికంగా, వైద్యశాస్త్ర పరంగా, మానసిక శాస్త్ర పరంగా, ఆధ్యాత్మికంగా, మతపరంగా, సామాజికంగా ప్రసిద్ధి గాంచినది. ఆయన దీక్ష వహించిన సమయంలో పర్యవేక్షించడానికి డా॥ కస్తూరి నారాయణ మూర్తి, యం.డి. లెఫ్టినెంట్ కర్నల్ బి.యన్. శాస్త్రి, ఐ.యం.యస్. (రిటైర్డు) డా॥ యస్.యల్. కాంతారావు, యం.బి.బి.యస్. డా॥ ఎ.వి. అవధాని, (యల్.యం.సి.) మున్నగు వారొక సంఘంగా ఏర్పడ్డారు. భీమవరం ప్రకృతి ఆశ్రమ వైద్యుడు డా॥ వి. కృష్ణంరాజు, డా॥ బాలసుందరం, పాథాలజిస్ట్, ఎబ్రిల్స్ లాబరేటరీస్ మైలాపూర్, డా॥ కె.ఆర్. దొరైస్వామి, రేడియోలజిస్ట్, మైలాపూర్, మొదలైనవారు పై డాక్టర్ల సంఘానికి సహకరించారు.

1952 అక్టోబరు 19 వ తేదీ ఉదయం 10 గంటలకు మద్రాస్ మైలాపూర్‌లో బులుసు సాంబమూర్తి ఇంట్లో శ్రీరాములు నిరాహార దీక్ష ప్రారంభమైంది. దీక్ష సమయంలో అతని దైనందిన కార్యక్రమం హిందువుల ఉపవాస దీక్షలా నియమబద్ధంగా సమయ పాలనతో నిర్వహించబడింది.

దీక్షను ప్రారంభ దినాలలో అటు ఆంధ్ర ప్రాంతంలో కానీ, తమిళనాడు ప్రాంతంలో కానీ ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వంలో గానీ, కేంద్రప్రభుత్వం నుంచిగానీ ఎలాంటి స్పందన రాలేదు. అందరూ ఇంతకు ముందు స్వామి సీతారాం, శ్రీరాములు కొన్ని సమస్యలపై చేసిన నిరాహార దీక్ష లాంటిదే ఇదీఅని భావించారు. 35 రోజులు గడచిన తరువాత జనంలో కొంతలో కొంత చలనం వచ్చింది. ప్రజలలో ఆందోళన ప్రారంభం అయిన కొద్ది రోజుల్లో నాయకులకు ఎక్కింది. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటును కోరుతూ కేంద్ర ప్రభుత్వా నికి, ప్రధాని నెహ్రూకు లేఖలు, టెలిగ్రాంలు కుప్పలు తెప్పలుగా వెళ్ళాయి.

రోజుకు 4 నిమ్మకాయలు, 4 చెంచాల టేబుల్ సాల్ట్, 3 చెంచాల సోడా ఉప్పు, 2 ఔన్సుల తేనె (మైసూరుది సకాలంలో సేకరించబడింది)

2 ఎనిమాలు (ఉదయం, సాయంత్రం) రెండుమార్లు ఉదయం సాయంత్రం ఎండలో ఉండటం, రెండు మార్లు చన్నీటి స్నానం, రెండుసార్లు మట్టి పట్టీలు పొట్టి శ్రీరాములు నిరాహార దీక్షలో దైనందిన కార్యక్రమాలుగా ప్రాముఖ్యం వహించాయి.

దీక్ష ప్రారంభించిన మొదటిరోజు వైద్యుల రికార్డు ఇలా ఉంది. వయస్సు 51 సంవత్సరాలు, నల్లని శరీరం, ఎత్తు 5-2 1/2, బరువు 119 యల్.బి. యస్. చిరునవ్వుతో ఆనందంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నాడు. చూడవచ్చిన వారిని, వైద్యులను చిరునవ్వుతో ఉత్సాహంగా ఆహ్వానించారు.

1948లో సేవాగ్రాం ఆశ్రమంలో పొట్టి శ్రీరాములు తన 28 రోజుల నిరాహార దీక్ష కొనసాగించినప్పుడు నిమ్మరసాన్ని తీసుకోవడం వల్ల వాంతు లయ్యాయి. ప్రతిదినం నియమ బద్ధంగా నిమ్మరసాన్ని తేనెతో కలిపి మొదటి రోజు నుండి సేవించడం వల్ల అతనికి వాంతులు రాలేదు. ఒక నిమ్మకాయ రసం, రెండు పింటుల (పింటు 12 ఔన్సులు) నీళ్లతో కలిపి రెండు చెంచాల ఉప్పు వేసుకొని రోజు మార్చి రోజు తాగవలసిందని ఎనిమా తీసుకోవల సిందని వైద్యులు అతనికి సలహా యిచ్చారు.

పొట్టి శ్రీరాములు నిరాహార దీక్ష ప్రారంభించిన 45వ రోజు 2-12-1952న అతని ఆరోగ్యంలో తీవ్ర పరిణామం సంభవించినట్లు వైద్యులు ప్రకటించారు.

కళ్లు గుంటలు పడ్డాయి. శరీరం ఎండి పోయింది. దగ్గు విపరీతంగా ఉంది. ఏదైనా ఆధారం లేకుండా కదలలేక పోతున్నాడు.

వార్తాపత్రికలు అన్నీ శ్రీరాములు గారి ఆరోగ్యపరిస్థితిని తెలియ జేస్తున్నాయి. అయినా మద్రాసు ప్రభుత్వంలో ఏ మాత్రం స్పందన కనిపించ లేదు. ఇక ప్రధానమంత్రి నెహ్రూ తన పట్టుదల వీడలేదు. అసలు ఆసంఘట నను ఆయన పట్టించుకొననే లేదు.

పొట్టి శ్రీరాములు దీక్ష ప్రారంభించిన 45వ రోజు వరకు పత్రికలు గానీ, రాజకీయ నాయకులు గాని అంతగా ప్రాధాన్యమీయలేదు. 45వ రోజు(2-12-1952) వైద్యుల ప్రకటనా పత్రం పత్రికలలో ప్రచురింపబడి అతని పరిస్థితి విషమంగా ఉందని తెలిసిన తరువాతనే కొంచెం అలజడి బయలు దేరింది.

కేంద్ర శాసన సభ స్పీకర్ జి.మౌలాంకార్ నుండి డిప్యూటీ స్పీకర్ అనంత శయనం అయ్యంగార్ నుండి శ్రీరాములుకు సానుభూతి లేఖలు వచ్చాయి. సత్వర ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం కోసం తాము చేయవలసిందంతా చేశామని, లక్ష్యం త్వరలో నెరవేరబోతుందని కనుక దీక్ష విరమించాలని ఆంధ్ర ప్రాంత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడైన నీలం సంజీవరెడ్డి, యస్. శంభు ప్రసాద్ ఢిల్లీ నుంచి పొట్టి శ్రీరాములుకు తంతి వార్తలు పంపించారు. నిరాహార దీక్ష వలన తాను ఆశించిన ప్రయోజనం ఇంకా చేకూరలేదు. కనుక శ్రీరాములు వారికి సమాధానం ఇవ్వలేదు. దీక్షనూ విరమించలేదు.

8-12-1952న నిరాహార దీక్ష ప్రారంభించి 50 రోజులు అయింది. తరువాత భారత ప్రధాని నెహ్రూ దానిని విమర్శించాడు. మద్రాసు నగరం లేకుండా మద్రాసు రాష్ట్రంలోని వివాదగ్రస్తం కాని తెలుగు ప్రదేశాలతో సత్వరమే ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటుచేయడానికి భారత ప్రభుత్వం నిశ్చయించిందని అందుకు అనుగుణంగా వారు ఒక సాధారణమైన ఒప్పందానికి రావలసి ఉంటుందని ఆ మరునాడు నెహ్రూ రాజ్యసభలో ప్రకటించారు. అది లోగడ ఆయన చేసిన ప్రకటనలను పునరుద్ఘాటన చేయడమే. నెహ్రూ ప్రకటనపై దీక్ష విరమించాలని పొట్టి శ్రీరాములుకు చేసిన విజ్ఞప్తులన్నీ వ్యర్థమయ్యాయి. స్వామి సీతారాం నిరాహార దీక్ష చేసినప్పుడు నెహ్రూ తాను చేసిన ప్రకటనల ప్రకారం నడుచుకోలేదు. కాబట్టి ఆ విషయాన్ని గుర్తుంచుకొన్న శ్రీరాములు దీక్ష విరమించలేదు.

నెహ్రూ చేసిన ప్రకటనకు రాజగోపాలచారి భాష్యం చెప్తూ, ఆంధ్ర రాష్ట్ర నిర్మాణ విషయంలో ఆంధ్రులు మద్రాసును మరచిపోవాలి, ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాలంటే ఆంధ్ర జిల్లాలు రాయలసీమ జిల్లాల ప్రజల మధ్యఒక అంగీకారం కుదరాలి అప్పుడే ఏదైనా ఆలోచించేది అని ప్రకటించాడు. ఇది విషయాన్ని చల్లబరచకపోగా ఇంక కాస్త రెచ్చగొట్టే ప్రకటనగా భావించ బడింది.

పొట్టి శ్రీరాములు మేనల్లుడు యన్.ఆర్. గుప్తా నెహ్రూ ప్రకటనను చదివి వినిపించాడు. శ్రీరాములు "నెహ్రూ మనలను తెలివితేటలు లేనివారుగా భావిస్తున్నాడు" అని ప్రకటించాడు. ఆ సమయంలో ఆంధ్ర దేశంలో అక్క డక్కడా ఆందోళనలు ప్రారంభమయ్యాయి. హర్తాళులు కూడా జరిగాయి. డిసెంబరు 12, 13, 14 తేదీల్లో (నిరాహార దీక్ష బూనిన 55, 56, 57 దినాలు) పొట్టి శ్రీరాములు పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది.

డిసెంబరు 11న (54 రోజులు) డా॥ కస్తూరి నారాయణమూర్తి రాత్రి 11 గంటలకు పొట్టి శ్రీరాములుకు వైద్యపరీక్ష జరిపాడు. శ్రీరాములు నారాయణ మూర్తితో తన ఉపవాస నియమాలయిన ఈ క్రింది నాల్గింటిని మెడికల్ బోర్డు సభ్యులకు, సాంబమూర్తి గారికి తెలియజేయవలసిందిగా కోరాడు.

మొదటి నియమం – నిరాహార దీక్ష యొక్క పవిత్రతకు భంగం కలిగించే పనిని మీలో ఎవ్వరూ చేయరాదు. రెండవది – ఏదైనా చికిత్స చేయడం అవసరమనిపిస్తే భీమవరం ఆశ్రమంలో వున్న డాక్టర్ కృష్ణంరాజుతో సంప్రదించి వారేమన్నదీ నాకు తెలియజేయాలి. నా అనుమతి లేనిదే ఏ చికిత్సా చేయరాదు. మూడవ నియమం – నేను స్పృహ తప్పిన సంద ర్భంలో నా నిరాహార దీక్షకు కళంకం కలిగించే ఎలాంటి పనిని ఎవ్వరూ చెయ్యరాదు. నాలుగవ నియమం – దేశంలో అక్కడక్కడ హింసా ప్రవృత్తి

చెలరేగు తున్నట్లు తెలిసింది. మహాత్మాగాంధీ సహచరునిగా నేను ప్రతి ఒక్కరినీ అహింసా సిద్ధాంతాన్ని పాటించవలసిందిగా కోరుతున్నాను. ఆ మరునాడే ఈ నియమాలు సాంబమూర్తి గారికీ, వైద్య బృందానికీ తెలియ చేయబడ్డాయి.

1952 డిసెంబరు 14వ తేదీ (57వ రోజు) నాడు వైద్య పరీక్ష ముగించిన తరువాత ప్రజలంతా మీ ఆరోగ్యాన్ని మనఃపూర్వకంగా కోరుకుంటున్నారు. వారి కోరిక మేరకు దీక్ష విరమించవలసిందని డా॥ నారా యణ మూర్తి కొంత స్వాతంత్ర్యం తీసుకొని శ్రీరాములును కోరాడు. అందుకు శ్రీరాములు తన అసమ్మతిని తెలిపాడు. మౌనం వహించి నోటిపై వేలేసుకున్నాడు. నిశ్శబ్దంగా అతడు కళ్ళు మూసాడు. ముఖ కవళికల్లో నిరాహార దీక్షను కొనసాగించాలనే ధృఢ నిశ్చయం కనిపించింది.

పొట్టి శ్రీరాములు దీక్ష ప్రారంభించిన 58వ రోజు (15-12-1952) ఆయన వైద్యులు, శ్రేయోభిలాషులు అతడు జీవిస్తాడనే ఆశను వదలుకొన్నారు.

నిద్రలేదు. తరచుగా స్పృహ తప్పినట్లు కనిపిస్తున్నాడు. మైకంలో తల తిప్పసాగింది. క్రమంగా పరిస్థితి విషమించ సాగింది. హఠాత్తుగా అపాయకరమైన పరిణామం తోచింది. క్రమంగా పరిస్థితి విషమించింది.

ఆ రోజు నాలుగు గంటలకు డా॥ కృష్ణంరాజు సతీసమేతంగావచ్చి శ్రీరాములును చూసి వెళ్లారు. అప్పుడు ఆయన ప్రశాంతంగా వున్నాడు. సాయంత్రం గం॥ 7-15కు నాడి వేగంగా కొట్టుకోసాగింది. హృదయ స్పందన బలహీనమైంది. నిమిషానికి 32 సార్లు శ్వాస ఆడసాగింది. పొత్తి కడుపు స్థితి అస్తవ్యస్త మైనది. ఎనిమాచేస్తే నీరు వెలుపలికి రాలేదు. ఆరోగ్యపరిస్థితి పూర్తిగా విషమించింది.

రాత్రి గం. 9-45 నిమిషములకు శీతలం పెరిగింది. హృదయ స్పందనం వినిపించలేదు. కల్నల్ టి.యస్.శాస్త్రి చికిత్స చేసేటప్పుడు శ్రీరాములు స్పృహ కోల్పోయాడు. వెంటనే బులుసు సాంబమూర్తి డాక్టర్లం దరినీ సమావేశ పరిచాడు.

ఆనాటి శ్రీరాములు ఆరోగ్య పరిస్థితి ప్రకటించబడింది. శ్రీరాములు అంతిమ దశ సమీపిస్తున్నది. కాబట్టి రాత్రి 10 గంటలకు ప్రకటించబోయే ప్రకటన మాత్రమే చివరిది కాగలదని వైద్యులు నిశ్చయించారు. శ్రీరాములు శ్వాసలో ఎగుడు దిగుడు ప్రారంభమైంది. శ్వాస నాళంలో ఘర్షణ ప్రారంభ మైంది. నాడి రెండు చేతుల్లోకూడా అందడం లేదు. ఉన్నట్టుండి శ్వాసఆగి పోయింది. రాత్రి 11-20 ని॥లకు గుండె ఆగిపోయింది. గుండె ఆగిన 3 సెకండ్లకు శ్రీరాములు తుది శ్వాస విడిచాడు. సరిగ్గా 11 గంటల 23 ని॥లకు పరమపదించాడు.

అప్పుడు సాంబమూర్తి, ఇంట్లో ఉన్న అందరు శ్రేయోభిలాషులూ, ప్రేమ విశ్వాసాలతో అతని పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని 25 నిమిషాల పాటు రామధున్ పాడారు. అక్కడ బులుసు సాంబమూర్తి, స్వామి సీతారం, శ్రీరామదేశికన్, యన్.ఆర్. గుప్తా (శ్రీరాములు మేనల్లుడు), డా॥ రంగయ్య (శ్రీరాములు సోదరుడు), మోతె నారాయణ రావు, భాగవతుల లక్ష్మీ నారాయణ, డా॥ కృష్ణంరాజు, ఇ. సుబ్రమణ్యం మున్నగు వారున్నారు.

1952 డిసెంబరు 16 ఉదయం దావాగ్నిలా శ్రీరాములు మరణ వార్త దేశ మంతటా వ్యాపించింది. దేశం నలుతెరల నుండి శ్రీరాములు అంతిమ దర్శనం కోసం జనప్రవాహం మద్రాసు నగరానికి సాగింది.

ప్రజలందరికి కడసారి చూపు అందడానికి శ్రీరాములు భౌతిక కాయాన్ని రోడ్డు మధ్యలో కూర్చున్న పద్ధతిలో ఉంచారు.

# అంతిమ యాత్ర

మధ్యాహ్నం రెండు గంటలకు పొట్టి శ్రీరాములు శవయాత్ర బులుసు సాంబమూర్తి గారి ఇంటినుండి ప్రారంభమయింది. అలంకరించబడిన ఒక రథం మీద భౌతిక కాయం ఉంచబడింది. ఆ రథాన్ని మద్రాసు పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు లాగారు.

ఆంధ్ర రాజ్యం ప్రాచీన వైభవాన్ని తెలిపే పాటలు పాడుతూ సినీ కళాకారుడు మోపర్రు దాసు ముందు నడుస్తుండగా శవయాత్ర ప్రారంభ మయింది. రామధున్ బృంద గానం కొనసాగుతూనే ఉంది. ఆంధ్ర భక్తుడైన శ్రీరాములు మరణానికి విచారిస్తూ నల్ల బాడ్జీలు ధరించారు. అతని శరీరంపై పూలదండలు, గులాబీలు వర్షించాయి.

శకటం మీద బులుసు సాంబమూర్తి, డా॥ కృష్ణంరాజు, మోతె నారా యణరావు, యన్.ఆర్. గుప్తా, ఆయన బిడ్డలు, రంగయ్య గుప్తా, శ్రీమతి సుభద్రమ్మ (కొమరవోలు), ఎర్నేని సుబ్రహ్మణ్యం, యస్.యస్. దేశికన్, శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు, ఓ.యస్. శర్మగార్లు ఆసీనులై యున్నారు.

ఊరేగింపు అడియప్ప నాయకర్ స్ట్రీట్ గుండా పొట్టి శ్రీరాములు జన్మించిన నెం. 163 అన్నా పిళ్లై వీధి చేరింది. అక్కడ కొన్ని నిముషాలు ఊరేగింపు నిలిచి పోయింది. అక్కడి నుండి ఊరేగింపు "ది ఎలిఫంట్ గేట్" జిమెల్లోన్ రోడ్డు, ఉప్పుకొటార్లు, అన్నార్రిస్ట్రీటు గుండా శ్మశాన వాటికకు చేరింది. ఆ రోజు సాయంత్రం గం. 4-55 నిమిషములకు విజయవాడ నుండి కారులో మద్రాసు చేరిన టి.ప్రకాశం పంతులు, విజయవాడ మునిసిపల్ ఛైర్మన్ టి.వి.యస్. చలపతిరావు, మెమోరియల్ హాల్ ఎదుట శవయాత్రలో కలిశారు. ఈ యాత్ర 4 1/2 గంటల్లో 8 మైళ్లు కొనసాగి తుదకు శ్మశాన వాటిక చేరింది. సా॥ 7-15 ని॥లకు చితి దగ్గరకు తీసుకొని రాబడింది. అక్కడ గంధపు చెక్కలు కుప్పలుగా అమర్చబడ్డాయి.

అర్ధగంట సేపు వేద మంత్ర పఠనం జరిగింది. శ్రీరాములు శవాన్ని చితిపై ఉంచారు. అతని సోదరుడు రంగయ్య గుప్తా చితికి నిప్పటించాడు.

## శ్రద్ధాంజలి

శ్మశానానికి చేరిన ఆంధ్ర నాయకులు అక్కడవున్న ఒక వరండాలో చేరి అంత్య క్రియల సందర్భంగా ప్రసంగించారు. ఘంటసాల వెంకటేశ్వర రావు ఒక ప్రార్థనా గీతాన్ని పాడారు.

శ్రీరాములు చేసిన ఈ ఆత్మబలిదానం ద్వారా నిరాహార దీక్ష యొక్క మహత్తరమైన శక్తిని మనందరికీ అర్థమయ్యేటట్లు చేశాడు.

పొట్టి శ్రీరాములు భౌతికకాయం బూడిద అయింది. ఒక పెద్ద పాత్రలో ఆ చితాభస్మం సేకరించబడింది. 17-12-1952న ఆ చితాభస్మం భారత దేశంలోగల సముద్రాలు, పవిత్ర నదులు, సరస్సులలో చల్లడానికి మద్రాసు, నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, కాశీ, రామేశ్వరం మొదలైన నగరాలకు చేర్చబడింది. దేశభక్తుడైన శ్రీరాములు శరీరం, ఆత్మ, భారత దేశంలోని గాలి, నీరు, నేల అంతటా నిండిపోయాయి.

## ఆంధ్ర రాష్ట్రం

1953 నవంబరు 1వ తేదీన వచ్చింది. అదే "ఆంధ్రరాష్ట్రం" అవతరణ ఘట్టం.

ప్రత్యేక రాష్ట్ర సాధన పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానం వలన రూపు దాల్చింది. నలభై  సంవత్సరాలపాటు ఆంధ్రులు సాధించిన రకరకాల పోరాటాల ఫలితంగా, 58 రోజుల పాటు పొట్టి శ్రీరాములు సాగించిన నిరాహారదీక్ష ఫలితంగా కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం అవతరించింది.

పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానం తదనంతరం తీవ్ర పరిణామాలు సత్వర ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి దారితీశాయనడంలో సందేహం లేదు.

# పొట్టి శ్రీరాములు జిల్లా

సత్యాగ్రహం ద్వారా అపురూప, అపూర్వ విజయాలు సాధించవచ్చు నని గాంధీజీ తన ఉద్యమాల ద్వారా నిరూపించిన ప్రవక్త అయితే పొట్టి శ్రీరాములు ఆ మహాప్రవచనాన్ని నిజజీవితంలో, సామాజిక లక్ష్యాల సాధనలో అనువర్తింప జేసుకొని ప్రజా బాహుళ్యంలో ప్రచారంచేసిన దూత అనాలి.

బాపూజీ సాహచర్యం వలన, జీవిత అనుభవం వలన, సమాజాన్ని విశ్లేషించుకొనే వినమ్ర స్వభావం వలన ఆయనకు ఈ దేశంలో విశిష్ట స్థానం లభించింది. స్వతంత్ర భారతదేశ చరిత్రలో శ్రీరాములు స్థానం అద్వితీయమైనదని ప్రముఖులు అభివర్ణించడానికి ఇదే కారణం.

ఆయన సులభమైన భాషలో మృదువుగా మాట్లాడేవాడు. ఏ విషయమై కూడా అనవసర వాదనలకు దిగే స్వభావం కాదాయనది. ఉత్తమ ఆశయాలను ఉన్నత ప్రమాణాలతో ఆచరణలో పెట్టేవాడు. తనకు దగ్గరగా వచ్చిన వారిని కూడా అలా మలిచే నేర్పరి ఆయన.

సంఘ సంస్కర్తగా వైయక్తిక, సామూహిక స్వరూపాలను సమన్వయం చేసుకొని, భౌతిక ఆధ్యాత్మిక భావ సంపుటిని జోడించుకొని శ్రీరాములు విజయాలు సాధించాడు.

గాంధేయ సిద్ధాంతం మనిషిని నైతికంగా, ఆధ్యాత్మికంగా కూడా ఉన్నతుణ్ణి చేయాలని ప్రవచిస్తుంది. శ్రీరాములు ఈ తత్వాన్ని అస్థిగతం చేసుకొన్నాడు కనుకనే ఆయన తన ఉద్యమాలలో, జీవన విధానాలలో అటు భౌతిక వికాసానికి, యిటు ఆధ్యాతిక ఉన్నతికి ప్రాధాన్యం ఇచ్చారు. భౌతిక సిద్ధాంతాలకు నైతిక సూత్రాలకు తేడా ఏమీ లేదని, స్వాభావిక సంఘర్షణలేదని తన జీవితం ద్వారా నిరూపించి రాజకీయ సమస్యకు నైతిక పరిష్కారాన్ని చూపించిన మనీషి ఆయన.

ఆంధ్ర రాష్ట్రావతరణకు, ఆ తర్వాత భారతదేశంలోనే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడానికి ప్రధాన కారకుడైన శ్రీరాములును భారతీయులు ముఖ్యంగా ఆంధ్ర, కర్నాటక, మలయాళ, మహారాష్ట్ర ప్రజలు ఎంతగానో ఆరాధిస్తారు. ఈనాడు శ్రీరాములు పేరిట ఎన్నో పాఠశాలలు, విద్యా ధార్మిక సంస్థలు అవతరించి పనిచేస్తున్నాయి. తన ఉద్యమానికి కేంద్ర స్థానంగా ఎంచుకొని పనిచేసిన నెల్లూరు జిల్లా పేరును "పొట్టి శ్రీరాములు జిల్లా"గా మార్చి ఆ అమరజీవి అక్షయ స్మృతిని శాశ్వతం చేయాలి. అది ఆంధ్రుల అందరి కర్తవ్యం.

★ ★ ★

## అమరజీవి

# పొట్టి శ్రీరాములు

(1901 - 1952)



VICTORY
విక్టరీ పబ్లిషర్స్
# 30-17-3ఎ, వారణాసి వారి వీధి, సీతారాంపురం,
విజయవాడ - 520 002, ఫోన్ : 0866-2444156